అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 07-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 66 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

నాలుగు నెలలా.. మరీ ఎక్కువే

- ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి అంత సమయం అవసరం లేదు
- 'ఒక్క క్లిక్'తో ఎస్బీఐ సమాచారాన్ని వెల్లడించొచ్చు : రాజకీయ విశ్లేషకులు, నిపుణుల వెల్లడి

వివరాలు 3లో



చెన్నైలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

మీ ఆంక్షలు తగవు..?

కేరళకు కేంద్రం పెట్టిన షరతులపై సుప్రీం అసంతృప్తి

- ఆర్టికల్ 131 ప్రకారం పిటిషన్ దాఖలు వారి హక్కు
- ఆ పిటిషన్ ఉపసంహరించుకోవాలనే పట్టుదల తగదు : కేంద్రాని హితవు
- మరోసారి చర్చలు జరపండి : కేంద్రం, కేరళ ప్రభుత్వాలకు సుప్రీం సూచన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రుణ పరిమితిపై కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ఉపసంహరించుకుంటే అదనపు రుణాలకు అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతుపై అత్యున్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. అది ఆర్టికల్ 131 ప్రకారం వారి హక్కు అని, కేరళ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని పట్టుపట్టొద్దని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్ర రుణ పరిమితులపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలను సవాలు చేస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం కేంద్ర ప్రభుత్వంపై కేరళ రాష్ట్రం దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేరళ రుణాలు తీసుకునే అధికారాలపై కేంద్రం విధించిన పరిమితుల వల్ల తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు మరో దఫా చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు కేరళ ప్రభుత్వాన్ని ధర్మాసనం కోరింది. ఈ సమస్యపై మరింత చర్చించేందుకు కేంద్రం, కేరళ రెండింటికి చెందిన బాధ్యులైన అధికారులందరూ నార్త్ బ్లాక్‌లో సమావేశం కావాలని సూచించింది. వివాదాన్ని పరిష్కరించేందుకు మరో దఫా చర్చల కోసం ఈ ప్రతిపాదనకు ఇరుపక్షాలు అంగీకరించాయి. కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేసిన రూ.13,608 కోట్లను కేరళ అంగీకరించి తదుపరి కేటాయింపు ...13లో

కేరళ బడిలో తొలి రోబో టీచర్ !

- మూడు భాషల్లో ముచ్చటించే ఉపాధ్యాయురాలు

వివరాలు 14లో





పాలమూరు ప్రజాదీవెన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వం జోలికొస్తే

అగ్నికణికలై అంతు చూస్తారు

ప్రజలు ఊరుకోరు

- ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే మోడీనైనా, కేడీనైనా నిలదీస్తా..
- చాకిరేవు బండ పగిలే దాకా పోరాడుతా
- గత రాష్ట్ర పాలకులు ప్రాజెక్టుల నిధులు దిగమింగారు
- కృష్ణా నదిపై ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు?
- కేసీఆర్‌తో ఆర్ఎస్‌పీ జతకట్టడం హాస్యాస్పదం
- తెలంగాణలో 14 పార్లమెంటు నియోజకవర్గాలు గెలిచి తీరుతాం
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీతో పాటు రెండు ఎంపీ సీట్లు గెలిపించాలి : 'ప్రజాదీవెన' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు రైల్వే, మూసీ నది ప్రాజెక్టు కోసం ఇచ్చిన హామీలను మోడీ అమలు చేయకపోతే సాకిరేవు బండ పగిలే దాకా పోరాటాలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన 'ప్రజాదీవెన' పాదయాత్ర ముగింపు సభ బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎన్‌వీఎస్ కళాశాల మైదానంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత పాలకులు కృష్ణానదిపై అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పదేండ్లు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే పారతో గుంతలు తవ్వే ...2లో

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఆన్‌లైన్‌లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

వివరాలు 6లో

పురుషులతో సమానంగా మహిళల పోటీ

మహిళలను గౌరవించే దేశం మాత్రమే అభివృద్ధి చెందుతుంది : గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ పోటీపడుతున్నారని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారతదేశం శతాబ్దాల తరబడి అనుసరించిన మాతృస్వామ్య వ్యవస్థను గుర్తు చేశారు. మహిళలను గౌరవించే దేశం మాత్రమే అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక మహిళగా జన్మించడం చాలా అదృష్టమని అభిప్రాయ పడ్డారు. ఒక పురుషుని జీవితంలో తల్లిగా, సోదరిగా, భార్యగా, స్నేహితురాలిగా స్త్రీలు బహుళ పాత్రలు పోషిస్తారు కాబట్టి పురుషులు మహిళలు లేకుండా మనుగడ సాగించలేరన్నారు. మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, ఏదైనా సాధించగలరని అన్నారు.



తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడెమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. గతంలో మహిళలు ఆరుబయట పని చేసేవారు కాదని, పరిస్థితులు మారాయని, ఇప్పుడు అన్ని విధాలుగా సత్తా చాటేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు మెరుగ్గా రాణిస్తున్నారని తెలిపారు. చదువు, వృత్తి, అభిరుచులు, వివాహం, స్వతంత్రంగా ఉండటం తదితర విషయాలపై మహిళలే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం సందర్భంగా తమ గళాన్ని వినిపించిన వక్తలందరినీ అభినందించారు. మహిళా అధికారులు, సిబ్బంది పురుషుల కంటే తక్కువ కాదని చెప్పారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలు, గురువు అని, తల్లి ద్వారానే ప్రతి ఒక్కరూ ప్రపంచానికి పరిచయం అవుతారన్నారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ కాబట్టి ఏదైనా సాధించగలరని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, బాలీవుడ్ నటి తనాజ్ ఇరానీ, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ వైస్ చైర్మెన్ వెంకటేష్ సంగం, జనరల్ సెక్రెటరీ సతీష్ వడ్లమాని తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేయాలి

నిరుద్యోగ ఆయుష్ డాక్టర్ల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఆఫీసర్ల (ఆయుష్) ఫలితాలను విడుదల చేయాలని నిరుద్యోగ ఆయుష్ డాక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని ఆయుష్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయుష్ కమిషనర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ ఆయుష్ డాక్టర్లు మాట్లాడుతూ, ఆయుష్ వైద్యుల నియామకానికి గత ప్రభుత్వం 2022 జులై 5న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వాటి ఆధారంగా 2023 జులై 7న వైద్యారోగ్య నియామక మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. సెప్టెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఎన్నికల తర్వాత వైద్యారోగ్య నియామక మండలి అధికారులను సంప్రదించినా సరైన స్పందన రాకపోవడంతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నాలుగైదు సార్లు కలిసి విన్నవించినట్టు చెప్పారు. దీంతో మంత్రి స్వయంగా మండలి అధికారులకు ఫోన్ చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారని గుర్తుచేశారు.అయినా ఆ ప్రక్రియ ముందుకు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలలుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామనీ, వాటి విడుదలకు చొరవ చూపించాలని వారు కోరారు.

ప్రభుత్వం జోలికొస్తే ప్రజలు ఊరుకోరు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ప్రజలకు బొంద పెట్టేది కూడా తెలుసని హెచ్చరించారు. మాదిగలకు రిజర్వేషన్ విషయంలో మోసం చేసిన మోడీ ప్రభుత్వాన్ని అనేకసార్లు మెచ్చుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జతకట్టడం హాస్యాస్పదమన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు, ఎమ్మెల్సీ సీటును గెలిపించి పాలమూరు సత్తాను రాష్ట్ర ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు. ఐదారు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెబుతున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చడానికి ఎవరైనా ప్రయత్నిస్తే అగ్ని కనికలౌతారని హెచ్చరించారు. 'కేసీఆర్ పదేండ్లు, మోడీ పదేండ్లు ప్రధానిగా ఉండొచ్చు.. కానీ ఇందిరమ్మ ప్రభుత్వాన్ని పడగొడతారట.. మేధావులు, విజ్ఞులైన వారు ఆలోచన చేయాలి.. ఇటువంటి దుర్భర రాజకీయాలను పాతరేయాలి' అని అన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్‌ను చూస్తుంటే బీఆర్ఎస్ బిల్లా, రంగా సమితిలా కనిపిస్తోందన్నారు. అనేక త్యాగాలతో కూడిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరో 10 ఏండ్లు అధికారంలో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో యువత, మహిళలు, విద్యార్థుల తిరుగుబాటు వల్లే రాష్ట్రం ఏర్పాటయింది తప్ప కేసీఆర్ కుటుంబ గొప్పతనం ఏమీలేదన్నారు. భారత ప్రధాని మన రాష్ట్రానికి వస్తే విజ్ఞతతో వినతిపత్రం ఇస్తే.. బీజేపీలో రేవంత్ రెడ్డి చేరిపోతాడు అంటూ విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. రాత్రిపూట రహస్యంగా చెవిలో గుసగుస చెప్పే వ్యక్తిని కాదని, నికార్సైన నల్లమల నుంచి వచ్చిన నిజమైన రాజకీయ వారసత్వాన్ని కలిగిన వ్యక్తినని చెప్పారు. 90 రోజుల్లోనే ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసే ప్రయత్నం చేశామ న్నారు. పాలమూరుతో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యతాక్రమంగా నిధులు ఇచ్చి పనులు పూర్తిచేసి తమ చిత్తశుద్ధిని చాటుకుంటామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు తదితర పనులను పూర్తి చేయడానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏపీ మంత్రి రోజా వండిపెట్టిన చేపల పులుసు తిని తెలంగాణ నీటి వాటాను ఆంధ్రకు వదులుకున్న ద్రోహి కేసీఆర్ అని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదంటూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు అభివృద్ధి పనులపై రెఫరండం పెడదామా అని సవాల్ విసిరారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. ఉద్యోగస్తులకు ఏనాడూ నెల మొదటి రోజు వేతనాలు రాలేదని, ఇప్పుడు ఎన్ని ఇబ్బందులున్నా మొదటి రోజునే వేతనాలు వేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. నక్క వినయాలతో ప్రజలను మోసం చేయడానికి మరోసారి ఎన్నికల పేరుతో గ్రామాలకు వస్తున్నారని, 10 ఏండ్ల వారి పరిపాలన గుర్తుచేసుకొని ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సభలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు ఎన్ఎం.శ్రీనివాస్ రెడ్డి, వాకిట శ్రీహరి, వర్షికా రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, తుడి మెగారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి,వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు దామోదర్ రెడ్డి, బల్మూర్ వెంకట్, నాయకులు అనిల్ యాదవ్, మల్లు రవి, సంపత్ కుమార్, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం స్కీం ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బుధవారం లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ స్కీంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారు నిరంతరం ప్రజల మధ్యలో ఉండి జిల్లా స్థాయి, పీహెచ్‌సీ, సబ్ సెంటర్ స్థాయి దాకా గ్రామాల్లో ప్రజల మధ్య ఉండి వారి ఆరోగ్యం కోసం నిత్యం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సేవలను అందిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన అందాల్సిన జీతాలు గత మూడు నెలలుగా వారికి అందకపోవటంతో పేద, మధ్యతరగతి ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.


నేటి నుంచి కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ భేటీ

ఎంపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశాలు గురువారం ఢిల్లీలో జరగనున్నాయి. రెండు రోజులపాటు జరగనున్న సమావేశానికి పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులను కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ ముందు ఉంచనున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తయింది. సమావేశాల్లో చర్చించిన తర్వాత అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను అధిష్టానం రేవంత్ అప్పగించింది. తెలంగాణ రాష్ట్రంలో ఏకాభిప్రాయం ఉన్న సీట్లను ఏఐసీసీ ప్రకటించనున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి.

నాలుగు నెలలా...మరీ ఎక్కువే



- ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి అంత సమయం అవసరం లేదు
- 'ఒక్కక్లిక్'తో ఎస్బీఐ సమాచారాన్ని వెల్లడించొచ్చు
- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల వెల్లడి
- ఇప్పటికే జూన్ 30 వరకు 'సుప్రీం'ను గడువు కోరిన ఎస్బీఐ



న్యూఢిల్లీ : మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చింది. దాతలు, లావాదేవీల వివరాలను బహిరంగపరచాలనీ, బాండ్ల నిర్వహణ అధికారం కలిగిన ఏకైక బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)ను ఆదేశించింది. అయితే, ఈ డేటాను బహిర్గతం చేయటానికి గడువును జూన్ 30 వరకు పొడిగింపు చేయాలని అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో ఎస్బీఐ దరఖాస్తు చేసింది. అంటే, ఈ సమయం దాదాపు నాలుగు నెలల అన్నమాట. అయితే, నిపుణులు, విశ్లేషకులు మాత్రం నాలుగు నెలల సమయం చాలా ఎక్కువనీ, ఎస్బీఐ తన వద్ద ఉన్న సమాచారాన్ని తక్కువ సమయంలోనే వెల్లడించొచ్చని అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై తీర్పు ఇప్పటికే మోడీ సర్కారుకు ఎదురుదెబ్బగా అభివర్ణిస్తున్నారు సామాజిక కార్యకర్తలు, రాజకీయ పరిశీలకులు. ఈ నేపథ్యంలో ఎస్బీఐ కోరిన గడువుపై వీరితో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా దృష్టిని సారించాయి. వివరాలను బహిర్గతం చేయటానికి నాలుగు నెలల సమయం కావాలా? అనే ప్రశ్నలు సైతం వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎలక్టోరల్ బాండ్ల తీర్పు, దానిపై ఎస్బీఐ స్పందన ఇప్పుడు రాజకీయ యవనికపై తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

'గడువు కోరటం వెనక ఉన్నదెవరు?'

ఎలక్టోరల్ బాండ్స్ కేసులో నలుగురు పిటిషనర్లలో ఒకరైన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) గడువు పొడిగింపు కోసం ఎస్బీఐ చేసిన అభ్యర్థనను సవాలు చేయటానికి సిద్ధంగా ఉన్నది. ఇటు కాంగ్రెస్ సైతం తన అనుమానాలను వ్యక్తం చేస్తున్నది. జూన్ 30 వరకు గడువు కోరటం వెనక ఎస్బీఐపై ఒత్తిడి తెస్తున్నది ఎవరు? అని ఆ పార్టీ ప్రశ్నిస్తున్నది. డిజిటల్ యుగంలో కేవలం 'ఒక క్లిక్' ద్వారా బహిర్గతం చేయగల డేటాకు ఇంత సమయం దేనికనీ అంటున్నది. సమాచార వెల్లడికి నాలుగు నెలల సమయం అతి ఎక్కువ అనీ, అయితే, సమయం కోరటానికి ఎస్బీఐ వెనక వెనక ఎవరున్నారన్నది కీలకమని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు. ఎలక్టోరల్ బాండ్స్ డేటాను సంకలనం చేయటానికి ఎస్బీఐకి నాలుగు నెలలు అవసరం లేదని నిపుణులు చెప్తున్నారు.

సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15 నాటి తన తీర్పులో.. మార్చి 6 నాటికి ఎస్బీఐ.. ఏప్రిల్ 12, 2019 నుంచి 15 ఫిబ్రవరి 2024 మధ్య కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్(ఈసీ)కు సమర్పించాలని ఆదేశించింది. ప్రతి ఎలక్టోరల్ బాండ్ కొనుగోలు తేదీ, దాత పేరు, వారు ఏ పార్టీకి విరాళమిచ్చారు, కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ డినామినేషన్ వంటి వివరాలను తప్పనిసరిగా మార్చి 13 లోపు ఈసీ బహిరంగపరచాలని కోర్టు తెలిపింది.

కోర్టు నిర్దేశించిన గడువుకు రెండు రోజుల ముందు, మార్చి 4న సుప్రీంకోర్టుకు చేసిన దరఖాస్తులో ఐదేండ్లలో (ఏప్రిల్ 12, 2019 నుంచి ఫిబ్రవరి 15, 2024 మధ్య) వివిధ పార్టీలకు 22,217 ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసినట్టు ఎస్బీఐ తెలిపింది. రిడీమ్ చేయబడిన బాండ్లను అధీకృత శాఖలు ముంబయిలోని ప్రధాన ఎస్బీఐ బ్రాంచ్‌కు పంపినందున, సమాచార సెట్‌లను డీకోడ్ చేసి కంపైల్ చేయాల్సి ఉంటుందని ఎస్బీఐ వివరించింది.

ఒక వ్యక్తి ఏదైనా రాజకీయ పార్టీకి బాండ్‌ను అందజేసినప్పుడు.. రాజకీయ పార్టీ దానిని రీడీమ్ చేయటానికి ఎస్బీఐకి తిరిగి వెళ్లినప్పుడు.. బ్యాంక్ దాచిన నంబర్, కొనుగోలుదారు పేరును రికార్డులలో తనిఖీ చేస్తుంది. దానిని కూడా రికార్డ్ చేస్తారు.

ఈ ఎంట్రీలు, డేటా అన్నీ నిజ సమయంలో నమోదవుతాయని నిపుణులు అంటున్నారు. రెండు డేటా సెట్‌లను వెరిఫై చేయటానికి ఎక్కువ సమయం కావాలన్న అప్లికేషన్‌లో ఎస్బీఐ వాదనలను కూడా నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీఐ కార్యకర్త కమోడోర్ లోకేష్ బాత్రా మాట్లాడుతూ.. ఎస్బీఐ ఒక దాతకు ఎలక్టోరల్ బాండ్‌ను జారీ చేసేటప్పుడు కేవైసీ వివరాలను తీసుకుంటే, దానికి సంబంధించిన డిజిటల్ రికార్డు తప్పనిసరిగా ఉంటుంది. "బాండ్‌ను ఎవరు కొనుగోలు చేసారు? ఏ రాజకీయ పార్టీ దానిని ఎన్‌క్యాష్ చేసింది? అనే డేటా వారి వద్ద ఉన్నది.

నేడు ఎస్బీఐ వంటి బ్యాంకులో సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా లక్షల లావాదేవీలను అత్యంత వేగంతో చేస్తున్నది. కాబట్టి, న్యాయస్థానం అడిగిన డేటాను సిద్ధం చేయటం కష్టం కాదు" అని బాత్రా అన్నారు.

నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు

రోడ్ల మరమ్మతులకు రూ.30కోట్ల చొప్పున ఇస్తాం

- మల్లన్నసాగర్ నుంచి తాగునీరు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-భువనగిరి రూరల్

ఈ నెల 11వ తేదీన భద్రాచలంలో ముఖ్యమంత్రి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తారు.. ప్రథమ దశలో అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున.. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందజేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటొరెడ్డి తెలిపారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని న్యూవివేరా హోటల్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సాగునీరు, తాగునీరు ప్రాజెక్టులపై చర్చించామని, జిల్లాలో అదనంగా మరో రూ.200 కోట్లతో గంధమల్ల, బస్వాపూర్ పనులు పూర్తి చేసుకుని మల్లన్నసాగర్ నుంచి తాగునీరు అందిస్తామని తెలిపారు. మరికొన్ని రోడ్లను కూడా మంజూరు చేసుకునే కార్యాచరణలో ఉన్నామని, రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఒకటో తారీఖునే వేతనాలు అందించి మళ్లీ పాత రోజులు తీసుకొచ్చామన్నారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. శాసనసభ్యులు, మంత్రులు ఒక టీముగా ఏర్పడి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఐదు అమలు చేస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించామని, వచ్చే నెలలో ఎగ్జామ్ ఉంటుందని తెలిపారు.

బస్వాపూర్ ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానమంత్రిని కలిసి ట్రిబుల్ ఆర్ రోడ్డుకు సంబంధించి నిధులు అడిగామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఎవరికి నష్టం కలగకుండా మార్పులు చేర్పులు చేసుకుంటూ పనులు ప్రారంభిస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోడ్లకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.30 కోట్ల చొప్పున ఇస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్ల పనులకు రూ.1150 కోట్లతో టెండర్లను పిలిచామని, రాయగిరి బ్రిడ్జి రోడ్డు పనులు కూడా వేగంగా నడుస్తున్నాయని తెలిపారు. అర్హులైన వాళ్లందరికీ త్వరలో రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మోత్కూరు మున్సిపల్ చైర్మెన్‌కు అభినందనలు

ఇటీవల ఎన్నికైన మోత్కూర్ మున్సిపల్ చైర్మెన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి, ఇతర కౌన్సిలర్లను మంత్రి కోమటిరెడ్డి అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ప్రజాశ్రేయస్సు కోసం వినియోగించాలని చైర్మెన్‌కు సూచించారు. రానున్నది ఎన్నికల సమయమని ప్రతినిత్యం ప్రజలకు అందు బాటులో ఉండి కాంగ్రెస్ పార్టీని వారికి చేరువ చేయాలన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసన కార్యక్రమాలు చేసింది. ధర్నాల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వ వైఖరికి నిరసనగా హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్ నిరసన తెలిపారు. పోలీస్ అధికారులు జీహెచ్ఎంసీ లోపలికి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ప్రధాన గేటు ముందే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు హామీనిచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌ను అమల్లోకి తీసుకొస్తే ఉచితంగా చేయాలని కాంగ్రెస్ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు కార్పొరేటర్లతోపాటు బీఆర్ఎస్ యువనాయకులు జై సింహా తదితరులు పాల్గొన్నారు.



ఎన్ని ఇబ్బందులైనా నిజాం షుగర్స్‌ని పునరుద్ధరిస్తాం

- విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతాం : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ముత్యంపేట ఫ్యాక్టరీని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- చెరుకు రైతులతో ముఖాముఖి

నవ తెలంగాణ - జగిత్యాల టౌన్ / మల్లాపూర్

తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధానాంశంగా పేర్కొన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చేపడుతాం. ఈ ఫ్యాక్టరీని విలువ ఆధారిత పరిశ్రమగా తీర్చిదిద్దుతాం. గత బీఆర్ఎస్ పాలకులు చెరుకు రైతులను నిర్లక్ష్యం చేసి వారిని నష్టాలపాలు చేశారు' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సహా జిల్లా కలెక్టర్, అధికార బృందంతో కలిసి మంత్రి బుధవారం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరించే వరకూ గడ్డం తీయకుండా, చెప్పులు ధరించకుండా 9 నెలలుగా దీక్ష చేపట్టిన చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డిని కలిశారు. ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం మల్లాపూర్‌లో చెరుకు రైతులతో ముఖాముఖి, జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన మేరకు ఇక్కడి ప్రజల కష్టాలను అర్థం చేసుకుని ఈ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాన్ని మానిఫెస్టోలో చేర్చామని తెలిపారు. ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, చెరుకు రైతులు, అధికారులతో చర్చించామని తెలిపారు. సమస్యను అధిగమించేందుకు నిజాం షుగర్ ఫ్యాక్టరీని నడిపిన యాజమాన్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను, అధికారులను లెక్క చేయకుండా నష్టపర్చిందని విమర్శించారు. ఆ ప్రభుత్వ నిర్వాకం వల్లే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ డీఎన్ఏలోనే మహిళా వ్యతిరేకత

- మాటల్లోనే సాధికారత
- ఉన్మాదుల దాడులకు బలయ్యేది మహిళలే
- పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అదుపు చేయలేని దైన్యస్థితి
- రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తున్న మోడీ సర్కార్
- ఉన్న చట్టాలను అమలు చేయటంలో విఫలం : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి



ఎస్వీ రమ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


బీజేపీ డీఎన్ఏలోనే మహిళా వ్యతిరేకత ఉందని పలువురు వక్తలు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర బీజేపీ మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దాం, అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగిద్దాం' అనే అంశంపై సీఐటీయూ, ఐద్వా, టీఎస్‌యూటీఎఫ్, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, ఐద్వా అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై నిత్యం లైంగిక దాడులు, వేధింపులు, అవమానాలు, హత్యలు, ప్రేమోన్మాద దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలు, న్యాయాలు, పోలీసు వ్యవస్థ ఉన్నా..మహిళలకు ఎక్కడా రక్షణ, న్యాయం కల్పించడం లేదని విమర్శించారు. మహిళా సమానత్వం, సాధికారత, హక్కుల గురించి ఎన్నికల ఉపన్యాసాల్లో మాట్లాడుతున్నారే తప్ప... ఆచరణలో వారికి అన్యాయం జరుగుతుంటే మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. బేటీ పడావో.. బేటీ బచావో అంటూ గాండ్రించే బీజేపీ ప్రభుత్వ పెద్దలు మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ మాట్లాడుతూ శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో తీవ్ర వివక్ష, వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు, సమాన హక్కుల కోసం మాట్లాడటం నేరమవుతున్న సమాజంలో మనం ఇప్పుడు జీవిస్తున్నామని చెప్పారు. వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో శ్రామిక మహిళలు తీవ్ర వివక్షకు, అవమానాలకు గురవుతున్నారన్నారని వాపోయారు. పని భారం కారణంగా అత్యధిక మంది మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు వదిలేస్తున్నారని తెలిపారు. మన దేశంలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవా పనులను చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, అనుబంధ పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలైన స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించటం లేదని చెప్పారు. మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు అమలు చేయడంలో విఫలమవుతున్నందుకు పాలకులు సిగ్గు పడాలని వ్యాఖ్యానించారు. ప్రతిరోజూ ఏదో ఒక మూల, ఎక్కడో ఒక చోట లైంగిక దాడులు, హింస, యాసిడ్ దాడులు, హత్యలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితమన్న భావన ఉండేదన్నారు. కానీ నేడు ఎందులోనూ తీసిపోమంటూ పురుషుడితో సమానంగా కార్యనిర్వాహణలోనూ రాణిస్తూ ముందుంటున్నారని గుర్తు చేశారు. పలురంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతాలు సృష్టిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నదన్నారని చెప్పారు.

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎన్నికల కోసం కాకూడదన్నారు. ప్రొఫెసర్ అరిబండి ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారత గురించి చెప్పడమే తప్ప ప్రభుత్వాలు ఆ దిశగా కార్యాచరణ చేపట్టటం లేదని విమర్శించారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం వచ్చినా తగిన రీతిలో అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వందన, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, డీవైఎఫ్ఐ మహిళా విభాగం కన్వీనర్ శృతి, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ మమత, మీనా, జీ కవిత,ఆశాలత, నాగలక్ష్మి, శశికళ, వినోద, కుమార్ తదితరులు మాట్లాడారు.

నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే

కుటుంబ బాధ్యతలే ప్రధాన కారణం



న్యూఢిల్లీ : 'ఫార్చ్యూన్ 500 ఇండియా లిస్ట్'లోని కంపెనీల్లో కేవలం 1.6 శాతం సంస్థలకు మాత్రమే మహిళలు నేతృత్వం వహిస్తున్నారు. తదుపరి ఐదు వందల కంపెనీల జాబితాలో 5శాతం సంస్థలను మహిళలు నిర్వహిస్తున్నారు. భారతీయ కంపెనీల్లో మహిళల నాయకత్వాన్ని పెంచే విషయంపై నిర్వహించిన అధ్యయనంలో భాగంగా ఈ విషయాలు వెలుగు చూశాయి. ఈ అధ్యయనాన్ని ఫార్చ్యూన్ ఇండియా, ఎస్‌పీ జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చ్ సంయుక్తంగా నిర్వహించాయి. దీనికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించాయి. ఈ అధ్యయనం ప్రకారం 30-40 శాతం మంది మహిళా ఉద్యోగులు మిడిల్ మేనేజ్‌మెంట్ (ఏదైనా సంస్థలో సీనియర్, జూనియర్ మేనేజర్ల



మధ్యలో ఉన్న మేనేజర్ల స్థాయి)లో ప్రవేశించే సమయంలోనే ఉద్యోగాలు వదిలేస్తున్నారు. ఆ సమయంలో వారికి వివాహం కావడం, ఓ కుటుంబం ఏర్పడడమే దీనికి కారణం. మెటర్నిటీ సెలవు తీసుకొని, పిల్లలు పుట్టిన తర్వాత తిరిగి ఉద్యోగంలో చేరడం వారికి సవాలుగా మారుతోంది. మిడిల్ మేనేజ్‌మెంట్‌లో మహిళలను ఉద్యోగులుగా తీసుకునేందుకు కంపెనీలు వెనకాడుతున్నాయి. వారు తప్పనిసరిగా ఆరు నెలల పాటు మెటర్నిటీ సెలవులో ఉంటారని, దీంతో విధులకు అంతరాయం కలుగుతుందని అవి భావిస్తున్నాయి. పైగా సెలవు కాలంలో జీతం చెల్లించాల్సి వస్తుంది. చిన్న చిన్న కంపెనీలు అంత ఆర్థిక భారాన్ని మోయలేవు. మిడిల్ మేనేజ్‌మెంట్‌లో మహిళలను నియమించుకోవడానికి కంపెనీలు ఇష్టపడకపోవడానికి మరో కారణం కూడా ఉంది. పిల్లలు బోర్డు పరీక్షలు రాసేటప్పుడు తల్లులు విధిగా సెలవు పెడతారు. పైగా 40 ఏళ్ల వయసున్న మహిళలు తల్లిదండ్రులు లేదా అత్తమామల బాగోగులు చూసుకోవాల్సి వస్తుంది. ఈ కారణాలన్నింటి వల్ల కంపెనీలలో నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు మహిళలు ముందుకు రావడం లేదు.

సర్వే సూచనలు ఇవే

లిస్టెడ్ కంపెనీల బోర్డుల్లో మహిళల సంఖ్యను 8 శాతం నుంచి 17 శాతానికి పెంచారు. అయితే వీరిలో కొద్ది మందికి మాత్రమే డిమాండ్ అధికంగా ఉంటోంది.

ఈ నేపథ్యంలో నాయకత్వ స్థాయికి మరింత మంది మహిళలు రావాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. లింగ వైవిధ్యాన్ని పెంచేందుకు కృషి చేసే కంపెనీలకు కార్పొరేట్ పన్నులు తగ్గించాలని, మహిళలకు ఆదాయపన్ను మినహాయింపులు ఇచ్చి వారిని ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. పనిగంటల విషయంలో మహిళలకు వెసులుబాటు కల్పించాలని, రాత్రి సమయంలో పనిచేసే మహిళల పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, నివాసాల సమీపంలో ఉండే క్రచ్‌లు, వృద్ధుల బాగోగులు చూసే కేంద్రాలను ఉపయోగించుకునేందుకు మహిళలకు అవకాశం కల్పించాలని కూడా సర్వే సూచించింది.

నవతెలంగాణ

గురువారం 07 మార్చి 2024
www.navatelangana.com

సంపాదకీయం

విన్నపాలతో కాదు...

మెతక వైఖరి, కరుకుతనం... మన పనులు సవ్యంగా సాగాలంటే ఈ రెండింటిలో దేన్ని ప్రదర్శించాలనేది, ప్రదర్శిస్తామనేది ముఖ్యం. సమయాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి లౌక్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలంటారు పెద్దలు. ఆ తెలివిని ప్రదర్శించకుండా సాదాసీదాగా ముందుకెళ్తే ఎదురు దెబ్బలు తప్పవన్నది అనుభవం చెప్పే పాఠం. మనకున్న గత అనుభవాల రీత్యా తెలంగాణకు రావాల్సిన నిధులు, ఆర్థిక సాయాలు, గ్రాంట్లు, రాష్ట్ర హక్కుల విషయంలో కేంద్రంలోని మోడీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యాన్ని, అంతకుమించిన బాధ్యతా

> సమాఖ్య వ్యవస్థ బలోపేతం, లౌకికత్వ పరిరక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవల ఢిల్లీలో గళమెత్తిన సంగతినీ తెలంగాణ సీఎం గుర్తు చేసుకోవాలి. ఆయన ఉద్యమానికి తమిళనాడు సీఎం స్టాలిన్ మద్దతు తెలిపిన విషయాన్నీ మననం చేసుకోవాలి. ఈ రకంగా దక్షిణాదిలోని మూడు రాష్ట్రాలు కేంద్రం తీరును, మోడీ సర్కారు వైఖరినీ దునుమాడుతున్న తరుణంలో మనం కేవలం వినతులు, విజ్ఞప్తులతోనే సరిపుచ్చితే అది వృథా ప్రయాసే అవుతుంది.

రాహిత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న తంతు ఇదే. ఇది ఇక్కడి అభివృద్ధికి, ప్రయోజ నాలకు గండి కొడుతోంది.

తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. .రాష్ట్రానికి సంబంధించిన డజనుకు పైగా సమస్యలను ప్రధాని మోడీకి ఏకరువు పెట్టారు. ఆయా అంశాలు, ప్రాజె క్టులను పూర్తి చేసేందుకు ఇతోధికంగా ఆర్థిక చేయూతనందించాలంటూ ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. వీటిలో మూసీ ప్రక్షాళన, ఐపీఎస్‌ల కేటాయింపు, ఎన్టీపీసీలో 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు, జాతీయ రహదారుల నిర్మాణం తదితరాలు ప్రధానంగా ఉన్నాయి. ఇవి గాక గత పదేండ్ల మోడీ పాలనలో తెలంగాణపై కొనసాగిన వివక్ష, కొనసాగుతున్న పక్షపాత ధోరణికి అనేక దృష్టాంతాలు మన ముందున్నాయి. కేంద్రం నుంచి ప్రతీయేటా రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందాల్సిన సాయాలకు కొర్రీలేస్తూ వస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్ల రూపంలో రూ. 41,259 కోట్లు రావాల్సి ఉండగా, అందులో కేవలం 11 శాతాన్నే (రూ.4,532 కోట్లు) విదిల్చారు. పద్నాలుగో ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.817 కోట్లను విడుదల చేయాలంటూ సూచించినా ఇప్పటి వరకూ అతీగతీ లేదు.

రాష్ట్ర పునర్ విభజన చట్టంలోని సెక్షన్ 94(2) ప్రకారం తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలు, ప్రాంతాలకు



రూ.1,350 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా... దీనిపై కేంద్రం ఇప్పటి వరకూ నోరు మెదపలేదు. ఇక మిషన్ భగీరథ నిర్వహణ కోసం రూ.2,350 కోట్లు, వివిధ రంగాల అభివృద్ధికి రూ. 3,024 కోట్లు, పన్నుల్లో తగ్గిన వాటా రూపంలో ఇవ్వాల్సిన మొత్తం రూ.723 కోట్ల (2020-21)ను కేంద్రమే చెల్లించాలంటూ పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసు చేసింది. చెరువుల పునరుద్ధరణ (మిషన్ కాకతీయ) కోసం మరో రూ.5 వేల కోట్లు సాయం చేయా లంటూ ఆ సంఘం సూచించింది. ఇవేవీ మోడీ గారి చెవికెక్కవు. వీటితోపాటు రాష్ట్ర పునర్ విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయిం చాల్సిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా తదితరాం శాలు ఎప్పుడో అటకెక్కాయి. తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్‌ను చెప్పా పెట్టకుండా ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోయారు. వీటిపై గత బీఆర్ఎస్ సర్కారు ఇదే మోడీకి వినతుల మీద వినతులు సమర్పించింది. ఆనాటి ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు ప్రధానిని, ఇతర కేంద్రమంత్రులను కలిసి మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. గత పదేండ్లు బీజేపీని మోసిన బీఆర్ఎస్.. ఆ తర్వాత ఇది పుల్లటి ద్రాక్షంటూ శాపనార్థాలందుకుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీతో సహా అన్నింటిలో అది కాషాయ పార్టీతో అంటగాకింది. తనకే ఎసరు పెడుతోందని అర్థమైన తర్వాత ఏడ్చి గీపెట్టిన ప్పటికీ రాష్ట్రానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇప్పుడు నూతనంగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ రథసారధి రేవంత్ కూడా రెండు మూడుసార్లు ఇవే అంశాలపై మోడీని ఢిల్లీలో కలిశారు. ఆ తర్వాత తాజాగా రాష్ట్ర పర్య టనకు ఆయన విచ్చేసిన సందర్భంగా 'విన్నపాలు వినవలె...' అంటూ విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. అంతే కాదు...'రాష్ట్రానికి పెద్దన్నలా వ్యవహరించి, సాయం చేయండి...'అంటూ అర్థించారు. కొందరు విమర్శిస్తున్నట్టుగా, కొన్ని పత్రికల్లో రాసినట్టుగా ఇదేమీ తప్పు కాదు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్రంతో సఖ్యత కోసం ముఖ్య మంత్రి, ప్రధానిని కలవటాన్ని అర్థం చేసు కోవాల్సిందే. అయితే రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య వ్యవస్థను నీరుగారుస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ వైఖరిపై ఇదే కాంగ్రె స్‌కు చెందిన కర్నాటక సీఎం సిద్ధరామయ్య హస్తినాలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగిన సంగతిని రేవంత్ మరిచిపోకూడదు.

ఇదే తరహాలో సమాఖ్య వ్యవస్థ బలోపేతం, లౌకికత్వ పరిరక్షణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇటీవల ఢిల్లీలో గళమెత్తిన సంగతినీ తెలంగాణ సీఎం గుర్తు చేసుకోవాలి. ఆయన ఉద్యమానికి తమిళ నాడు సీఎం స్టాలిన్ మద్దతు తెలిపిన విషయాన్నీ మననం చేసుకోవాలి. ఈ రకంగా దక్షిణాదిలోని మూడు రాష్ట్రాలు కేంద్రం తీరును, మోడీ సర్కారు వైఖరినీ దునుమాడుతున్న తరుణంలో మనం కేవలం వినతులు, విజ్ఞప్తులతోనే సరిపుచ్చితే అది వృథా ప్రయాసే అవుతుంది. ఇదే సమయంలో కేంద్రంతో ఘర్షణ వైఖరిని చేపడితే.. పనులు కావంటూ కేసీఆర్ పాడిన పాతపాటే అందుకుంటే ఉప యోగం ఉండదంటూ సిద్ధరామయ్యను, విజయన్‌ను, స్టాలిన్‌ను చూసైనా రేవంత్ అర్థం చేసుకుంటే మంచిది. అందుకే తెలంగాణ హక్కులు, ప్రయోజనాల పరి రక్షణకు 'బడే భాయ్‌పై చోటా భాయ్' ఆందోళనలు చేపట్టాల్సిందే. పోరాట పంథాను ఎంచుకోవాల్సిందే.

మద్దతు ధరల హక్కు : మభ్య ప్రచారం, వాస్తవాలు

మద్దతు ధరల హక్కుకై దేశ రైతాంగం ఎన్నో సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నది. మోడీ ప్రభుత్వం "2014లో మోడీ స్వయంగా చేసిన వాగ్దానాన్ని" అమలు చేయాలనేది వీరి ప్రధాన డిమాండ్. రైతులు కోరుతున్నట్టుగా మద్దతు ధరల హక్కు కల్పిస్తే, పడే ఆర్థికభారం దేశ ఆర్థిక వ్యవస్థ భరించలేదని, అస్తవ్యస్థంగా మారుతుందని మభ్య ప్రచారం చేయబడుతోంది. ఈ ప్రచారంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రొఫెసర్ అశోక్ గులాటి, ప్రజాస్వామ్యవాదిగా చెప్పుకుంటున్న జయప్రకాష్‌నారాయణ లాంటి వాళ్ళు కూడా ఉన్నారు. ఒకడుగు ముందుకు వేసి జయప్రకాష్ నారాయణ మద్దతు ధరల హక్కు కల్పన వల్ల రైతులకు కలిగే మేలుకంటే కీడే చాలా ఎక్కువగా ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రచారం రైతుల్లో ఒక విధమైన భయ వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఈ నేపథ్యంలో, మద్దతు ధరల గురించి స్పష్టమైన అవగాహన అవసరం. ఇది మన దేశానికి, దేశ ఆహార భద్రతకు, దేశ పురోగాభివృద్ధికి చాలా ముఖ్యం.



అరిబండి ప్రసాద్ రావు
9490098903

పెరిగిన మద్దతు ధరల ప్రాధాన్యత

మద్దతు ధరల వ్యవస్థ హరితవిప్లవ కాలం 1966-67 ప్రాంతంలో ఒడిదుడుకులు లేకుండా వ్యవసాయోత్పత్తి కొనసాగడానికి ఉద్దేశించబడింది. 1990 వరకు అనుసరించిన స్వయం పోష కత్వ విధానాల కాలంలో వ్యవసాయోత్పత్తిలో మద్దతు ధరల ప్రాధాన్యతను రైతులు ఎక్కువగా పట్టించుకోలేదు. 1990వ దశకం నుండి కొల్లగొట్టే స్వభావం గల సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత వ్యవసాయోత్పత్తిలో పెట్టుబడులు, ఉపకరణాల ఖర్చులు ఒకవైపు పెరుగుతూ పోతుండగా, రెండో వైపు పూర్తి ఉత్పత్తి ఖర్చులను కూడా రాబట్టుకోలేని స్థితి, రుణభారాలతో భరించలేని లక్షలాది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. ఇది చాలా బాధాకరం. రైతుల సంక్షోభ పరిస్థితుల నివారణకు, సంక్షోభ నివారణకు తగిన సూచనలు చేయడానికి హరిత విప్లవ అధ్యులు డాక్టర్ స్వామినాథన్ ఉత్పత్తి ఖర్చు జోడించి రైతులకు కుటుంబ నిర్వాహణ కోసం అందాల్సిన ఆదాయాన్ని నిర్దేశించింది. సమగ్ర ఉత్పత్తి ఖర్చు సి2+ 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలన్న సూత్రం. దీనిలో "50 శాతం" రైతు కుటుంబాల మనుగడకు దక్కాల్సిన ఆదాయం. దీని పరిమాణం మీదనే రైతు కుటుంబ బాగోగులు ఆధారపడతాయి. రైతులు రెండు రకాల అస్థిరత్వాలను ఎదుర్కొంటున్నారు. వాతావరణ ఒడిదుడుకుల వల్ల మొదటిదికాగా, మార్కెట్ ధరల హెచ్చు తగ్గుదల వల్ల తమ ఆదాయాన్ని పొందలేకపోవడం రెండవది. పంట ఉత్పత్తిలోని ఒడిదుడుకులను తట్టుకోవడానికి పంటల బీమా ఉద్దేశించబడింది. మార్కెట్ ఒడిదుడుకులకు రక్షణగా మద్దతు ధరల హక్కు కోరుతున్నారు.

1.మద్దతు ధరలు ఇప్పుడు కొద్దిమందికే అందుతున్నాయి.(10-20 శాతం).దేశ విస్తార ప్రాంతంలో మద్దతు ధరలు అందడం లేదు.

ఈ విషయాన్ని కేంద్ర ధరల నిర్ణయక కమిషన్ కూడా గుర్తిస్తోంది. అసలు మద్దతు ధరలు అందించని ప్రాంతాలకు కూడా విస్తరించాలని సూచిస్తుంది. కానీ, అమలుకు నోచుకోవడం లేదు. అయితే, వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, నిర్వాహణలో మార్కెట్‌ల వైఫల్యం వల్ల మద్దతు ధరలు పొందడానికి రైతులు మార్కెట్లను నమ్మడం లేదు. ప్రభుత్వాన్నే విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల డిమాండ్‌ను అర్థం చేసుకోవాలి.

2. మద్దతు ధరల హక్కు అమలు ఖర్చు భారీగా ఉంటుందని, ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుందనే ప్రచారం.

ఇప్పుడు మద్దతు ధర నిర్ణయిస్తున్న 23 పంటలకు హక్కును కల్పించాలంటే రూ.10-15 లక్షల కోట్ల భారం ఆర్థిక వ్యవస్థపై పడుతుందని, ఆర్థిక వ్యవస్థ విచ్ఛినం అవుతుందని ప్రభుత్వం ఇతర సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించలేదని ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ఎంతో అంతర్జాతీయ విశ్వసనీయత గల క్రిసిల్ సంస్థ భారత దేశంలో మద్దతు ధరల హక్కు అమలు చేయడానికి 2022-23 పంటల ఆధారంగా మొత్తం వ్యవసాయోత్పత్తి విలువ దాదాపు రూ.15 లక్షల కోట్లుగా ఉంటుందని, అమ్మకానికి వచ్చే ఉత్పత్తుల్ని మార్కెట్‌లో కొనడానికి రూ. 7-8 లక్షల కోట్లు పెట్టుబడి (రివాల్వింగ్ ఫండ్) అవసరమవుతుందని, నికరంగా ఖర్చు దాదాపు రూ. 21 వేల కోట్లు అవుతుందని అంచనా వేసింది.

మార్కెట్, మద్దతు ధరల వ్యత్యాసాన్ని (భావాంతర్ భావ్ పథకం) ప్రయివేటు మార్కెట్‌ల ద్వారా రైతులకు చెల్లింపచేస్తే ప్రభుత్వంపై పడే ఖర్చు దాదాపు రూ.50 వేల కోట్ల కన్న మించదని ఇతరులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఇప్పుడు రూ.47 లక్షల కోట్లు. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలో రూ.50 వేల కోట్ల ఖర్చును భరించడం అంత కష్టమేమి కాదు. కావాల్సింది రాజకీయ 'సంకల్పం'. అయితే, పాలకలు ఇలా ఎందుకు నిర్ణయించలేకపోతున్నారు? అనేది ఆలోచించాలి. దీనికి ప్రధాన కారణం కేంద్ర పాలకుల ఏ పార్టీకి చెందినప్పటికీ డబ్ల్యూటీఓ నియమ నిబంధనల ప్రకారం వ్యవసాయరంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నం. ఈ విధానాలకు కట్టుబడ్డ మోడీ ప్రభుత్వం మద్దతు ధరల హక్కు కల్పించడానికి సిద్ధంగా లేదు.



> కేవలం అధికారం చెలాయిస్తున్న వారికి మద్దతుగా ఈ మభ్య ప్రచారం జరుగుతుంది. కొల్లగొట్టే స్వభావం గల ఆర్థిక సరళీకరణ విధానాలతో, రుణ భారాలతో రైతుల ఆత్మహత్యలు ప్రారంభం అయినప్పటి నుండి ఏదో ఒక రూపంలో ఎన్నికలకు సంబంధం లేకుండా రైతులు దేశమంతా ఆందోళన చేస్తున్నారు. అయితే, ఈ ఆందోళన దేశమంతా ఒకే విధంగా లేదు. ఇదే వేరు ముఖ్యాంశం. మిగతా రాష్ట్రాలో అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. వీరెవరు ఒక రాజకీయ పార్టీని ఒడించి రాజ్యాధికారం చేబట్టాలని ఆందోళన చేయడం లేదు. వీరి ఆందోళనల "చేసిన వాగ్దానాల అమలు కోసమే". అందువల్ల, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ముందు రైతులు ఆందోళన చేస్తున్నారనేది పూర్తిగా అవాస్తవం.

ఈ విషయంలో చేసిన వాగ్దానాన్ని అమలు చేసే నైతికతను ఉంచుకోవాలని భావించడం లేదు.

3. ఏ మద్దతు ధరలు లేని వ్యవసాయోత్పత్తులు వేగంగా పెరుగుతున్నాయి. ఉదాహరణకు వార్షికంగా పౌల్ట్రీ రంగం 9 శాతం, చేపలు 7-8 శాతం, పాలు 5-6 శాతం పెరుగుతున్నాయి. కానీ, మద్దతు ధరలు ఉన్న ఏ పంటల ఉత్పత్తి మేర పెరగడం లేదు. 3-4 శాతం మధ్యనే ఈ పెరుగుదల ఉంది. (అశోక్ గులాటీ).

ఈ రంగాల్లోని రైతుల స్థితిని అశోక్ గులాంటి వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని భావించాల్సి వస్తుంది. పౌల్ట్రీ రంగంలో అసలు రైతులే లేరు. ఉత్పత్తి, నిర్వహణ, అమ్మకాలు మొత్తం కార్పొరేట్ చేతుల్లో కొనసాగుతున్నాయి. పెట్టుబడి కూడా పెద్దఎత్తున అవసరమౌతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇలా కాదు. 86 శాతం పైగా కమతాలు ఐదెకరాల కన్న తక్కువగా ఉండే చిన్న-సన్నకారు రైతులవే. వీరికి కూలీలుగా తప్ప పౌల్ట్రీ రంగంలో మరో స్థానమేమి లేదు. ఇలాంటి కార్పొరేటీకరణ జరిగితే ఇప్పుడు భూమి కలిగిన రైతులంతా కార్పొరేట్ కూలీలుగా మారాల్సి వస్తుంది. దీనిని రైతులు అంగీకరించడంలేరు.

పాల ఉత్పత్తిలో ప్రధానంగా చిన్న-సన్నకారు రైతులే ఉన్నప్పటికీ కొన్ని కారణాల వల్ల వీటి ఉత్పత్తి, సాంకేతిక మద్దతు, సేకరణ, శుద్ధి ప్రక్రియలు, అమ్మకాలు ప్రధానంగా బలమైన సహకర రంగంలో కొనసాగుతున్నాయి. ప్రయివేటు రంగం ఇది, సహకార రంగంతో పోటీపడాల్సి వస్తుంది. అయితే ఉత్పత్తి దారులకు నిర్ణయించిన ధర వస్తునప్పటికీ ఉత్పత్తి ఖర్చులను పూర్తిగా రాబట్టు కోలేకపోతున్నారు. తెలంగాణలో ఇప్పుడు లీటరు రూ.5లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. చేపల రంగంలో చేపలు పట్టేవారి ఆర్థిక, సామాజిక స్థితి మన చిన్నకారు రైతుల కన్నా మెరుగ్గా ఏమీ లేదు. వ్యవసాయోత్పత్తి పెరిగినంత మాత్రాన దానిమీద ఆధారపడే వారి జీవితాలు కూడా మెరుగు పడతాయని ప్రస్తుత పరిస్థితుల్లో భావించలేం. ఇలా లేనందువలనే రైతులు మద్దతు ధరల హక్కును డిమాండ్ చేస్తున్నారు. వీరు మార్కెట్‌లను విశ్వసించడం లేదు.

4.మద్దతు ధరల హక్కు రైతులకు మేలు చేసే దానికన్న కీడే ఎక్కువగా చేస్తుంది. దీనికి బదులుగా ఉత్పత్తి-వినియోగదారుల మధ్య తుల్యత (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) కల్పించాలి. మద్దతు ధర హక్కుకు బదులు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలి. (జయప్రకాశ్ నారాయణ).

రైతులు ఊహాలోకంలో జీవించడం లేదు. నిజ ఆర్థిక వ్యవస్థలో జీవిస్తున్నారు. గిట్టుబాటు ధరలను కల్పించడంలో ప్రయివేటు మార్కెట్‌ల వైఫల్యం వలనే ప్రభుత్వం నుండి మద్దతు ధరల హక్కును డిమాండ్ చేస్తున్నారు. మద్దతు ధరలు నిర్ణ యంలో ఉత్పత్తి ఖర్చులతోపాటు ఆర్థిక వ్యవస్థ, సామాజిక పరిస్థితులపై చూపగల ప్రభావం, అంతర్జాతీయ మార్కెట్ ధరల పరిస్థితుల లాంటి అంశాలను మద్దతు ధరల సూచించే సమయంలో పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తుంది. అందువల్ల, ఆర్థిక వ్యవస్థపై మద్దతు ధరల హక్కు తీవ్ర దుష్ప్రభావం కలిగి ఉంటుందనే ప్రచారం వాస్తవం లేదు.

జయప్రకాశ్ నారాయణ వాదన నర్మగర్భంగా కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉంటుంది. వారి రాజకీయ ప్రస్థానం కార్పొరేట్‌ల ఫైనాన్స్‌తో (డెమోక్రోటిక్ ఫౌండేషన్ అనే పేరుతో ఉన్న అమెరికన్- ఇండియన్ కార్పొరేట్లు ఆర్థిక సహాయంతో) ప్రభుత్వయేతర సంస్థగా (ఎన్‌జీఓ) లోక్ సత్తా ప్రారంభమై రాజకీయ రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో, వీరి అభిప్రాయాల్ని అర్థం చేసుకోవాలి.

5. రైతులు ఎన్నికల సందర్భంలోనే ఆందోళన చేస్తున్నారు?దీని రాజకీయ అంతర్గతం అర్థం చేసుకోవాలి.

ఇది పూర్తిగా అవాస్తవం. కేవలం అధికారం చెలాయిస్తున్న వారికి మద్దతుగా ఈ మభ్య ప్రచారం జరుగుతుంది. కొల్లగొట్టే స్వభావం గల ఆర్థిక సరళీకరణ విధానాలతో, రుణ భారాలతో రైతుల ఆత్మహత్యలు ప్రారంభమైనప్పటి నుండి ఏదో ఒక రూపంలో ఎన్నికలకు సంబంధం లేకుండా రైతులు దేశమంతా ఆందోళన చేస్తున్నారు. అయితే, ఈ ఆందోళన దేశమంతా ఒకే విధంగా లేదు. ఇదే వేరు ముఖ్యాంశం. మిగతా రాష్ట్రాలో అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. వీరెవరు ఒక రాజకీయ పార్టీని ఓడించి రాజ్యాధికారం చేబట్టాలని ఆందోళన చేయడం లేదు. వీరి ఆందోళనలు "చేసిన వాగ్దానాల అమలు కోసమే". అందువల్ల, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ముందు రైతులు ఆందోళన చేస్తున్నారనేది పూర్తిగా అవాస్తవం. రైతులు తమ వృత్తి మనుగడకోసం, రుణ భారాల నుండి బయట పడి రాజ్యాంగం అందించిన హక్కులను ఇతర పౌరులతో సమానంగా అనుభవించడానికి మాత్రమే ఆందోళన చేస్తున్నారు. అందువల్ల, మద్దతు ధరలకు హక్కు కల్పించడానికి అడ్డుపడే విధంగా చేస్తున్న మభ్య ప్రచారాల్ని అర్థం చేసుకోవాలి. దేశంలో సగం పైగా జనాభాకు (54 శాతం పైగా) ఉపాధిని, కుటుంబాలను, దేశ ప్రజల ఆహార భద్రతను, దేశ స్వాతంత్ర్యాన్ని రక్షిస్తూ పరాయీకరణను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా పోరాడుతున్న రైతు ఉద్యమానికి మద్దతునివ్వడం నిజమైన దేశభక్తికి ప్రతీక.

ఎవరికీ గ్యారంటీ? ఇంకెన్నాళ్లిస్తారు?

"మోడీ కా గ్యారెంటీ" అనే శీర్షిక దాదాపు ప్రతిరోజు ప్రధాన పత్రికలన్నింటిలో ఆయా పత్రికల పేరుతో పాటు లేదా అంతకుమించిన ప్రాధాన్యతతో ప్రచురించబడుతున్నది. పదేండ్ల కింద కరెంటూ, రోడ్డు రవాణా మార్గాలే లేనట్లు, అసలు వంటగ్యాస్ గురించి తెలియక దేశ మహిళలంతా గత 70 ఏండ్లుగా కట్టెల పొయ్యిల్లోనే పడి కాలిపోతున్నట్టు, ఆర్థిక వ్యవహారాలే జరగనట్టు, భారత దేశ పటం అంతర్జాతీయంగా ఇప్పుడే ప్రింట్ చేసినట్టు పటారం జరుగుతోంది. ఇంతటితో ఆగక ఆరు వేల కోట్ల రూపాయలను వెచ్చించి "సెల్ఫీ విత్ మోడీ" అంటూ మోడీ ఫొటోలను ప్రధాన కూడళ్లలో పెట్టి సెల్ఫీ దిగడానికి కూడా బలవంత పెడుతున్నారు.

అంతర్జాతీయంగా పలుదేశాలు భారతదేశాన్ని మొదట్లో ల్యాండ్ ఆఫ్ గాంధీ, ల్యాండ్ ఆఫ్ నెహ్రూ అని సంబోధించేవారట, ఇప్పుడు మోడీ కా భారత్ అంటున్నారు! ల్యాండ్ ఆఫ్ గాంధీ అంటే శాంతికి చిహ్నమని, ల్యాండ్ ఆఫ్ నెహ్రూ అంటే సౌభ్రాతృత్వానికి చిహ్నమని చెబుతారు, మోదీ కా భారత్ అంటే నిరసనలను నిలువెత్తునా అణచివేసి ఒకే దేశంలోని ఒక సమూహం వేరొక సమూహంపై ఆధిపత్యం సాధించే క్రమం అంటు నెటిజన్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలో అభిప్రాయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తి కన్నా సమిష్టికి ప్రాధాన్యత. కానీ వ్యక్తిని మితిమీరి కీర్తించడం రాజరికాల్లో లేదా ఏకస్వామ్యంలో మాత్రమే సాధ్యం. ప్రజాస్వామ్యమంటే మెజారిటీ వాదమనే నినాదాన్ని దాదాపు ఖరారు చేసినట్టే దేశంలో! భారత రాజకీయాలలో గ్యారెంటీగా భక్తి, మతము అనే రెండు కాగడాలతో ఎన్నికల రంగం సిద్ధమవుతోంది. ఈ కాగడాలను అంగీకరించిన వారు వాటి వెలుగులో ఉంటారు వ్యతిరేకించిన వారు వాటిచే కాల్చివేయబడతారు అనే విధమైన బలవంతం కూడా ముందుకొస్తున్నది. ఇంతటి భయంకర వాతావరణంలోనూ నిర్లక్ష్యానికి గురౌతున్న ప్రధాన అంశాలను ప్రస్తావించాల్సిందే, అవి చివర్లో రాస్తాను. ఏమి సాధించామో మరేమి గ్యారెంటీగా సాధించబోతున్నామో కాలమే నిర్ణయిస్తుంది. కానీ పటిష్ట మైన నాయకత్వం నుండి బలిష్టమైన నాయకుడి వైపు దేశం వాలిపోతుంది! ఇది ప్రమాదానికి సంకేతం. మోదీకా గ్యారెంటీ అంటే ఎవరికి గ్యారెంటీ అనేది మొదటగా ఉత్పన్నమయ్యే ప్రశ్న. అంర్జాతీయంగా దోషిగా నిలబెట్టబడిన మనిషి అదానీని పార్లమెంటు సాక్షిగా వెనకేసుకొచ్చి, కుంభకోణాల సూత్రదారికి కుర్చీ వేసి మళ్లీ ప్రపంచ ప్రథమ స్థానానికి చేర్చే గ్యారెంటీయైతే అది వద్దు. మండుతున్న మణిపూర్‌ను గాలికొదిలి బెంగళూరులో బంతి పూలవర్షం కురిపించుకునే సంస్కృతి గ్యారంటీగా వద్దు.

వెలుగుతున్న కొవ్వొత్తిని మాత్రమే ప్రచారంలో పెట్టి దానికింద సమిధలైన మొత్తం జాతిని చీకట్లో పడేసిన వాస్తవాలను ఈ మధ్యనే గోల్డ్ మాన్ సాక్స్ అనే ప్రఖ్యాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ వెలువరించింది. ఈ దేశ తలసరి ఆదాయం అధికారికంగా రూ .1,73,000. మింట్ పత్రికలో వెలువడిన పైన పేర్కొన్న నివేదిక ప్రకారం 49.7 శాతం అనగా దాదాపు 50 శాతం దేశ ప్రజల (ఉపాధిలో పాలుపంచుకుంటున్నవారు మాత్రమే, వర్కింగ్ ఏజ్ పాపులేషన్) ఆదాయం 1,25,000 కన్నా తక్కువగా ఉన్నది. అనగా సగం జనాభా నెలసరి ఆదాయం పదివేల రూపాయల కన్నా తక్కువ, అనగా రోజువారి రూ.334 కన్నా తక్కువ. 20.3శాతం ప్రజల వార్షిక ఆదాయం 1,25,000 నుండి 2,10,000 మధ్యలో నమోద వుతున్నది. 18.1 శాతం ప్రజల ఆదాయం రెండు లక్షల పదివేల రూపాయల నుంచి, నాలుగు లక్షల పదివేల రూపాయల మధ్య ఉన్నది, 7.8శాతం ప్రజల ఆదాయం 4లక్షల పదివేల నుండి 8 లక్షల 30 వేల ఆదాయంగా ఉన్నది. 4.1శాతం ప్రజల ఆదాయం 8లక్షల30 వేల పైన వున్నదని తేలింది. ఇవి నమోదైన గణాంకాలు. 2020-23 ఆర్థిక సంవత్సరాలలో ఇదే జాబితాకు సంబంధించిన వారి ఆదాయాల పెరుగుదల లేదా పెరుగుదల శాతాలను గమనిస్తే....49.7శాతం ప్రజల వార్షిక ఆదాయం మైనస్ 2.5శాతంగా నమోదయింది. 20.3శాతం ప్రజల వార్షిక ఆదాయం మూడు శాతం వృద్ధి సాధించగా 18.1శాతం ప్రజల ఆదాయం 6.9 శాతం వృద్ధి సాధించింది. 7.8శాతం ప్రజల ఆదాయంలో 10.4శాతం వృద్ధి కనపడగా 4.1శాతం ప్రజల ఆదాయం 12.6శాతంగా పెరిగినట్టు వెలువడింది. ఈ ఆదాయార్జితాల నిష్పత్తులను బట్టి స్పష్టంగా అర్థమయ్యేది ఏమంటే తక్కువ ఆదాయం కలిగిన వాళ్ళు మైనస్‌లో గాని లేదా అతి తక్కువ వృద్ధితో గాని కనపడితే ఎక్కువ ఆదాయం కలిగిన వాళ్ళు ఎక్కువ శాతం వృద్ధిని చేజిక్కించుకుంటున్నారు. దేశ జీడీపీ పెరుగుతుంది, స్టాక్ మార్కెట్ దూసుకుపోతుంది ప్రపంచంలో 5,4,3వ ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుంది.ఇవన్నీ సరే ప్రపంచంలో ఎక్కడ లేనంతగా ఈ దేశంలో పనిచేసే వారిలో సగం మంది విపరీతమైన దోపిడీకి గురవుతున్నారు. దీనికి వారి దురదృష్టం కాదు ఆ దోపిడీకి అవకాశం కల్పిస్తున్న పరిపాలన విధానాలు. దీనికి పరిష్కారం కనుగొనబడే గ్యారెంటీని ఇవ్వకపోతే రాత్రిపూట విందు సందర్భంగా వెలుగు తగ్గిందని ఖైదీలను కాల్చివేసి తద్వారా రగిలిన కార్చిచ్చులో చిందులేసిన నీరో చక్రవర్తికి మనకి తేడా ఉండదు.

జి.తిరుపతయ్య
9951300016





> వెలుగుతున్న కొవ్వొత్తిని మాత్రమే ప్రచారంలో పెట్టి దానికింద సమిధలైన మొత్తం జాతిని చీకట్లో పడేసిన వాస్తవాలను ఈ మధ్యనే గోల్డ్ మాన్ సాక్స్ అనే ప్రఖ్యాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ వెలువరించింది. ఈ దేశ తలసరి ఆదాయం అధికారికంగా రూ .1,73,000. మింట్ పత్రికలో వెలువడిన పైన పేర్కొన్న నివేదిక ప్రకారం 49.7శాతం అనగా దాదాపు 50 శాతం దేశ ప్రజల(ఉపాధిలో పాలుపంచుకుంటున్న వారు మాత్రమే, వర్కింగ్ ఏజ్ పాపులేషన్) ఆదాయం 1,25,000 కన్నా తక్కువగా ఉన్నది. అనగా సగం జనాభా నెలసరి ఆదాయం పదివేల రూపాయల కన్నా తక్కువ, అనగా రోజువారి రూ.334 కన్నా తక్కువ.

గడచిన పదేళ్ల గ్యారెంటీని ఒకసారి పరిశీలిద్దాం..

ప్రజాస్వామ్యమంటే సంఖ్యకు పరిమితమా? ఎలాగైనా చేసి మెజారిటీ సంఖ్యను పొందితే సరిపోతుందా? ఈ ప్రశ్నకు సమాధానం అవును అని గత పదేండ్ల పాలన స్పష్టం చేస్తుంది. గత నెల ఛండీగర్‌లో మేయర్ ఎలక్షన్స్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పేపర్లను చెల్లనివిగా మార్చేక్రమం సీసీటీవీలో నమోదయింది కాబట్టి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తూ 'ప్రజాస్వామ్యాన్ని మర్డర్ చేయకండి' అంటూ తిట్టిపోసి, ఎన్నికను రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించింది. ఉత్తర భారత్‌లో కొందరు అభ్యర్థులు ఈవీఎంలను తస్కరించి ఎత్తుకుపోతున్నారు. వీటిపైన ఎలాంటి చర్యలకు అధికారులు ఉపక్రమించలేదు. భారత ఎన్నికల కమిషన్ ఒక స్వతంత్ర సంస్థ, దాని స్వతంత్రతను కాపాడడానికి కమిషనర్ల ఎన్నిక ఏకపక్షంగా ఉండకూడదని త్రిసభ్య కమిటీని- ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాలను సభ్యులుగా పాటిస్తూ వస్తున్నారు. దీనిని తోసి రాజని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను తొలగిస్తూ ప్రధానమంత్రి తమ మంత్రివర్గంలోని ఒకరిని నామినేట్ చేయొచ్చు అన్న కొత్త ప్రతిపాదనను సాధించుకున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతూ ఉంటుంది,వారు కావాలనుకున్నప్పుడే ఎన్నికల తేదీలను ప్రకటిస్తుంది అది పూర్తిగా ఏకపక్షం ఉన్నది అని ప్రశాంతి కిషోర్ లాంటి వాళ్లు అనేకసార్లు వాపోయారు. ఇకనుండి ఆ అవసరమే ఉండదు ఎందుకంటే ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు ఒకే పార్టీకి చెందినవారు కాబట్టి. 2019 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారికంగా ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన వివరాల ప్రకారం రూ.1,264 కోట్ల ను ఖర్చు చేసింది. కమిషన్ నిబంధనల ప్రకారం ఒక పార్లమెంటు సభ్యుడు రూ.95లక్షల కన్నా ఎక్కువ ఖర్చు చేయకూడదు. అలాంటప్పుడు రూ.415 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చుకాకూడదు. మరి 1,264 కోట్లు ఖర్చుపెట్టినప్పుడు ఎన్నికల కమిషన్ ఏం చేస్తూ కూర్చున్నట్లు? సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే సంస్థ ప్రకారం ఒక్క బీజేపీ 2019 ఎన్నికలలో రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టిందట. ఈ దేశంలో హార్స్ ట్రేడింగ్ (అభ్యర్థులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను మార్చడం) చాలా బాహాటంగా జరుగుతుంది. రిసార్ట్ పాలిటిక్స్ అంటూ దానికి పేరు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ద్వారా రెయిడ్ చేయబడిన అనేకమంది ప్రతిపక్ష నాయకులు వ్యాపారులు బీజేపీలోకి చేరిపోతే శుద్ధ నీతిమంతులు అవుతున్నారు. ఈ అంశాలన్నీ ఎన్నికల కమిషన్ పరిశీలించాల్సిన అవసరం లేదా? సుమోటోగా కేసులను స్వీకరించాల్సిన అవసరం లేదా? ఇదే పదేళ్ళ గ్యారెంటీలో గతంలో ఎందు లేనంతగా గవర్నర్ల వ్యవస్థ దిగజారిపోయింది. కేరళ, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలలో గవర్నర్లు ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నారు. దీనికి కేంద్రం వత్తాసు పలకడం లేదంటే నమ్మగలమా? మీడియా మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్న ఘనత ఈ పదేండ్ల గ్యారెంటీలోనే మనం చూడగలం. దూరదర్శన్ ఛానెళ్ళ ల్లో ఇతరులకు అవకాశం లేదు. కాస్త కూస్తో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎన్.డి టీవీని హస్తగతం చేసుకున్నారు. అడ్వర్‌టైజ్‌లన్నీ కేవలం ప్రభుత్వానికి వత్తాసు పలికే మీడియా హౌసెస్‌కు మాత్రమే వెళుతున్నాయి. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 62సార్లు నిషేధం లేని, కనీసం వంద మందికి తగ్గకుండా రిపోర్టర్లను ఆహ్వానించి, ప్రెస్‌మీట్లు నిర్వహించారు. కానీ ఈ పదేళ్ల కాలంలో నిషేధంతోనైనా ఒక్క ప్రెస్‌మీట్ కూడా నిర్వహించబడలేదు. ఈ పద్ధతిని పునరావృతం చేసే గ్యారంటీ వద్దు.

వీటికి గ్యారంటీ ఇవ్వండి...

దేశ ప్రజలకు గ్యారంటీలు కావాలి, వాటిని పాలకులు నెరవేర్చాలి కూడా. మొట్టమొదటిది మత సామరస్యం. అది కర్ర పెత్తనం కాదు, క్లాస్ రూములోనిదైనా సరే! కోర్టు రూములోనో లేదా పోలీసు స్టేషన్‌లోనో కనిపించే నిశ్శబ్ద శాంతి కాదు. భక్తి దేవుడిపై శ్రద్ధ కన్నా పక్క వాడిపై ఆధిపత్యాన్ని సాధించానన్న ద్వేశానికి ప్రతీకగా మారింది, దానికి విరుగుడు కావాలి. ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకలను బద్ధ శత్రువులుగా భావించే విధానానికి స్వస్తి చెప్పే గ్యారంటీ కావాలి, దేశాభివృద్ధి ద్వేషంలోంచి ఏర్పడిన ఐక్యతలో లేదని గుర్తించాలి. రెండవది, ఎన్నికలు, ప్రభుత్వాల ఏర్పాటు/ కూలదోత, ఆ తరువాతి పరిపాలనా, ఆశ్రిత పక్షపాతాలు ఇప్పుడున్నట్లుగా కాకుండా! ధర్మము, సంస్కృతీ, దేశ భక్తీ ఎన్నికల అస్త్రాలు చేయరాదు. మూడవది, వందశాతం అక్షరాస్యతకు హామీ. నాల్గవది, నమోదైన వృద్ధి నాదని చెప్పే ముందు స్థిరమైన ఉపాధి లేక తిరోగమన ఆదాయాలతో సమిధలౌతున్న వారికి ఉపశమనం కేవలం రాజకీయాల్లో లేదని గుర్తించాలి, దానికి కారకులౌతున్న కార్పొరేటీకరణకు ముకుతాడు వేయకపోతే గ్యారంటీగా నష్టపోతాము. ఇక ఐదవది, జీఎస్టీ పేరు మీద సొమ్మంతా తమ ఖజానాలోనే పడేట్టు చేసుకుని రాష్ట్రాలు తమ వాటా కోసం ఢిల్లీలో ధర్నాకు దిగే పరిస్థితి వుండకూడదు. ఇక పరోక్ష పన్ను విధానం ద్వారా పేదలనుండి 65శాతం రెవెన్యూను రాబట్టుకుని మరింత పేదరికంలో నెట్టే విధానానికి చరమగీతం పాడాలి.

తునికాకు సేకరణ-ఆదివాసుల హక్కు

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండోపంటగా ముఖ్యమైన ఆదాయవనరుగా ఉంది. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రెండు ఫారెస్ట్ డివిజన్‌లు. ఆసిఫాబాద్‌లో 12, కాగజ్‌నగర్‌లో 13, మొత్తం 25 యూనిట్లు, 250కి పైగా కల్లాలుండేవి. దాదాపు 30 వేల మంది కూలీలు ప్రతి సీజన్‌లో ఆకుసేకరణలో భాగస్వాములవుతారు. వీరితో పాటు గోడౌన్ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, కల్లేదార్లు, ఉపాధి పొందుతారు. కాంట్రాక్టర్లకు లక్షల రూపాయల ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వానికి సైతం ఎటువంటి పెట్టుబడి (ఖర్చు) లేకుండా ఆదాయం వస్తుంది. ఆకుసేకరణపై ఆధారపడి బీడీ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమపై వేల కార్మికులు ఉపాధి పొందుతారు. ఆకు విదేశాలకు ఎగుమతై విదేశీ మారకం కూడా వస్తుంది. దీని ద్వారా ఈ ఒక్క సీజన్‌లోనే దాదాపు 25 వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది.

ఇదంతా ఒక ఎత్తయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల ఉపాధికొట్టే ప్రయత్నాలు శరవేగంగా అమలు చేస్తున్నది. అటవీ ప్రయివేటీకరణ నిబంధనలకు తలొగ్గి పెద్దపులులు సంచరిస్తున్నాయనే పేరుతో ఈ ఏడాది సీజన్‌లో తునికాకు సేకరణ నిలిపివేయాలని, ఫారెస్ట్ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిక పంపినట్టుగా వార్తలొచ్చాయి. అధికారులతో మాట్లాడి కాస్తా కూపీలాగితే ఇది వాస్తవమేనని తెలిసింది. 2006-అటవీ హక్కుల చట్టం ప్రకారం తునికాకు సేకరణ చిన్న తరహా అటవీ ఉత్పత్తుల కిందకు వస్తుంది. తునికాకును సేకరించడం వారి హక్కు. పులులను రక్షించాల్సిన బాధ్యత కూడా అటవీశాఖపై ఉంది. కానీ ఈ పులుల సాకుతో ఆకు సేకరణ నిలిపేయడం ఎంతమాత్రం సరికాదు. ఆసిఫాబాద్ డివిజన్‌లో కవ్వాల్ టైగర్‌జోన్, మైనింగ్ పేరుతో ప్రతి ఏడాది యూనిట్లు తగ్గిస్తూ వచ్చారు అటవీశాఖ అధికారులు. గతేడాది కేవలం 2 యూనిట్లకే టెండర్లు పిలిచారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో కడంబ టైగర్‌జోన్ పేరుతో గతేడాది 13 యూనిట్లకుగాను 9 యూనిట్లు టెండర్లు పిలిచారు. ఈ విధంగా ప్రతి ఏడాది యూనిట్లు, కల్లాలు తగ్గుతూ వచ్చాయి. ఈ ఏడాది 2024 సీజన్‌కి గాను మొత్తం ఆకు



సేకరణ నిలిపేయాలనే ఆలోచన చేయడం ఆదివాసులు, దీనిపై ఆధారపడి జీవించే పేదకూలీల కడుపు కొట్టడమే.

'తునికాకు సేకరణ లేనట్టే' అని వార్తా పత్రికల్లో రాగానే తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) స్పందించింది. జిల్లా కలెక్టర్‌కు టెండర్లు పిలవాలని వినతిపత్రం అందజేసింది. దీనికి స్పందించిన కలెక్టర్ ఫారెస్ట్ చీఫ్ కన్వీనర్‌కి లేఖ రాశారు. తర్వాత, తునికాకు కల్లేదార్‌లు సమావేశం నిర్వహించి, జిల్లాలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలిచ్చే కార్యక్రమాలను అమలుచేశారు. దశలవారిగా పోరాటాలూ నిర్వహించారు. జనవరి 29న ఆసిఫాబాద్ జిల్లాలోని అటవీశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిఎఫ్‌ఓకి మెమోరాండం అందజేశారు. టీఏజీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి సైతం వినతిపత్రం అందజేయడంతో పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం, అటవీశాఖ జిల్లాలోని 15 యూనిట్లు,179 కల్లాలకు టెండర్లు ఆహ్వానించింది. ఇంకా యూనిట్లు అధికారులు పరిశీలించి, టెండర్ల అనంతరం ఎన్ని యూనిట్లు ఓకే చేస్తే ఆ గ్రామాల పరిధిలో కూలీలకు ఉపాధి దొరుకుతుంది.ఇది టీఏజీఎస్ కూలీల తరపున పోరాడి సాధించిన విజయం. తునికాకు సేకరణకు ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా వచ్చిన డబ్బులు మళ్లీ మార్కెట్‌లోకి వస్తే వ్యాపారాలు పెరుగుతాయన్న విషయం తెలియనిది కాదు.

ఇదే సందర్భంలో 2016 నుండి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. అనేక పోరాటాల ఫలితంగా ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావిడిగా కొన్ని చెక్కులు పంపిణీ చేసింది. జిల్లాలో దాదాపు 45 వేల మంది కూలీలకు బోనస్ రావాల్సి ఉండగా ఇంకా 8,300 మందికి పెండింగ్ లో ఉంది. పెండింగ్ బోనస్ కూడా పోరాడితేనే వస్తుందన్న విషయం గమనంలో ఉంచుకోవాలి. కల్లాలు ఎలాగైతే పోరాడి సాధించు కున్నారో, బోనస్ సాధించడం కోసం కూడా కూలీలు ఏకమై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



- కోట శ్రీనివాస్, 970339151

ఏం చూసి మీకు ఓటెయ్యాలి?

కాంగ్రెస్ రాగానే కరువొచ్చింది

- వరికి బోనస్ ఏమైంది? :సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు సూటి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ ప్రభుత్వాన్ని, నిర్ణయాలను చూసి ఓటేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్యమంత్రిపై సెటైర్లు వేశారు. కాంగ్రెస్‌కు ఏం చూసి ఓటేయాలంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కరువొచ్చిందని వాపోయారు. ఇటీవల ప్రధాని మోడీ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా సీఎం రేవంత్ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తారని విమర్శించారు. మళ్లీ మోడీనే అధికారంలోకి వస్తారంటూ చెప్పడం ద్వారా కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రాబోదంటూ రేవంత్ చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు. గత మూడు నెలల పాలనలో ఆయన ఇటు ప్రజలను,



అటు కాంగ్రెస్ పార్టీని మోసం చేశారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలంటూ ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతులకు రుణమాఫీ చేయలేదనీ, మొన్నటి బడ్జెట్ లో అందు కోసం నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఏమైందని నిలదీశారు. ఆసరా పెన్షన్లు రూ.4 వేలకు పెంచుతామన్న హామీ ఏమైందని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేల పెన్షన్ కూడా నెల నెలా అందటం లేదని వాపోయారు. ఆరు గ్యారంటీల్లో మొత్తం 13 హామీలున్నాయనీ, అవన్నీ ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను చేస్తామంటూ చెప్పిన సీఎం ఇప్పుడు ప్రజల రక్తం పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సాయం చేస్తామన్న హామీ అటకెక్కిందని విమర్శించారు. ఆటోవాలాలకు రూ.12 వేలు ఇస్తామంటూ ప్రకటించిన సీఎం ఇప్పుడు ఆ విషయాన్నే మరిచిపోయారని విమర్శించారు. దాదాపు 70 వేల మందికి సీఎంఆర్ఎఫ్ అందటం లేదనీ, సంబంధిత దరఖాస్తులన్నీ పెండింగ్ లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రావటం లేదంటూ పదే పదే మాజీ సీఎం కేసీఆర్ ను విమర్శిస్తున్న రేవంత్‌కు ఆయన ఆరోగ్యం బాగోలేదన్న సంగతి తెలియదా? అని హరీశ్ ప్రశ్నించారు. ఒక రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని పట్టుకుని ఇలాగేనా మాట్లాడేది? అని వాపోయారు.

ఉపాధ్యాయులకు ఇంటర్ పరీక్షల విధులు వేయొద్దు

- ప్రభుత్వ బడులు మూతపడేలా వ్యవహరిస్తున్న కమిషనర్
- పాఠశాలలను బాగుచేసే డైరెక్టర్‌ను నియమించాలి :సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు విధులను వేయొద్దని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు ఆయన బుధవారం లేఖ రాశారు. ఈ ఏడాది దాదాపు పదివేల మంది ప్రభుత్వ ఉపాధ్యా యులకు ఇంటర్ పరీక్షల విధులను వేశారని తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యాసంవత్సరం చివరిలో చదువు అంతంత మాత్రంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవ త్సరంలో ఈ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఇంకా తగ్గిపోతుం దని వివరించారు. ఈ క్రమం ఇలాగే కొనసాగితే రాబోయే నాలు గేండ్ల తర్వాత ప్రభుత్వ బడులు నామమాత్రంగానే మిగులుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడు ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ఉపాధ్యాయులకు విధులు వేస్తారా?, ఆ విధులను ఎవరు చేస్తారు?అని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులకు బోధించే ప్రభుత్వ, ప్రయివేటు అధ్యాపకులు చేస్తారని తెలిపారు. ఇప్పుడూ అదే పని చేయాలంటూ జనవరి, ఫిబ్రవరిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు లేఖలు రాశానని గుర్తు చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి లేఖ రాస్తే తగు చర్య తీసుకో వాలంటూ కమిషనర్‌కే ఆయన పంపిం చారని పేర్కొన్నారు. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాల్సిన కమిషనర్ మాత్రం చాలా ఉదాసీనంగా వ్యవహరి స్తున్నారని విమర్శిం చారు. ప్రాథమిక విద్యలో ప్రమాణాలు సరిగా లేవం టూ ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ ఎన్) కార్యక్రమాన్ని గతేడాది నుంచి నిర్వహిస్తున్నా రని తెలిపారు. విద్యాసంవత్సరం చివరలో మాత్రం యధాలాపంగా ఉపాధ్యాయులను ఇంటర్, పదో తరగతి పరీక్షల విధులకు, టెన్త్ మూల్యాంక నానికి అనుమతిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను క్రమంగా మూసేయాలనే లక్ష్యంతో వారు పనిచేస్తున్నట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రికి ఈ విషయంపై లేఖ రాశాననీ, ఎలాంటి చర్య కనిపించలేదని తెలిపారు. శాసన మండలిలో ప్రస్తావన చేయబోతే నాటి అధికారపక్షం సంఖ్యా బలంతో మూకదాడి చేసిందని పేర్కొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీద్దాం

- స్టెమ్ ద్వారా గ్రామీణ తెలంగాణ విద్యార్థుల భవితకు ఎన్ఎక్స్ ప్లోరర్స్ కృషి



నవతెలంగాణ-ఖమ్మం

షెల్ ఇండియా మద్దతుతో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్మైల్ ఫౌండేషన్ ఖమ్మంలో ఎన్ఎక్స్ ప్లోరర్స్ కార్నివాల్‌ను నిర్వహించింది. గ్రామీణ పాఠశాల పిల్లలకు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్)లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, జాతీయ స్థాయి విద్యావిధానం (ఎన్ఈపీ) 2020 కనుగుణంగా ఎస్డీజీలను (యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్ మెంట్ గోల్స్) అవగాహన చేసుకోవడాని కి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో బుధవారం కార్నివాల్ నిర్వహించిం ది.స్మైల్ ఫౌండేషన్ తెలంగాణలో వరంగల్, ఖమ్మం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ఎనిమిది జిల్లాల్లోని 116 ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జా తీయంగా ప్రతిష్టాత్మకమైన సోషల్ ఇన్వెస్ట్‌మెంట్ స్టెమ్ ఎడ్యుకేషనల్ కార్యక్రమమైన ఎన్ఎక్స్ప్లోరర్స్ జూనియర్ ప్రోగ్రాముల్ని నిర్వహిస్తోంది.ఈ కార్నివాల్‌కు హాజరైనవారిలో టి.అంజలి, రీజనల్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్సీఓ), ఎంజేపీ స్కూల్స్, పూర్వపు ఖమ్మం జిల్లా చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజ్ శేఖర్ , ఖమ్మం జిల్లా సైన్స్ ఆఫీసర్ డి. జగదేశ్వర్ ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 17 పాఠశాలలకు చెందిన 101 మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) విభాగాల్లో ఎంపిక చేసిన 31 ప్రాజెక్టులు, వినూత్న నమూనాలను ప్రదర్శించారు.

కేరళలో కొత్త అవతారం ఎత్తిన డబ్బావాలాలు !

- లంచ్ బెల్ ప్రాజెక్టు ప్రారంభించిన పినరయి విజయన్ ప్రభుత్వం
- యాప్ ద్వారా ఆర్డర్లు, రూ.60కే భోజనం



తిరువనంతపురం : ముంబయిలో ప్రసిద్ధి చెందిన డబ్బావాలాలు కేరళలో కొత్త అవతారం ఎత్తారు. కేరళలో కుదుంబశ్రీ 'లంచ్ బెల్' ప్రాజెక్టు ప్రారంభం కావడంతో కుదుంబశ్రీ వలంటీర్లు ఫుడ్ డెలివరీ యాప్ అయిన పాకెట్ మార్ట్ ద్వారా ఆఫీసులకు లంచ్ బాక్స్‌లను పంపిణీ చేయడం ఆరంభించారు. ఉదయం 7గంటల వరకు ఆర్డర్లు తీసుకుంటారు. మధ్యాహ్నం 12గంటల కల్లా లంచ్ బాక్స్‌లు అందచేస్తారు. తిరిగి 2గంటల కల్లా వలంటీర్లు లంచ్ బాక్స్‌లను తీసుకెళ్ళిపోతారు. మూడు స్థాయిల్లో పరిశుభ్రమైన పద్ధతుల్లో కడిగిన తర్వాత మళ్లీ ఆ లంచ్‌బాక్స్‌లను ఉపయోగిస్తారు.

బడ్జెట్ లంచ్ బాక్స్ ఖరీదు రూ.60, ఇందులో అన్నం, సాంబారు, చట్నీ, ఊరగాయ, కేరళ వంటకాలైన పులిస్సెరి, కూట్టుకారి వుంటాయి. ప్రీమియం లంచ్ బాక్స్ ఖరీదు రూ.99. ఇందులో మాంసాహార వంటలు వుంటాయి. తొలి దశలో లంచ్ బెల్ ప్రాజెక్టును తిరువనంతపురంలో సెక్రటేరియల్, అసెంబ్లీ, వికాస్ భవన్, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థల్లో అమలు చేస్తారు. రాబోయే కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తారు. రెండో దశలో కోచిలో ఈ ప్రాజెక్టును చేపడతారు.

తిరువనంతపురంలోని కెటిడిసి గ్రాండ్ చైత్రమ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేరళ స్థానిక స్వపరిపాలనా సంస్థల శాఖ మంత్రి ఎం.బి.రాజేష్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన మహిళలతో కూడిన మొదటి ఫుడ్ డెలివరీ బృందం మొదటి ప్రయాణాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, కుదుంబశ్రీ మహిళల ఆర్థిక సాధికారతకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. కుదుంబశ్రీ మౌలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడం ద్వారా కుదుంబశ్రీ సభ్యుల ఆర్థిక సాధికారతతో పాటూ వారి ఆదాయాలు పెంచే చర్యలను అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. నైపుణ్యాలు, విశ్వసనీయతకు మారు పేరు కుదుంబశ్రీ అన్నారు. మహిళల ఆదాయాలు పెంచేందుకు ఈ ప్రాజెక్టు కింద వివిధ పథకాలను ప్రారంభించామన్నారు. అగ్రి కియోస్కోలు రసాయనాలు లేని కూరగాయలు, పళ్ళు అందచేస్తాయన్నారు. వృద్ధులైన రోగుల సంరక్షణను చూసేందుకు కె 4 కేర్ స్కీమ్ ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఏడాది కాలంలో మూడు లక్షల మందికి జీవనోపాధి, ఉపాధి అవకాశాలు అందచేసేందుకు కె-లిఫ్ట్ 24 (కుదుంబశ్రీ లైవ్‌లీహుడ్ ఇనీషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్) ప్రాజెక్టును రూ.430కోట్లతో చేపట్టామన్నారు. మొత్తంగా అన్ని పథకాలు మహిళలకు ఉపాధిని, ఆదాయాలను ఉత్పత్తి చేసేందుకు ఉద్దేశించినవేనన్నారు.

ఈ పాకెట్ మార్ట్ యాప్ ద్వారా భోజనాలతో పాటూ ఇతర ఆహార పదార్థాలకు కూడా డిమాండ్ వుందని కుదుంబశ్రీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్ మాలిక్ తెలిపారు.

కేరళలో ఇకనుంచి కె-రైస్ !

- కిలో రూ.30చొప్పున విక్రయాలు

తిరువనంతపురం : శబరి కె-రైస్‌ను ప్రవేశపెట్టాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి జి.ఆర్.అనీల్ బుధవారం ఇక్కడ జరిగిన పత్రికా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. సప్లై కో కేంద్రాల ద్వారా ప్రజలకు సరసమైన ధరలకు మంచి నాణ్యత గల బియ్యాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ఆరంభించినట్లు మంత్రి తెలిపారు.

దీనితో పాటూ ప్రస్తుతం సప్లై కో నుండి కార్డుకు పది కిలోల చొప్పున సబ్సిడీ ధరలకు ఇస్తున్న బియ్యం పంపిణీ కూడా కొనసాగుతుందని మంత్రి చెప్పారు. కె-రైస్ అనేది కూడా అందులో భాగంగానే వుంటుందన్నారు. కిలో రూ.40 చొప్పున ప్రభుత్వం వివిధ రకాల బియ్యాన్ని కొనుగోలు చేస్తుంది. వాటిని రూ.30 చొప్పున సబ్సిడీ రేట్లకు విక్రయిస్తుంది. జయా రైస్ ధర రూ.29గా నిర్ధారించగా, కురువ, మట్టా రకాలు రూ.30కి అందుబాటులో వుంటాయి. జయా వెరైటీ బియ్యం తిరువనంతపురం ప్రాంతంలోనే విక్రయిస్తారు. మట్టా వెరైటీని కొట్టాయం, ఎర్నాకుళం ప్రాంతాల్లో, కురువ రకాన్ని పాలక్కాడ్, కోజికోడ్ ప్రాంతాల్లో అందుబాటులో వుంటాయని మంత్రి చెప్పారు.

ఒక బ్రాండ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా మొదటి దశలో శబరి కె-రైస్‌ను ఆ లోగో గల గోనె సంచుల్లో విక్రయిస్తారు. మొత్తంగా ఈ గోనె సంచులకయ్యే బడ్జెట్ రూ.10లక్షల ల్లోపే వుంటుందని, దాన్ని సప్లై కో అడ్వర్టయిజ్‌మెంట్స్ బడ్జెట్ నుండి వాడతామని చెప్పారు.

కె-రైస్ బ్రాండ్ కింద సబ్సిడీ రేట్లకు అధిక నాణ్యత గల వెరైటీలను అందచేస్తుండగా, నాఫెడ్ ద్వారా కిలో రూ18.59కు, ఎన్‌సిసిఎఫ్ ద్వారా కిలో రూ.29 చొప్పున కొనుగోలు చేసి వాటిని రూ.29 చొప్పున భారత్ రైస్‌గా విక్రయిస్తున్నారని మంత్రి చెప్పారు. భారత్ రైస్ పేరుతో ప్రజలకు విక్రయించడం ద్వారా కేంద్రం కిలోకు రూ.10చొప్పున లాభం పొందుతోందన్నారు. అదే సమయంలో కె-రైస్‌ను విక్రయించేందుకు కిలోకు రూ.9.5 నుండి 11.11 వరకు అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని మంత్రి అనీల్ చెప్పారు.

ఎప్‌సెట్‌కు 51 వేల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 51,271 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 32,769 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 18,451 మంది, ఆ రెండు విభాగాలకూ 51 మంది కలిపి మొత్తం 51,271 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల ఆరో తేదీ వరకు ఉన్న విషయం తెలిసిందే. మే తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఒగ్గు పూజారులకు ఆరోగ్య భద్రత కల్పించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ ఒగ్గు పూజారుల సంఘం నేతలు బుధవారం సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. తమకు ఆరోగ్య భద్రత కల్పించాలని వారు ఆమెను కోరారు. వృత్తిపరమైన కార్యక్రమాల్లో భాగంగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి.. కొమురవెల్లి దేవస్థాన ఈవో బాలాజీతో అప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

సీఎంకు కృతజ్ఞతలు :బి వేణుగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీశాట్ చైర్మెన్‌గా నియమితులైన బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఆ పదవిలో నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డిని సీఎం అభినందించారు.

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఆన్‌లైన్‌లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరువొచ్చినా.. ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయనీ, కలిసికట్టుగా దాన్ని ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవటంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయనీ, అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. వారందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే వేసవిలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందనీ, అందుకనుగుణంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బుధవారం హైదరాబాద్‌లో ఉదయం తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సెక్రెటరీ, కమిషనర్ రఘునందనరావు, డైరెక్టర్ గోపి, రైతు సంఘాల ప్రతినిధులు సుంకెట అన్వేష్ రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు సచివాలయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి పలువురు రైతులు కాన్ఫరెన్స్‌లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్‌కు అనుసంధానం చేసి నేరుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. తొలి విడతలో ప్రయోగాత్మకంగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను నెలకొల్పింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రూ.97 కోట్లతో ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. దీంతో రాష్ట్ర అధికారులతో పాటు వ్యవసాయ నిపుణులు నేరుగా గ్రామాల్లో, పంట పొలాల్లో ఉండే రైతులతో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలతో పాటు అధునాతన మెళకువలను ఎప్పటికప్పుడు వారికి అందించనున్నారు. ఆదర్శ రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది. రైతు నేస్తం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రతి సీజన్లో రైతులు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ఎప్పటికప్పుడు వారికి సలహాలు, సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు నేరుగా వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరికి వెళుతున్నదనీ, అందులో భాగంగానే రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పంటలకు గిట్టుబాటు ధరే కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకెళ్తున్నదని తెలిపారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు కార్యక్రమాలన్నింటినీ చేపడతామని వివరించారు.రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉందని ఆయన తెలిపారు. కేవలం వరి లేదా పత్తి మిర్చి పంటలకే పరిమితం కావద్దని రైతులకు సూచించారు. ఇతర పంటలను కూడా సాగు చేయాలనీ, పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ నీళ్లతో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవలే పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చిందని సీఎం గుర్తు చేశారు. రైతులు ఏదైనా ఆపదతో చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ఆదుకుంటుందని తెలిపారు. పంట పెట్టుబడి పెట్టినప్పటి నుంచి కరువు వచ్చినా, వరదొచ్చినా నష్టపరిహారం అందుతుందనీ, రైతులు పెట్టిన పెట్టుబడి వారికి తిరిగి వస్తుందని స్పష్టం చేశారు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం అన్నారు.

పాడి రైతుల బిల్లులు చెల్లించండి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్

- విజయ డెయిరీ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-ఓయూ

పాడి రైతులకు విజయ డెయిరీ పెండింగ్ పెట్టిన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇవ్వాలని, సబ్సిడీపై దాణా సరఫరా చేయాలని కోరారు. సబ్సిడీపై పశువులను సరఫరా చేయాలని, రైతులకు, పశువులకు బీమా సౌకర్యం కల్పించాలని, విద్యుత్ అధికారులు ఫైన్‌లు వేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రైతు సంఘం, విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లాలాపేటలోని విజయ డెయిరీ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సాగర్, నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పాడి రైతులకు ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఐపీ కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యలో వివిధ జిల్లాల్లో విద్యుత్ అధికారులు డెయిరీ ఫామ్‌ల యజమానులపై జరిమానాలు వేస్తున్నారని, బావుల వద్ద పశువులను పెంచుకుంటే.. బావిలోని నీళ్ల పశువులు తాగినా ఫైన్ వేస్తామనడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పాడిరైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు, ప్రభుత్వానికి డెయిరీ ఎండీ లెటర్ రాయాలని కోరారు. లీటర్ పాలకు రూ.4 ఇన్సెంటివ్ మూడు సంవత్సరాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఈ కొత్త ప్రభుత్వం ఎన్నికల ముందు పాడి రైతులకు లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇస్తానని హామీనిచ్చిందని.. దాన్ని వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశ పెట్టాలని, పాడిరైతులకు గడ్డి కటర్ మిషన్, పాలు పిండే మిషన్, దాణా 50 శాతం సబ్సిడీతో సరఫరా చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ పరిరక్షణ సమితి నాయకులు సాదం రమేష్, ఉప్పలయ్య, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దర్శి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల జంగయ్య, రాష్ట్ర నాయకులు టి.కిషోర్, రాష్ట్ర కో కన్వీనర్ విరమల్ల రాజయ్య, సునీల్, కోటగిరి నాగేశ్వరరావు, పెంట రమేష్, రాజేష్, జిల్లాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం : డెయిరీ ఎండీ

పాడి రైతుల ఆందోళనతో విజయ డెయిరీ ఎండీ చిట్టెం లక్ష్మి వారితో చర్చలు జరిపారు. నాలుగు రోజుల్లో ఒక బిల్లు చెల్లిస్తామని, రెండు బిల్లులు 15 రోజుల్లో చెల్లిస్తామని ఎండీ హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

కార్మికులను చైతన్యపర్చండి

- సింగరేణి అభివృద్ధిలో అధికారులది కీలక పాత్ర : సీఎమ్‌డీ ఎన్ బలరాం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సంస్థ స్థితిగతులను వివరిస్తూ కార్మికుల్లో అంకితభావం పెంపొందేలా చైతన్యవంతం చేయాలని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంస్థ అభివృద్ధిలో కార్మికులతో పాటు అధికారులదీ కీలకపాత్ర అని స్పష్టం చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం 'కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా-సింగరేణి' ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ప్రస్తుత పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలనీ, దీనికోసం ప్రతి అధికారి, కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులను వారికి వివరించారు. సంస్థను మరింత వేగంగా అభివృద్ధిలోకి తెచ్చే నిర్మాణాత్మక చర్యలు సూచించాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలిస్తాం

- హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు లేదా ఇండ్లస్థలాలు ఇస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తుందని చెప్పారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మంత్రుల నివాస సముదాయంలో సంఘం నేతలతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే కార్యవర్గానికి, సభ్యులకు పొంగులేటి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు జర్నలిస్టులు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఇండ్లు, ఇండ్లస్థలాలు, ఇతర జర్నలిస్టుల సమస్యలను హెచ్‌యూజే నేతలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పొంగులేటి స్పందిస్తూ జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. వారి సీనియార్టీని బట్టి కేటగిరీలుగా విభజించి అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వం దృష్టిలో అన్ని జర్నలిస్టు సంఘాలు సమానమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్ కుమార్, బి జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, కోశాధికారి బి రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రాధిక, కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, ఉపాధ్యక్షులు బి దామోదర్, ఎం రమేష్, జి వీరేష్, జాయింట్ సెక్రెటరీ ఎ ప్రశాంత్, కార్యవర్గ సభ్యులు పి విజయ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 15,205 మంది గైర్హాజరు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,26,197 మంది దరఖాస్తు చేయగా, 4,10,992 (96.5 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 15,205 (3.5 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పెద్దపల్లిలో నలుగురు, కరీంనగర్‌లో ఒకరు, జగిత్యాలో ముగ్గురు కలిపి మొత్తం పది మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పేపర్-1 పరీక్షకు సెట్ బీ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. మంచిర్యాల, నారాయణపేట, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు.

సీఎంను కలిసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కలిశారు. తామా మర్యాదపూర్వకంగానే సీఎంను కలిసినట్టు తెలిపారు.

భద్రాద్రి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో రండి

- నిధులు కేటాయింపులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాచలం ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో వస్తే, నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు, సీఎం పర్యటన నేపథ్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాలయం చుట్టూ రెండు ప్రాకారాలు, రోడ్డు నిర్మాణానికి అధికారుల వద్ద ఉన్న ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించారు. ఈనెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన, రాముల వారి దర్శనం నేపథ్యంలో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఇంజనీరింగ్, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్లికార్జున్‌రెడ్డి, స్థపతి, దేవాదాయ శాఖ సలహాదారు శ్రీవల్లి నాయగం, ఆర్డీవో దామోదర్‌రావు, ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌లో లక్ ఎవరిదో..!

సికింద్రాబాద్‌పై ప్రధాన పార్టీల ఫోకస్



- ఆరు గ్యారంటీల అమలే ప్రచార అస్త్రంగా కాంగ్రెస్
- నియోజకవర్గాల సమావేశాలతో బీఆర్ఎస్ బిజీబిజీ
- విజయ సంకల్ప యాత్రలో బీజేపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఎలాగైనా ఈ స్థానాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. వివిధ కార్యక్రమాలతో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నియోజకవర్గంలో పాగా వేసేందుకు పోటాపోటీగా పని చేస్తున్నాయి.

చేరికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి..

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరుతూ పార్టీ ముఖ్య నాయకులు ఏ కార్యక్రమం జరిగినా వివరిస్తూ ముందుకెళ్తున్నారు. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానంగా చేరికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఇటీవల మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, డిప్యూటీ మేయర్ దంపతులు, ఇతర కార్పొరేటర్లు, ముఖ్యనేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ పరిణామం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంగా మారింది. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు తమ నేతలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసే పార్టీలోకి చేరుతున్నారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బొంతు రామ్మోహన్ బరిలో దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఈ టికెట్‌పై ప్రముఖ విద్యావేత్త డాక్టర్ విద్యాస్రవంతి కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరితోపాటు మరో డజను మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందో వెచిచూడాల్సిందే.

బీఆర్ఎస్ అభ్యర్థిపై స్పష్టత కరువు..!

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో సీట్లు గెలిచినా.. గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం చతికిలపడింది. గ్రేటర్‌లోని నాలుగు పార్లమెంట్ స్థానాల పరిధిలో 28 స్థానాలుండగా.. వీటిలో కాంగ్రెస్ కేవలం మూడు స్థానాలనే గెలిచింది. బీఆర్ఎస్ 17, ఎంఐఎం ఏడు, బీజేపీ ఒక స్థానాన్ని గెలుపొందాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అందరూ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావడం.. రెండుసార్లు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించడం ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో కలిసొచ్చే అంశమే. కానీ బీఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థి లేరు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ బరిలో నిలిచి ఓటమిచెందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తరపున పోటీలో దిగేందుకు ఎవరూ ఆసక్తి చూపెట్టకపోవడంతో.. సాయికిరణ్‌కే మరోసారి టికెట్ దక్కనుందని సమాచారం.

సిట్టింగ్‌కే ఛాన్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో ఒక స్థానానికే పరిమితమైన బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా పార్లమెంట్ ఫలితాలు ఉంటాయనే ధీమాతో ఉన్న కమలం పార్టీ.. ఇప్పటికే రాష్ట్రంలోని 17 స్థానాలకు తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి మరోసారి కిషన్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఈ స్థానంలో మరోసారి కాషాయ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ ఉవ్విళ్లూరుతోంది. విజయసంకల్ప యాత్ర చేపట్టి సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాలకు వివరించడంతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలంటూ ప్రజల ఆదరాభిమానాలు పొందేందుకు యత్నిస్తోంది. అయితే సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన కిషన్‌రెడ్డి.. గడిచిన ఐదేండ్లలో నియోజవర్గాన్ని పెద్దగా పట్టించుకోకపోగా.. ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంపీ రాములకు ఘన సన్మానం



నవతెలంగాణ - బడంగ్‌పేట్

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పి.రాములును రాష్ట్ర బీజేపీ నాయకులు, మాజీ సింగల్ విండో చైర్మన్ కోలన్ శంకర్ రెడ్డి ఆయన స్వగృహంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మంగీయ నాయక్, ధర్మానాయక్ జడ్పీటీసీ సభ్యులు, ఓబీసీ నాయకులు గోపినాథ్ తదితరులు ఉన్నారు.

ఆట స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి



నవతెలంగాణ-సంతోష్‌నగర్

వాంబేకోటర్స్ సింగరేణి కాలనీలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో పిల్లలకు ఆట స్థలం, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరుతూ సైదాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ వైఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మహమూద్, బస్తీవాసులు శ్రీను, భారతి, లక్ష్మీ, జ్యోతి, కుమార్, జగత్, ఫాతిమా, ధనమ్మ, సరిత, ఎలీషా, బాలమ్మ, శకుంతల, బుచ్చమ్మ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

హాకీ సీనియర్ ఉమెన్ నేషనల్స్‌కు మీనా ఎంపిక



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న పి. మీనా ఈ నెల 14 నుంచి పూణేలో జరగనున్న హాకీ సీనియర్ ఉమెన్ నేషనల్స్‌కు తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైంది. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జోత్స్నప్రభ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధ్యాపకులు విద్యార్థిని మీనాకు అభినందనలు తెలియజేశారు. జాతీయస్థాయిలో హాకీ టీంకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని మీనా అన్నారు. అనంతరం అందుకు స్ఫూర్తినిచ్చిన అధ్యాపకులకు, తాతయ్య గట్టయ్యకు, తల్లీదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ జాహేదా బేగం, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎస్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, డాక్టర్ రవీందర్, డాక్టర్ ఆవేస్ మోయుద్దీన్, డాక్టర్ సురేష్ రెడ్డిలు మీనాకు పదివేల ఆర్థిక సహాయం అందజేశారు.

స్టాండింగ్ కమిటీ అత్యంత ప్రాముఖ్యమైంది

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- నూతనంగా ఏర్పాటైన స్టాండింగ్ కమిటీలో 14 అంశాలకు ఆమోదం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమిటీ అని, నిర్మాణాత్మక, ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. నూతనంగా ఏర్పాటైన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం మేయర్ అధ్యక్షతన జరిగింది. స్టాండింగ్ కమిటీ సభ్యులకు మేయర్ సాదరంగా స్వాగతం పలికి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీకి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రతి గురువారం నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందని మేయర్ తెలిపారు. జీహెచ్ఎంసీలో ప్రాపర్టీల, యుటిలిటీల గుర్తింపుకు జీ.ఐ.ఎస్ బేస్డ్ సర్వే మ్యాపింగ్ అమలుకు ఆమోదం తెలిపింది. కూకట్‌పల్లి మండలం ఎల్లమ్మ చెరువు నుండి డ్రైనేజీ గతంలో ప్రతిపాదించిన 1200 ఎంఎం డయాఫైప్ లైన్‌కు మొత్తం రూ.274.00 లక్షల మంజూరు కాగా అవే నిధులతో 1600 ఎంఎం పైపు లైన్ వేయుటకు ఆమోదం తెలుపుతూ కమిటీ ఆమోదించింది. శేరిలింగంపల్లి మండలం నానక్ రాంగూడ రంగలాల్ కుంట వద్ద బ్యాలెన్స్ అభివృద్ధి పనులు, శేర్లింగంపల్లి మండలం హాఫీజ్‌పేట్ కొత్తకుంట చెరువు వద్ద మిగులు అభివృద్ధి పనులను, కూకట్‌పల్లి మండలం మూసాపేట్ ముళ్ళ కత్వ చెరువు వద్ద అభివృద్ధి మిగులు పనులను చేసేందుకు సీ.ఎస్.ఆర్ కింద ఒక సంవత్సరం పాటు పొడిగిస్తూ, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎం.ఓ.యూ చేసేందుకు కమిటీ ఆమోదం. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి బర్లకుంట చెరువు పునరుద్ధరణ, కొత్తగూడ నేరెళ్ల కుంట చెరువు పునరుద్ధరణకు ఆమోదం లభించింది. మూసారంబాగ్ మూసీ నదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా (1) అలీ కేఫ్, అంబర్‌పేట్ నుండి మూసారాంబాగ్ స్పైస్ రెస్టారెంట్ వరకు, ఆలీ కేఫ్ ఎక్స్ రోడ్, అంబర్‌పేట్ నుండి మూసారాంబాగ్ బ్రిడ్జి, అజామాబాద్ డివిజన్‌కు యుటిలిటీల షిఫ్టింగ్ కోసం అంచనా వ్యయం మొత్తం రూ.3,97,32,391లను పరిపాలన అనుమతికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. ఎల్బీనగర్ సర్కిల్ బైరమల్‌గూడ చెరువు నుండి సరూర్‌నగర్ చెరువు వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణానికి రివైజ్డ్ కోసం కమిటీ ఆమోదం లభించింది. జీహెచ్ఎంసీ పరిధిలో పారిశుద్ధ్యం, అడ్వర్టైజ్మెంట్‌పై రెండు అడ్ హాక్ కమిటీల ఏర్పాటుకు కమిటీ ఆమోదం తెలిపింది. చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ద్వారా 31 జనవరి 2024 నెలకు సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికను కమిటీ ముందు పెట్టారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆవుల రవీందర్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, చింతల విజయ శాంతి, పొడవు అర్చన, ఫహద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ ఖాదిర్, మహమ్మద్ నసీరుద్దీన్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, రఫత్ సుల్తానా, షహీన్ బేగం, సబీహ బేగంతోపాటు కమిషనర్ రోనాల్డ్ రోస్, ఈ.వీ.డీ.ఎం ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, స్నేహ శబరీష్, ఈ.ఎస్.సీ జియా ఉద్దీన్, సీఈలు దేవానంద్, కిషన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా మాధురి, చంద్రకాంత్ రెడ్డి, జయరాజ్ కెన్నెడీ, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు హేమంత్, అభిలాష అభినవ్, రవికిరణ్, వెంకన్న, సునంద, ముకుంద రెడ్డి, సిసిపి రాజేంద్ర ప్రసాద్ నాయక్, అకౌంట్స్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, ఎంటమాలజి డా.రాంబాబు, కార్యదర్శి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి



- వీఎస్ఎన్ శ్రీనివాస్ రావు

నవతెలంగాణ - చైతన్యపురి

మహిళలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లో కూడా రాణించాలని డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. మహిళా మండలి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతను సాధించాలని అన్నారు. మగవారికి ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలని మహిళలకు సూచించారు. మానవ జాతికి మహిళ ఓ వరం అని, మహిళా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు కోరారు. మహిళలు సామాజిక సేవలో ముందు ఉండాలన్నారు. ఈ వేడుకలలో అధ్యక్షురాలు మమత, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ లింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షురాండ్లు వక్కలంక అన్నపూర్ణ, రామలక్ష్మి, జ్యోతి, సరిత, అడ్డు నిత్య, సంధ్య, పద్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీఐ సైదిరెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ - సంతోష్‌నగర్

నూతన బాధ్యతలు చేపట్టిన సరూర్‌నగర్ సీఐ సైదిరెడ్డిని చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవస్థానం మాజీ చైర్మన్ మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొంబాయ్ యాదయ్య, ఏరియా కమిటీ సభ్యులు ఏనుగుల జగదీష్ గౌడ్, స్థానిక నాయకులు గుండెబోయిన చందు యాదవ్, బీసీ సెల్ సెక్రెటరీ జగదీశ్ పాల్గొన్నారు.

'మానస' లో దంత వైద్య శిబిరం



నవతెలంగాణ - చైతన్యపురి

జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ఓరల్ హెల్త్ ఫౌండేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థలో బుధవారం డాక్టర్ ఎస్‌కెఎస్ అరవింద్, డాక్టర్ అనిరుధ్ మాథుర్, డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానస మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలోని విద్యార్థులకు, వారి తల్లీదండ్రులకు, మానస సిబ్బందికి దంత వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులలో ఉన్న దంత క్షయం, ఫ్లోరోసిస్, ప్లైయోరియా వంటి వివిధ దంత సమస్యలను గుర్తించినట్టు వైద్యులు వెల్లడించారు. దంత సమస్యలున్న పేద విద్యార్థులకు ఓరల్ హెల్త్ ఫౌండేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో అందుబాటు ధరలలో చికిత్స అందిస్తామని ఫౌండేషన్ వారు తెలిపారు. దంత సమస్యలు వచ్చినప్పుడు వెంటనే దంత వైద్యుల వద్ద పరీక్ష చేయించుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్.అరవింద్ సూచించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి తమ సంస్థలో ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక పాఠశాల, న్యూరో డెవలప్‌మెంటల్ క్లినిక్, వికలాంగుల కోసం వృత్తి శిక్షణా కేంద్రం వంటి వివిధ సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మానస డైరెక్టర్ మెర్సీ మధురిమ, మానస సిబ్బంది, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

డ్రయినేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు



నవతెలంగాణ - హస్తినాపురం

డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించడం వలన సమస్య కొన్ని రోజుల వరకు పునరావృతం కాకుండా ఉంటుందని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని రోషన్ దౌలాలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించడం వలన డ్రైనేజీ నీరు సునాయసంగా బయటకు వెళ్తుందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి పూడికతీత పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఆమె వెంట పెంటయ్య, భీమ్రాజ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలదే పై చేయి



అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి

నవతెలంగాణ - సిటీబ్యూరో

దేశంలోని అన్ని రంగాల్లో మహిళలదేపై చేయి అని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లిలోని అనంత న్యాయ కళాశాలలో బుధవారం జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సంగీతారెడ్డి మాట్లాడారు. కొత్త ఇన్నోవేషన్స్‌లో భారతదేశం ఎప్పుడూ ముందుంటుందన్నారు. మహిళా సాధికారత కోసం న్యాయ శాస్త్ర విద్యార్థుల తోడ్పాటు అవసరం ఉందన్నారు. మహిళల రాజ్యాంగ హక్కులు, వాణిజ్య రంగంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవి అనంత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ.చంద్రమతితో పాటు న్యాయ శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-హయత్ నగర్

రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉచితంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఉద్యోగ రీత్యా ఒత్తిడితో ఉండే పోలీసులకు 6 నెలలకు ఒక్కసారి అయిన వైద్య పరీక్షలు తప్పనిసరి అని సూచించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఇనిస్పెక్టర్ రామాంజనేయులు, ఎస్ఐలు దయాకర్ రెడ్డి, లింగారెడ్డి, మధు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'నారీ శక్తివందన్ మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుంది'



నవతెలంగాణ- నాగోల్

నారీ శక్తివందన్ అనేది మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు చట్టసభల్లో మహిళ ప్రాతినిధ్యాన్ని పటిష్టపరిచే సమగ్ర దృష్టితో కూడిన చట్టం అని, దీంతో మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందని మల్కాజిగిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున అన్నారు. నారీ శక్తివందన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగోలు డివిజన్‌లోని పోచంపల్లి ముత్యంరెడ్డి కన్వెన్షన్ హాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్‌లతో పాటు జమున హాజరై మాట్లాడారు. గతంలో వ్యతిరేకిస్తున్న నారీశక్తివందన్‌కు మద్దతు ఇవ్వాలని దేశంలోని మహిళా శక్తి అన్ని రాజకీయ పార్టీలను బలవంతం చేసిందన్నారు. నారీ శక్తివందన్ శాసన రంగాలలో సమతుల్య విధానాలను రూపకల్పనకు ఆదర్శవంతమైన పరిస్థితిని సృష్టిస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్, పాదూరి కరుణ, కాలంశెట్టి లయ, నందికొండ గీత రెడ్డి, కొప్పెర శ్యామల, బండారు శైలజ, కేశిరెడ్డి పద్మారెడ్డి, రాధిక, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్' హామీని నిలబెట్టుకోవాలని ధర్నా



నవతెలంగాణ - ఎల్బీనగర్

గత ఎన్నికల హామీలలో భాగంగా ఎల్ఆర్ఎస్‌ను పూర్తిగా నయా పైసా ఖర్చు లేకుండా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే సామాన్య ప్రజలను నడ్డి విరిచే విధంగా ఎల్ఆర్ఎస్‌పైన సుమారు 20వేల కోట్ల రూపాయలు వసూలు చేసే విధంగా ఉందని ఆరోపించారు. ఈ విషయంపై ప్రజల తరవు నుండి బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైందని అన్నారు. బూటకపు హామీలు ఇచ్చి అమలు చేయలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిపోయిందని విమర్శించారు. ఎల్ఆర్ఎస్‌పైన నయా పైసా తీసుకోకుండా చేసేంత వరకూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీలు దయనంద్ గుప్తా, ఎగ్గే మల్లేశం, నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, పలు డివిజన్ల తాజా, మాజీ అధ్యక్షులు, పలు విభాగాల చైర్మన్లు, ధర్మకర్తలు, అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను, ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బడంగ్‌పేట్ కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి అధ్యక్షతన బుధవారం పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మేము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పి..నేడు మార్చి నెలాఖరు వరకు గడువు పెట్టడం ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఆందోళన, కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.





టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రి బాక్స్‌లు అందజేత

నవతెలంగాణ- నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని నాగోల్, కొత్తపేట, ఎల్బీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు టీంయంఆర్ఆర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా పరీక్ష పాడ్లు, జామెట్రి బాక్స్‌లు అందజేశారు. ఈ పదో తరగతి పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పది వేల రూపాయలు బహుమతిగా అందజేయడం జరుగుతుందని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాం రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పన్యాల జైపాల్ రెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సాయిరాం, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, మైపల్ రెడ్డి, యుగేందర్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | మార్చి 07, 2024 | www.navatelangana.com

ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఇరిగేషన్, ఫుడ్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ మహిళా స్టేట్ జనరల్ సెక్రెటరీ ఇస్రాత్ నిస్సా, మల్కాజిరి సర్కిల్ పరిధిలోని 137 వినాయక్ నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మోమిన్ భాషతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో నాయకులు నరసింహగౌడ్, ఆశ, కీర్తి గణేష్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా చక్కని ప్రణాళికతో ముందుకు సాగాలని ఎల్‌టీఐ మైండ్ ట్రీ అసోసియేట్ డైరెక్టర్ త్రివేణి బొంతు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ఉన్న అనురాగ్ యూనివర్సిటీలో మహిళా అధ్యాపకులు, విద్యార్థులు మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి త్రివేణి బొంతు హాజరై "ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్ గురించి మాట్లాడారు. జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా చక్కని ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాలాజీ ఉట్ల, సీఈవో ఎస్. నీలిమ, వివిధ డిపార్ట్‌మెంట్ల డీన్స్, అనురాగ్ యూనివర్సిటీ మహిళా సంక్షేమ కమిటీ కన్వీనర్ డాక్టర్ డి.శిరీష, కో కన్వీనర్ డాక్టర్ పి. సరిత, స్వప్న గౌడ్ పాల్గొన్నారు.

వంశరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



- ప్రారంభించిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వంశరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశరాజ్ మల్లేష్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వంశరాజ్ మల్లేష్ మాట్లాడుతూ.. అన్నదానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. భక్తులకు ప్రతి ఏడాది ఉచితంగా అన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు.

కీసరగుట్టలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



- పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నవతెలంగాణ-కీసర

తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల తో బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం విఘ్నేశ్వర పూజతో వేదపండితులు బ్రహ్మోత్సవాలను అంకురార్పణ చేశారు. పుణ్యాహవచనం, ఋత్విక్ వరణం, యాగశాలా ప్రవేశం, అఖండ జ్యోతి ప్రతిష్టాపనం, అగ్ని ప్రతిష్టాపన, భేరిపూజ, ధ్వజారోహణ, మంత్రపుష్పం, పరాకస్తనం పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్స వాల లో భాగంగా చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో నరేందర్‌లు వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కుటుంబ సభ్యులు తటాకం నారాయణ వర్మ, తటాకం వెంకటేష్ శర్మ, తటాకం రమేష్ శర్మ, తటాకం ఉమాపతి వర్మ తటాకం శ్రీనివాస్ శర్మ ,ఆలయా ధర్మ కర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

కళ తప్పిన జాతర..

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధికారులు ప్రతి ఏడాది క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం ఆనావాయితీగా ఉండేది. ఆ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనేవారు. జాతరకు వచ్చిన భక్తులు విద్యార్థుల ఆటలను ఆస్వాదిస్తుండేవారు. కానీ ఈ ఏడాది ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ఉండటంతో క్రీడా పోటీలు నిర్వాహించలేక పోయామని అధికారులు వెల్లడించారు.

జాతరలో చెత్త సేకరణకు డ్రమ్ములు అందజేత



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రముఖ పారిశ్రామిక వేత్త మణ్యం సుబ్రహ్మణ్యం జాతరలో చెత్త సేకరణ కోసం 75 డ్రమ్ములు, పారిశుధ్య కార్మికులకు భోజనం కోసం 21 క్వింటాలు బియ్యం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సాంబిరెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల కు ప్రముఖ పారిశ్రామిక వేత్త మణ్యం సుబ్రహ్మణ్యం విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మణ్యం సుబ్రహ్మణ్యంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యామ, ఎంపీవో వినూత్న, పంచాయతీ కార్యదర్శి గంగన్న, కందాడి హనుమంత్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజా, శ్రీనాథ్ రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను తర్వగా పరిష్కరిస్తాం



- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని మురుగు నీరు, డ్రయినేజీ సమస్య ఉన్నా హర్షిత ఎన్‌క్లేవ్, ప్రొఫెసర్ జయశంకర్ కాలనీల్లో పర్యటించారు. ఫైరింగ్ రేంజ్ దగ్గరలోని ఫెన్సింగ్ సమస్యను త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ మాధవచారి, కాలనీవాసులు సదానంద్, వెంకటేష్, వెంకట నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్దాం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్

రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి ముందుకెళ్దామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్‌లోని గోఖలేనగర్, బృందావన్ గార్డెన్ నుంచి శారదనగర్ మెయిన్ రోడ్డు వరకు సివరేజ్ లైన్‌ను డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో ఎన్నో ఏండ్ల నుంచి ఉన్న సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న, నాగేశ్వర్ రావు, బీజేపీ నాయకులు కాపర్తి కృష్ణమోహన్, నిరంజన్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, ముస్తాక్, దయాకర్ రెడ్డి, బోసాని పవన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డాగా పీర్జాదిగూడ కార్పొరేషన్

- నియంత్రణలో చేతులెత్తేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- కార్పొరేషన్ ఆదాయానికి గండీ పడుతున్నా పట్టింపు లేదా ?



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా నిర్మాణాలు చేపడు తున్నా టౌన్ ప్లానింగ్ అధికారుల పట్టించు కోవడంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి.



టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

కార్పొరేషన్ పరిధిలో కొన్ని డివిజన్లలో అనుమతులు లేకుండా ఇష్టానుసారం చేపడుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీనిని ఆసరగా చేసుకుంటున్న అక్రమార్కులు అక్రమ నిర్మాణాల్లో నిమగ్నమైయ్యారు. కార్పొరేషన్ పరిధిలో నిత్యం కమిషనర్లు మారడం, నగర ప్రణాళిక విభాగంలో సరైన సిబ్బంది లేకపోవడం, టౌన్ ప్లానింగ్ అధికారి స్థిరంగా లేకపోవడంతో కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

ఆదాయాని గండీ పడుతున్నా చర్యలు శూన్యం

కార్పొరేషన్‌కు ఆదాయంలో అధిక భాగం నిర్మాణపు అనుమతులు ద్వారానే వస్తుంది. అలా వచ్చిన ఆదాయంతోనే కార్పొరేషన్ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతారు. కానీ పీర్జాదిగూడలో ఎక్కడ చూసినా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుండడంతో కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి భారీగా గండీ పడుతోందని విమర్శలు వస్తున్నాయి.

నోటీసులు జారీ చేస్తున్నాం



కార్పొరేషన్ పరిధిలో చేపట్టే నిర్మాణాలకు పురపాలక చట్టం ప్రకారం టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులు పొందాలని కార్పొరేషన్ ప్రజలను చైతన్యం చేశాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేశాం. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-త్రిలేశ్వర్ రావు, కమిషనర్, పీర్జాదిగూడ కార్పొరేషన్

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ఉన్న అనుమతి లేని నిర్మాణాలపై కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాల కారణంగా పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు భారీగా నష్టం వాటిల్లుతుంది. కార్పొరేషన్‌కు ఆదాయం పెంచేలా నిర్మాణపు అనుమతులు ఇవ్వాలి.

-ఎన్.సృజన, సీపీఐ (ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి

ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- మున్సిపల్ ఆఫీసు ఎదుట ఆందోళన



నవతెలంగాణ-ఉప్పల్

ఇచ్చిన మాటలు మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం నైజం అని, ఎల్‌ఆర్ఎ స్‌పై రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పి ప్రజలను మోసం చేస్తున్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపుతో బుధవారం చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్, నాయకులు రాగిడి లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ పేరుతో రూ.20 వేల కోట్లు దండుకునేందుకు 25 లక్షల కుటుంబాలపై అధిక భారం మోపుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్‌ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలన్నారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు సాయిజన్ శేఖర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, గంధం జ్యోత్స్న, నాగేశ్వర్ రావు తదితరులున్నారు.

దోబీ ఘాట్ స్థలాన్ని తిరిగి రజకులకే అప్పజెప్పాలి



- డీసీ రాజుకు అఖిలపక్ష నాయకుల వినతి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్‌లో ఉన్న దోబీఘాట్ స్థలంలో పార్కును ఏర్పాటు చేయడంతో రజకులకు దోబీఘాట్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దోబీఘాట్ స్థలాన్ని తిరిగి రజకులకు అప్పగించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రజకుల కోసం నాటి ప్రభుత్వం 1985లో జ్యోతి నగర్‌లో దోబీఘాట్ నిర్మించి ఇచ్చిందని తెలిపారు. కొన్ని ఏండ్ల తర్వాత శిథిలావస్థకు చేరడంతో దానిని నూతనంగా నిర్మిస్తామని మాజీ కార్పొరేటర్ వాగ్దానం చేశారన్నారు. అనంతరం దాని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి పార్కుగా ఏర్పాటు చేశారని, ఇప్పుడు ఆ కాలనీవాసులు గేటుకు తాళం బిగించారని తెలిపారు. రజకులను రానివ్వకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పారు. దీనిపై తగు చర్యలు తీసుకుని రజకుల స్థలాన్ని వారికే అప్పగించాలని అధికారులను కోరినట్టు తెలిపారు. విచారణ జరిపి ఆ స్థలాన్ని రజకులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం కార్యదర్శి కాసర్ల నాగరాజు, సీపీఐ నాయకులు రొయ్యల కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాస్, టి. వెంకటేష్ యాదవ్, డీకే శ్రీను, టీడీపీ నాయకులు వగ్గు చంద్రశేఖరరావు, కరణం గోపి, బీజేపీ నాయకులు ప్రకాష్, బీఎస్పీ నాయకులు గౌతమ్ రాజ్, జి.రమేష్, బీసీ సంఘం నాయకులు కామల్ల ఐలన్న, బత్తిని నరసింహ గౌడ్, అప్పల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పి.ప్రవీణ్ కుమార్, పి.సత్యనారాయణ, ఆర్. యాదగిరి, కిరణ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ కార్పొరేషన్‌లో మల్లన్న యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, భాషవోని కొండల్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు బండకింది ప్రసాద్ గౌడ్, నరసింహ యాదవ్, మెట్టు వెంకన్న, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న దీవెనలతో జవహర్ నగర్‌ను అభివృద్ధి చేస్తా : వజ్రేష్ యాదవ్



మల్లన్న యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మల్లనకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మల్లన్న స్వామి ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరారు. జవహర్ నగర్ ను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, సదానంద్, రాజు యాదవ్, దయాకర్‌చారి, బొబ్బిలి మంజుల, యాదవ సంఘం సభ్యులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిన 20 స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. జిల్లా దరఖాస్తులను జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://medchal-malkajgiri.telangana.gov.in/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుని నింపి అవసరమైన కాపీలను జత చేసి రూ.200 (మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, జిల్లా వైద్య అండ్ ఆరోగ్య శాఖ అధికారికి పైరుపై) డీడీ తీసి డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఎఫ్1, ఐడీఓసీ, అంతాయిపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని తెలిపారు.



జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ ఎల్.తాజ్ మోహన్‌రెడ్డి బుధవారం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం పలు విసయాలపై చర్చించారు.

-నవతెలంగాణ - జవహర్‌నగర్

రైతు నేస్తంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సెక్రటేరియట్ నుంచి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ సొసైటీ చైర్మెన్ రామిడి మధుకర్ రెడ్డి, ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి, నాయకులు ఎంసీపల్లి మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, విష్ణు గౌడ్, యదగిరి, బాల్ నర్సింహ, వెంకటేశ్, నర్సింహులు, రవీందర్ రెడ్డి, జెర్రిపోతుల నర్సింహులు, నవీన్‌చారి తదితరులున్నారు.

నాణ్యతతో కూడిన టిఫిన్స్ అందించాలి: మంత్రి పొన్నం

నాణ్యతతో కూడిన టిఫిన్స్ అందజేయాలని పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలో తాజా ఆల్ డే రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డిలు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, తూంకుంట మున్సిపాలిటీ చైర్మెన్ కారంగుల రాజేశ్వరరావు, కౌన్సిలర్లు పూజ భరత్ సింగ్, ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మెన్ రాంచందర్ యాదవ్ తదితరులున్నారు.

మేడ్చల్ వాగులో యథేచ్ఛగా పరిశ్రమల వ్యర్థాలు

- పట్టింపులేని మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ జయదర్శిని వెంచర్ నుంచి ప్రవహిస్తున్న మేడ్చల్ వాగులో గుర్తు తెలియని అక్రమార్కులు పరిశ్రమల వ్యర్థ రసాయన జలాలను రాత్రి సమయాల్లో ట్యాంకర్ల ద్వారా వదులుతున్నారు. దీంతో వాగులోని నీరు పూర్తిగా కలుషితమై తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నీటిని పశువులు, ఇతర జంతువులు తాగితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతులు, ప్రజలు వాపోతున్నారు. కొన్ని నెలల నుంచి అక్రమార్కులు రాత్రి 12 దాటిన తర్వాత ట్యాంకర్ల ద్వారా రసాయన పారిశ్రామిక వ్యర్థ జలాలను వాగులో వదులుతున్నట్లుగా స్థానిక రైతులు తెలిపారు. రసాయన వ్యర్థ పదార్థాలు వాగులోని నీటిపై తేలుతూ తీవ్ర దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయనిక వ్యర్థ జలాలతో నీటిలోని చేపలు చనిపోతున్నట్లు పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. వ్యర్థ జలాల ద్వారా వాగుకు సమీపంలో ఉన్న భూగర్భ జలాలు కలుషితమై తమ పంటలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కీసరగుట్ట జాతరకు 300 ఆర్టీసీ బస్సులు



- ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 300 బస్సులను నడుపుతునట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కీసరగుట్టలో ఆర్టీసీ జాతర క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలోని సికింద్రాబాద్, అమ్మగూడ, వెంకటాపూర్ ఉప్పల్, ఘట్కేసర్ నుంచి భక్తుల సౌకర్యార్థం కీసరగుట్టకు బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖాన్, డిప్యూటీ ఆర్ఎంవో శ్రీనివాస్, డిప్యూటీ ఆర్ఎంవో సికింద్రాబాద్ భీమ్‌రెడ్డి, డిపో మేనేజర్లు శ్రీనివాస్, కవిత, రామ్మోహన్, భవభూతి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తాం

- టీఎస్ఐఐసీ వైస్ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి పారిశ్రామిక ఉత్పత్తులు ఎగుమతులు చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీఎస్ఐఐసీ వైస్ చైర్మెన్, ఎండీ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో ఐలా ఆధ్వర్యంలో అత్యాధునిక హంగులతో రూ.4కోట్లతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్కును టీఎస్ఐఐసీ సీఈవో మధుసుదన్, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుదర్, చర్లపల్లి ఐలా అధ్యక్షుడు జెక్క రోషిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చర్లపల్లి ఐలా రాష్ట్రంలోని ఇరత పారిశ్రామికవాడలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జీహెచ్ఎంసీ పార్కులకు ధీటుగా అన్ని హంగులతో అభివృద్ధి చేసిన ఐలా కమిటీ సభ్యులను అభినందించారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన జయశంకర్ పేరును పార్కుకు పెట్టండం సంతోషంగా ఉందన్నారు. చర్లపల్లి ఐలాను ఎఫ్‌టీసీసీ నేషనల్ అవార్డులకు నామినెట్ చేసి జాతీయ స్థాయిలో అవార్డు సాధిస్తామని ఆశాభావం చేశారు. పారిశ్రామికవాడలో డస్టుబిన్ ఫ్రీ, ప్రతి యూనిట్‌కు వెళ్లి చెత్త సేకరించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పూల మొక్కల పెంపకం, ఈఎస్ఐ ఆస్పత్రి, సీసీ కెమెరాల ఏర్పాటు, కాలుష్యరహిత పారిశ్రామికవాడగా గుర్తింపు పొంది ఇతర పారి శ్రామిక వాడలకు రోల్‌మోడల్‌గా చర్లపల్లి నిలుస్తుందన్నారు. చిన్నతరహ పారిశ్రామికవాడలను అభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఈ సమావేశంలో ప్రతిపాదించిన అంశాలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అనంతరం చర్లపల్లి ఐలా అధ్యక్షుడు రోషిరెడ్డి, టిఫ్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి పలువురు పారిశ్రామికవేత్తలు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ మాధవి, టీఎస్ఐసీ అధికారులు వినోద్ కుమార్, జ్యోతి, ఐలా కమిషనర్ తుల్చానాయక్, సీఐఏ అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, మాజీ చైర్మెన్ మనోహర్ రాజు, ఐలా కార్యదర్శి అంబటి వేంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు, పీఎస్ఎన్ ప్రసాద్, వెంకట్రాంరెడ్డి, హనుమాన్ ప్రసాద్ కమిటీ సభ్యులు పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట:

అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గోల్నాక డివిజన్ లోని వడ్డెర బస్తీలో రూ.15.30 లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్న డ్రయినేజీ పైప్‌లైన్ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ దూసరి శ్రీనివాస్ లావణ్య గౌడ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం అంబర్ పేట డివిజన్ లోని రఘునాథ్ నగర్‌లో రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లవంగు ఆంజనేయులు, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జాఫర్, రాజు, వాటర్ వర్క్స్ ఏఈ రోహిత్, ఎలక్ట్రికల్ ఏఈ సౌమ్య, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట:

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు. కాచిగూడ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం లక్ష్మీకాంత్ రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ నేతలు కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాజేశ్, బబ్లీ, ఆంథోనీ, తదితరులు పాల్గొన్నారు.

అరకొర కిట్లతో ఆగమాగం

- ముషీరాబాద్‌లో 'హెల్తీ బేబీ షో' పేరిట మోడీ కిట్ల పంపిణీ
- సరిపడా కిట్లు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగిన పలువురు తల్లులు
- ఫోటోలకే పరిమితమైన కిట్ల పంపిణీ







మోడీ కిట్ల పేరుతో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో 'హెల్తీ బేబీ షో' పేరిట బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమం చాలా మందికి నిరాశను మిగిల్చింది. అందరికీ సరిపడా కిట్లు లేకపోవడంతో తల్లిదండ్రులు వారి చిన్నారులతో కలిసి నిరాశగా వెనుదిరిగారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చిన్నారులకు మోడీ కిట్లు పంపిణీ చేస్తున్నామని బీజేపీ నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. దాంతో చాలా మంది మహిళలు వారి చిన్నారులతో ఎండను సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున కిట్ల కోసం పడిగాపులు కాస్తూ వేచి చూశారు. తీరా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్య క్రమానికి వచ్చాక ఆయన చేతుల మీదగా కొంత మందికి మాత్రమే మోడీ కిట్లను అందజేసి తర్వాత కిట్లు అయిపోయాయని తర్వాత రావాల్సిందిగా నాయకులు తెలిపారు. దాంతో గంటల తరబడి కిట్‌ల కోసం నిరీక్షించిన నిరాశే ఎదురవ్వడంతో మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సరిపడ కిట్లు లేనప్పుడు పబ్లిసిటీ కోసం ఇంత పెద్ద ఎత్తున కార్యక్ర మాలు ఎందుకు చేపట్టారని నాయకులను ప్రశ్నించారు. పట్టుమని పదిమందికైనా ఇవ్వకుండా ఇచ్చిన వారి వద్ద బీజేపీ నాయకులు ఫోటోలు దిగుతూ పబ్లిసిటీ పిచ్చిని మరోమారు చూపెట్టారని చిన్నారుల తల్లుల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండను సైతం లెక్కచేయకుండా తమ చిన్నారులను తీసుకొని వస్తే మోడీ కిట్లు ఇస్తామని ఆశ చూపి తీరా అవి ఇవ్వకపోగా తమ ఫోటోల పిచ్చి కోసం గంటల తరబడి వేచి చూసేలా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎంతో గొప్పగా తల్లులకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని తమ ప్రసంగంలో వివరించినా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే న్యూట్రిషన్ కిట్లు అందడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్తామని చెప్పడం ఎందుకు తీరా వచ్చాక లేవని చెప్పడం ఏంటని నాయకులను ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఏమైనా పౌష్టికాహార కిట్లు అందించాలనుకుంటే నేరుగా చిన్నారుల తల్లిదండ్రులకు అందించాలని.. కిందిస్థాయి నాయకులు గల్లీ లీడర్లకు పెత్తనం అందజేస్తే వారు కేవలం కొంతమందికి మాత్రమే ఇస్తూ మిగిలిన వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొందరు మహిళలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ చొరవ తీసుకొని చిన్నారులకు రావలసిన కిట్లను అందించకుండా కాలయాపన చేస్తున్న నాయకులను పక్కనపెట్టి నేరుగా చిన్నారుల తల్లులకు ఇంటింటికి మోడీ కిట్లు అందే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

కళా వారసత్వ సంపదను ముందు తరాలకు అందించాలి

- జస్టిస్ రామలింగేశ్వర రావు



నవతెలంగాణ-కల్చరల్

తెలుగు వారికే సొంతమైన హరి కథ ఆంధ్ర నాట్యం వంటి కళా వారసత్వాన్ని ముందు తరాలకు అందించాల్సిందని ఇందుకు ఆ కళల పరిరక్షణ అవసరమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వర రావు అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళా వాహిని నిర్వహణలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించిన హరికథా కళాకారిణి ఉమా మహేశ్వరికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన కళాకృష్ణలను అక్కినేని లలిత కళా పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వరరావు పాల్గొని ఇరువురికి పురస్కారం బహూకరించి మాట్లాడారు. హరికథ సకల కళల సమాహారం తెలుగు సంప్రదాయ కళను కేంద్రం గుర్తించి పద్మ అవార్డు ప్రకటించటం ఆనంద కరమ్ అన్నారు. తమిళ నాట కళాకారులకు గొప్ప గౌరవం ఉంటుందని వారి సంప్రదాయం తెలుగు వారు పాటించాలని కోరారు. కళా కృష్ణ ఆంధ్రనాట్యంలో ఎందరికో శిక్షణ ఇస్తున్నారని అభినందించారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడు తూ కళా కృష్ణ గురువు నటరాజ రామకష్ణ ఆశయానికి అనుగుణంగా ఆంధ్ర నాట్యంను ప్రచారంలో ఉంచుతున్నారని అభినందించారు. భార్య ఉమా మహేశ్వరికి ఆయన కు ప్రభుత్వాల గుర్తింపు దక్కటం విశేషమన్నారు. కళా పోషకుడు సారిపల్లి కొండల రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కళా రంగంకు వన్నె తెచ్చిన వారు ఉమా మహేశ్వరి కళా కృష్ణ అని పేర్కొన్నారు వేదిక పై రచయిత్రి డాక్టర్ కష్ణ కుమారి, హిప్నో పద్మా కమలాకర్ సినీ జర్నలిస్ట్ ఎస్.వీ. రామా రావు తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మి నారాయణ స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత ఉమా మహేశ్వరి కుప్తంగా రుక్మిణీ కళ్యాణం హరి కథ గానం చేశారు.

వైసీపీ ప్రభుత్వానికి చుట్టాలుగా అధికారులు

- ఐదు సంవత్సరాలుగా తమ ఇంటికి అడ్డంగా గోడ నిర్మించి నిర్బంధించారు
- దళితులమని కక్ష కట్టారు
- ఆదుకోండని కవాడిగూడ సీజీఓ టవర్స్ జాతీయ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు మహిళా టీచర్ ధర్నా



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు, న్యాయవ్యవస్థ వైసీపీ ప్రభుత్వానికి చుట్టాలుగా మారారని దళితులమని కక్షగట్టి ఐదు సంవత్సరాలుగా తమ ఇంటికి అడ్డుగా గోడను నిర్మించి నిర్బంధించారని కవాడిగూడ సీజీఓ టవర్స్ జాతీయ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు అద్దంకి మండలం గాజులపాలెం స్కూల్‌లో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నా సుధారాణి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బాపట్ల జిల్లా కొరిషిపాడు మండలం బొడ్డువాని పాలెం గ్రామంలో తమది దళిత కుటుంబమని తమకు ఇంటికి వెళ్లడానికి దారి లేకుండా గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మరో ఏడుగురు తమ ఇంటికి అడ్డంగా గత ఐదు సంవత్సరాల క్రితం గోడను నిర్మించి నిర్బంధించారని తెలిపారు. ఈ విషయమై ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు ఫిర్యాదు చేయగా గోడను కూల్చి వేశారన్నారు. ఆరు నెలల తర్వాత మరోమారు ఇంటికి అడ్డంగా గోడను నిర్మించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ విషయమై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ బైండోవర్ చేస్తామంటున్నారని ఏపీలో ఉంటే తనకు ప్రాణభయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులతో బంధువుల ఇంట్లో తలదాచుకుంటున్నానని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులను ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలి

- మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు తిమ్మన నవీన్‌రాజ్ మాదిగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర హైకోర్టులో గత సంవత్సర కాలంగా ప్రభుత్వ న్యాయవాదులుగా, సహాయ న్యాయవాదులుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ న్యాయ వాదులందరిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు తిమ్మన నవీన్ రాజ్ మాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైకోర్టులో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ న్యాయవాదులుగా పని చేయడానికి అవకాశం కల్పించలేదని, గత 9 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. మాదిగలను అడిషనల్ పీపీగా, అసిస్టెంట్ పీపీగా, జీపీగా, ఏజీపీలుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ములుగు కోటేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విష్ణు, మాదిగ యువసేన హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఆర్.యాంటీ కరప్షన్ ఫౌండేషన్, రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్ రావు బాధ్యతలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఒక ముఖ్యమైన పరిణా మంలో, హిందూ టైగర్ ఎన్. ఆర్. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న యాంటీ కరప్షన్ ఫౌండేషన్‌కు తెలం గాణ రాష్ట్ర అధ్యక్షుడిగా భజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ రావు నియమితులయ్యారు. యాంటీ కరప్షన్ ఫౌండేషన్ అనేది భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద నమోదిత సంస్థ. ఈ నియామకం దేశంలో అవినీతిని నిర్మూలించడం, పారదర్శకతను పెంపొందించడం కోసం శ్రీ లక్ష్మణ్ రావు యొక్క తిరుగులేని నిబద్ధతను ప్రతి బింబిస్తుంది.

చట్ట సభలలో మహిళల ప్రాధాన్యత పెరగాలి



నవతెలంగాణ-కల్చరల్

చట్ట సభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలని రాష్ట్ర శాసన సభ తొలి సభా పతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కె.లలిత, ఎస్.శ్రీమణి, టీ. శోభా రాణి ల సత్కార సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని సత్కార అనంతరం మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభ కనపరుస్తున్నరన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాన సభ పాలక మండలి సభ్యులు భమిడి ఉష పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విద్యుత్ వినియోగదారుల చైర్ పర్సన్. బి.లలిత, ఫైనాన్స్ మెంబర్ కే.శోబారాణి అన్నారు. బుధవారం బాగ్ అంబర్‌పేట డియర్ పరిధిలోని బతుకమ్మకుంట ఎలక్ట్రిసిటీ ఏడి కార్యాలయంలో ఏడి శ్రీనయ్య ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ప్రజలకు అధికారులకు సమస్యలు ఏమైనా ఉన్నాయని స్థానిక ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు.

అధికారులు మాట్లా డుతూ నిరంతరం ప్రజల అవసరాల కోసం పనిచేస్తు న్నామని ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారులను కలవచ్చని కోరారు. ఈ కార్యక్ర మంలో విద్యుత్ అధికారులు మెంబర్స్ ఇండిపెండెంట్ మెంబర్ వి. అనీల్‌రెడ్డి, డిఈ అజామాబాద్, వెంకట్ రావు, ఏఈ ప్రసా దు, ఏఈ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి



- విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ
- తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులు పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారికి డిక్షనరీలను పంపిణీ చేశారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలని సూచించారు. అలాగే రాబోయే 10 తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్త, కార్యదర్శి విజయ్, జిల్లా కార్యదర్శి మల్లేష్, జెనరల్ సెక్రటరీ, రవి, కందుకూరు మండల ప్రెసిడెంట్ భరత్, గ్రామస్తులు చిందం శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు ఏండి. అయూబ్, రోనాలిని తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయాలి

- సీఐటీయు సౌత్ జిల్లా నాయకులు కోటయ్య



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ ఉత్తర్వు నెంబర్ 57/2017, డీ.పీ.హెచ్, ఎఫ్.డబ్లుటీ.వీ.వీ ప్రకారం గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్ల వలన నిలిపిన 893 అర్హతగల స్టాఫ్ నర్సులను వెంటనే ఇవ్వాలని సీఐటీయు సౌత్ జిల్లా నాయకులు ఎల్. కోటయ్య డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో నిలిపివేసిన నర్సింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సచివాలయం రాష్ట్ర ముఖ్యమంత్రి చాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిటీ కార్యాలయంలో ఆయన నర్సులనుద్దేసించి మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఎండ్ ఫ్యామిలి వెల్ఫేర్ ఎండ్ టీ.వీ.వీ, వారు 2017 నవంబర్ 8న నోటిఫికేషన్ నెం: 57/2017 ప్రకారం స్టాఫ్ నర్సు పోస్టులు 3311 ఉన్నాయని నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. కాని అందులో 2840 అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చి, బడ్జెట్ లేదనే కారణంతో 893పోస్టులు నిలిపివేయడం సరికాదన్నారు. అర్హతలు గల వారికి పోస్టింగులను ఇవ్వాలని గతంలో టీ.ఎస్. పీ. ఎస్.సీ చైర్మెన్‌కి, ఆరోగ్యశాఖ మంత్రికి వినతి పత్రాలు అందజేశారన్నారు. ఇప్పటికి 5 సంవత్సరాలు గడుస్తున్న వీరికి పోస్టింగు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైన నిలిపిన 893 స్టాఫ్ నర్సు పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు జంగయ్య, సైదులు, ఎన్. శ్రీరాములు, జి. ప్రియదర్శిని, జ్యోతి, మౌళిక, శోభ రాణి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైల్ శంకుస్థాపన పనులను పర్యవేక్షించిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-ధూల్ పేట్

హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 8న శంకుస్థాపన చేయను న్న నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.వెంకటేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల బృం దం ఫలక్‌నుమా ఫారూఖ్ నగర్ బస్టాం డ్ వద్ద శంకుస్థాపన కోసం జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా పాతబస్తీలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలకడానికి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం అవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో మెట్రో పనులను 2017 లోనే ప్రారంభించినా మజ్లీస్ పార్టీ అభ్యంతరాలతో ముందుకు సాగలేద న్నారు. కాంట్రాక్టు పనులు చేపట్టిన ఎల్ అండ్ టీ సంస్థ చేతులు యెత్తేయడంతో ఎంజీబీస్ వద్దనే మెట్రో పనులు ఆగిపోయాయని తెలిపారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో పాతబస్తీలో మెట్రో రైలు పను లను వేగంగా పూర్తి చేయడానికి అధికా రులు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. పాతబస్తీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి పాతబస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నగర అధ్యక్షుడు మొహ్మద్ మూసా ఖాసీం, నాయకులు మనోజ్, అనిల్, శ్యామ్ రావు ముదిరాజ్, ఫెరోజ్, ఘనీ, జాహెద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు జనాభా ప్రకారం సబ్ కోటా కల్పించాలి



రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పార్లమెంట్‌లో పాసైన మహిళ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని అప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు.బీసీ మహిళ ఐక్య వేదిక అధ్యక్షురాలు కొంగ కరుణశ్రీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ మహిళా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మహిళ బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్య సభ, లోక్ సభలో ఆమోదం పొందిందని, మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళలు వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని కోరారు.రాజకీయ రిజర్వేషన్లను పెడితే 180 మంది మహిళలు పార్లమెంటులో సభ్యులు అవుతారన్నారు.ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెడితే కేంద్ర ప్రభుత్వంలోని 54 లక్షల ఉద్యోగాలలో 27 లక్షల ఉద్యోగాలు, 29 రాష్ట్రాలలో కలిపి ఒక కోటి 80 లక్షల ఉద్యోగాలలో 90 లక్షల ఉద్యోగాలు మహిళలకు దక్కుతాయన్నారు. మహిళలకు రక్షణ కోసం ఇప్పటికీ అనేక చట్టాలు ముఖ్యంగా వరకట్న నిషేధ చట్టం, అత్యాచార, నిరోధక చట్టం, నిర్భయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, దిశా చట్టం లాంటి 19 చట్టాలు వచ్చినప్పటికీ వారిపై అత్యాచారాలు తగ్గలేదన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, హత్యలకు సినిమా రంగం దోహదపడుతుందని, సినిమాలలో అసభ్యకర అంశాలు ముఖ్యంగా నగ్న, అర్ధనగ్న, సెక్స్ దృశ్యాలు పూర్తిగా నిషేధించాలని కోరారు. అట్టడుగు స్థాయి ప్రేక్షకులకు ముఖ్యంగా యువత సినిమా ప్రభావంతో ఒంటరి మహిళల పై అత్యాచారాలకు పాల్పడే స్థాయికి దృశ్యాలు ఉసిగొల్పుతున్నాయని, నేటి తరం సినిమాలు, నగ్న, అర్ధ నగ్న దృశ్యా లు యువతను చెడు దారి పట్టిస్తుందని, సమాజాన్ని ఈ అసభ్య సినిమాలే భ్రష్టు పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఈ సదస్సులో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్య సభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, టిజెఎస్ అధ్యక్షులు ప్రో.కె. కోదండరాం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, డి.ఎస్.పి అధ్యక్షులు విశారదన్, కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, శారదా దేవి, ఉదయ్, లావణ్య, కళ్యాణి, అరుణోదయ సాగర్, కోట్ల శ్రీనివాస్, జయంతి గౌడ్, దీపికా, రామలింగం, నందగోపాల్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత 3 దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్ లో చట్టబద్ధత కోసం ఏఐసీసీ, రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ, జాతీయ అధ్యక్షులు వేముల బలరాం మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్ను కనకరాజు మాదిగ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం దళితులకు రూ.12 లక్షలు డా.బి.ఆర్.అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని, వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగ లకు రెండు సీట్లు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ క్యాబినెట్ లో మాదిగ, మాదిగ ఉప కులాలకు 4 మంత్రి పదవులు కేటాయించాలని, అలాగే మాదిగల జనాభా దామాషా ప్రకారం నామినేటేడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొట్టే పద్మయ్య, సిలివేరు సాంబయ్య, కందుల సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా నేడు క్రైస్తవుల ప్రార్థన సమావేశం

- అఖిల భారత క్రిస్టియన్ ఐకాస అధ్యక్షులు ఎం.సాల్మన్ రాజు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రభుత్వ సుభిక్ష పాలన, శాంతి, సామరస్యం కోసం కుల మతాలకు అతీతంగా నేడు గురువారం ఎల్బీ స్టేడియంలో అఖిల భారత క్రిస్టియన్ ఐకాస ఆధ్వర్యంలో క్రైస్తవుల ప్రార్థనా సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఐకాస అధ్యక్షులు ఎం.సాల్మన్ రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎం.సాల్మన్ రాజు మాట్లాడుతూ ఈ ప్రార్థనా సమావేశంలో పంజాబ్ రాష్ట్రం నుంచి ప్రముఖ క్రైస్తవ ప్రవక్త భజందర్ సింగ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని, అలాగే దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రార్థనలు సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతాయని, జంట నగరాల నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, అలాగే భక్తులకు ఉచితంగా భోజనం, మంచినీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐకాస నాయకులు, బిషప్, పాస్టర్లు ఎలీషా, జస్పాల్ సింగ్, ఆనంద్, లియో, ఇజ్రాయిల్, రేనాల్డ్ మెదర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ మహంకాళి ఏసీపీగా సర్దార్ సింగ్



నవతెలంగాణ-బేగంపేట్
మహంకాళి డివిజన్ ఏసీపీగా సర్దార్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నిజామాబాద్, నల్లగొండతో పాటు హైదరాబాద్ సీఐడీ డీఎస్పీగా ఆయన విధులు నిర్వహించారు. తాజాగా బదిలీపై మహంకాళి డివిజన్ ఏసీపీగా వచ్చారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన రవీందర్ యాదవ్ పోలీస్ అకాడమీకి బదిలీపై వెళ్ళారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని కొత్తగా ఛార్జ్ తీసుకున్న సర్దార్ సింగ్ పేర్కొన్నారు.

రవీంద్ర భారతిలో మహిళా సంబురాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో
అక్షరయాన్ తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్, సీతా చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఐనంపూడి శ్రీలక్ష్మి నిర్వహణలో మహిళా సంబురాలు రవీంద్ర భారతి పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ మహిళామణులు, హైమావతి భీమన్న, డా. ఆలూరి విజయలక్ష్మి, డా. బండా సరోజన, లక్కరాజు నిర్మల, రాణి నల్లమోతు పాల్గొన్న ఈ కార్యక్ర మంలో రంగరాజు రంగారావు రచించి, రాయారావు విశ్వేశ్వర్ రావు స్వరకల్పన చేసిన 'భారతీయ వనిత' ఆడియో ఆవిష్కరణ వైభవంగా జరిగింది. ఈ పాటకు సంగీతం సత్యదీప్ శర్మ సమకూర్చగా అమరవాది శ్రీవాత్సవ గానం చేశారు. ఆసాంతం మహిళ గొప్పతనాన్ని చాటిన ఈ పాట విని పాల్గొన్న మహిళలంతా సంతోషం వ్యక్తం చేశారు.

ఓయూలో స్విమింగ్ పూల్ ప్రారంభం ఎన్నడు ?

- పూల్ ఫ్లోర్ మరమ్మతులు ఎప్పుడు ?
- ప్రారంభించాలని కోరుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఉద్యోగులు



నవతెలంగాణ-ఓయూ
ఒక వైపు రాష్ట్రంలో, ఇటు నగరంలో ఇప్పటికే ఎండల ప్రభావం పెరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఎండలు పెరుగుతున్న క్రమంలో ఉస్మానియా విశ్వవిద్యా లయంలో ఉన్న స్విమింగ్ పూల్ (ఈత కోలను)ను ఈ నెలలోనే ప్రారంభించాల్సి ఉంది. అయితే ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఇప్పటి వరకు ఒక స్పష్టమైన తేదీని ఖరారు చేయకపోవడం గమనార్హం

విద్యార్థులకు ఉపయోగపడే వాటికి ఖర్చు చేయరా..?



విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఏది ఉపయోగకరమో ఏది అవసరమో వాటికి ఖర్చు చేయకుండా అనవసరమైన వాటికి ఓయూ వీసీ, ఖర్చు చేస్తారు. ఇలా ఇష్టారాజ్యంగా పరి పాలి స్తున్నారు. ఓయూ అధికారుల నిర్లక్ష్యంతో నేటికి స్విమింగ్ పూల్ ఓపెన్ కాలేదు. స్విమింగ్ పూల్ తో ప్రొఫెసర్స్, విద్యార్థులు, ఉద్యోగులు వేసవికాలం లో సేద తిరడానికి ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది. ఓయూ స్విమ్మింగ్ పూల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రారంభించాలి.
- పీహెచ్డీ విద్యార్థి గడ్డం శ్రీరాం

ఫ్లోర్ మరమ్మతులు ఎప్పుడు

ఓయూ స్విమింగ్ పూల్‌లో ఫ్లోర్ టైల్స్ క్రాక్ కావడంతో పలుచోట్ల వాటర్ లీక్ అవుతోంది. దీనితో మరమ్మతులు పనులు చేపట్టాల్సి ఉంది. అయినా నేటి వరకు ఆ మరమ్మతులపై అధికారులు దృష్టి సారించలేదు. ప్రస్తుతం ఎండల ప్రభావం తీవ్రంగా పెరుగుతుండడంతో ఇప్పటికైన ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారులు స్పందించి తక్షణమే ఫ్లోర్ మరమ్మతులతో పాటుగా టైల్స్, గ్రౌటింగ్, యాసిడ్ వాష్ క్లినింగ్ లాంటి మరమ్మతుల పనులు సాధ్యమైనంత త్వరలో చేపట్టి పూర్తి చేసి స్విమింగ్ పూల్‌ను జాప్యం చేయకుండా వెంటనే ప్రారంభించడానికి చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, ప్రొఫెసర్స్, ఉద్యోగులు కోరుతున్నారు. స్విమ్మింగ్ పూల్ కొంత మేరకు విద్యార్థులు, ప్రొఫెసర్స్, ఉద్యోగులు సేద తీరేందుకు అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ పూల్ ఉదయం 4 షెషన్స్, సాయంత్రం 3 సెషన్స్ జరిగేవి.. దీని ద్వారా సుమారు 600 నుంచి 800 మంది వరకు ఇక్కడ గతంలో స్విమింగ్ చేశారు.

ఏప్రిల్ మెదటి వారంలో ప్రారంభానికి చర్యలు



ఇటీవలే మరమ్మతు పనులకు ఓయూ బిల్డింగ్ డివిజన్ నుంచి అనుమతి వచ్చింది. వెంటనే మరమ్మతుల పనులు చేపట్టి, వీసీ అనుమతితో ఏప్రిల్ మెదటి వారంలో ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.
- ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్

'ఉన్నత విద్యలో నాణ్యత అవసరం'



నవతెలంగాణ-ఓయూ
ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు నిరంతర, సమగ్ర మూల్యాంకనం అవసరమని ఓయూ ఓఎస్డీ ప్రొ. బి. రెడ్యానాయక్ అన్నారు. ఓయూలోని వాణిజ్య విభాగం ఏర్పాటు చేసిన డిపార్ట్ మెంట్ వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రవేశపెట్టిన సీసీఈ గురించి వివరించారు. ఇందుకు సబంధించి విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహా లను నివృత్తి చేశారు. సీసీఈ అమలు, పర్యవేక్షణ కోసం ఓయూలో ఉన్న యంత్రాంగం పట్ల అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ. బి. శ్రీనగేష్ అవగాహన కల్పించారు. కామర్స్ హెడ్ డి. చెన్నప్ప మాట్లాడుతూ కామర్స్ లో ఎంకాం కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంకాం బిజినెస్ అనలిటిక్స్ రెండు కొత్త పీజీ కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. మరో కొత్త యూజీ కోర్సు బీకాం బిజినెస్ స్టడీస్ అందుబాటులోకి రానుందని తెలిపారు. యూనివర్సిటీ ఆమోదంతో 521 మంది పీజీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ పొడిగిం చేందుకు పలు వాణిజ్య సంస్థలు అంగీకరించాయని తెలిపారు. కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. ఎం గంగాధర్ మాట్లాడుతూ. కొత్త కోర్సుల ప్రవేశం, ఉన్నత విద్యారంగంలో అభి వృద్ధి చెందుతున్న తీరు గురించి వివరించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఇన్ కామర్స్ చైర్మెన్ ప్రొ. కె. కృష్ణ చైతన్య మాట్లాడుతూ. 2021, 2022, 2023 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఎం.కావమ్ ఫలితాల విశ్లేషణను సమర్పించారు. ప్రొ. వి. అప్పారావు మాట్లాడుతూ వాణిజ్య విద్యలో ట్రెండ్‌లు, వాణిజ్య విభాగం బలాలు, విశ్వవిద్యాలయ విద్యా కార్యకలాపాలలో వారి పాత్రను హైలైట్ చేయడంతో పాటు దాని సవాళ్లను చర్చించారు. కాన్ఫరెన్స్ కన్వీనర్ ప్రొ. సివి రంజని స్వాగతోపన్యాసం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సెమినార్‌లో వాణిజ్య విభాగంప్రొ. ఐ.శేఖర్, ప్రొ. జె.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఇంటరాక్టివ్ సెషన్ లో పాల్గొన్నారు.

పసుపు నీళ్లతో 'జీహెచ్ఎంసీ'ని శుభ్రం చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బుధవారం ఉదయం జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయం వద్ద నిరసనకు దిగారు. అయితే ఇందుకు కాంగ్రెస్ నేతలు కౌంటర్ నిరసన నిర్వహించారు. జీహెచ్ఎంసీ మురికిపట్టిందని కాంగ్రెస్ కార్పొరేటర్లు విమర్శిస్తూ పసుపు నీళ్లతో జీహెచ్ఎంసీని శుభ్రం చేశారు. కార్పొరేటర్ విజయ రెడ్డి,మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫాసిఉద్దీన్,కాంగ్రెస్ జి.హెచ్.ఎం.సి ఫ్లోర్ లీడర్ రాజశేఖర రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, రెహ్మాత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్ రెడ్డిలు మాట్లాడుతూ 2015 లో లక్షన్నర ఎల్ఆర్ఎస్ దరఖాస్తులుంటే 2020 నాటికి 25లక్షలు అయ్యాయని తెలిపారు. అయినా వాటిని పరిష్కరించకుండా పెండింగులో పెట్టి ఈరోజు ప్రజలను తప్పుదోవ పాటించేవిధంగా ధర్నాలు చేయడం దయ్యాలు నీతులు వల్లించినట్టు ఉందని అన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, పెద్దఎత్తున డబ్బులను వసూళ్ల చేసిందని ఆరోపించారు. డబ్బులను దోచుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలను జీరో చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ చేయలేని పని కాంగ్రెస్ చేసి చూపిస్తోందని తెలిపారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- మైత్రివనం చౌరస్తాలో భారీ ధర్నా



నవతెలంగాణ-జూబ్లీహిల్స్
కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం అమీర్‌పేటలోని మైత్రివనం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద కుటుంబాలను ఇబ్బందులు పెట్టొద్దనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఎల్ఆర్ఎస్ జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో పాటు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని మరిచి ఎల్ఆర్ఎస్ పేరుతో 25 లక్షల కుటుంబాలపై ఆర్థికభారం మోపి రూ. 20 వేల కోట్ల వరకు దోపిడీ చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. నాడు ఎల్ఆర్ఎస్ పై మాట్లాడిన నేటి మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని, అప్పటి వరకు ప్రభుత్వం పై ఆందోళన కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం హెచ్ఎండీఏ కార్యాలయంలో బీఆర్ఎస్ సికింద్రా బాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్‌లు నామన శేషుకుమారి, ఆకుల రూప, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విజయ డైరీలో ఉచిత ఐ క్యాంప్

నవతెలంగాణ-ఓయూ
విజయ డైరీ ఉద్యోగులు, కార్మికులకు గురువారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు లాలాపేట్ విజయ డైరీ ఆవరణలో ఉచిత ఐ చెకప్ నిర్వహించనున్నట్టు అధికారులు ఒక ప్రకటన లో పేర్కొన్నారు.



నిర్మాణాలను తొలగించవద్దని ఎమ్మెల్యే నిరసన

నవతెలంగాణ - జూబ్లీహిల్స్
బోరబండ డివిజన్‌లో నిర్మాణాలను తొలగించవద్దని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నిరసన తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆఫీసులో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆయన కలిసి పేదల షాపుల తొలగింపును ఆపాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం జీహెచ్ఎంసి ఆఫీస్ ముందు యూసుఫ్ గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగల్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదేప్యరావు విజయ్, డివిజన్ అధ్యక్షులు ప్రదీప్, సంజీవ్, విజయ్‌కుమార్, కో ఆర్డినేటర్ విజయ్ సింహారెడ్డి, జావీద్, స్థానిక సీనియర్ నాయకుడు విజయకుమార్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ధర్నా నిర్వహించారు.



మోండా మార్కెట్ డివిజన్ లో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. మంగళవారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులతో కలిసి మోండా మార్కెట్, 31బస్టాప్, రెజిమెంటల్ బజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పలు సమస్యలను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తెచ్చారు. కమిషనర్ వెంటనే స్పందించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని కమిషనర్ సూచించారు. నవతెలంగాణ-బేగంపేట

సంగీతంతో మానసిక ఉల్లాసం

- ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్



నవతెలంగాణ-బంజారా హిల్స్
మానసిక ఉల్లాసానికి సంగీతం ఎంతగానో దోహదం చేస్తుందని ప్రముఖ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా రాజారం గ్రామానికి చెందిన యువ రచయిత్రి గాయత్రి దేవరకొండ రచించిన ఓం నమో నమశివాయ పాటను ఆయన సోమాజిగూడలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీవ్ర మానసిక ఒత్తిడితో సతమత మవుతున్న వారికి అద్భుతమైన పాటలు ఎంతో హాయినిస్తా యని అన్నారు.అత్యద్భుతంగా గాయత్రీ రచించిన పాటకు కార్తీక్ మరింత అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చారని అన్నారు. తొలిసారి దేవదేవుడైన మహాశివుడిపై రచించిన పాట యావత్ శివ భక్తులను అలరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో గాయత్రి అద్భుతంగా రాణించాలని ఆకాంక్షించారు. మహాశివుడి పై ఉన్న భక్తితో పాటను రచించినట్టు రచయిత్రి గాయత్రి తెలిపారు. పాటకు అనుగుణంగా దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలలో పాటను షూట్ చేసినట్టు ఆమె తెలిపారు.



ప్రొఫెసర్ సతీష్‌కు సత్కారం

నవతెలంగాణ-ఓయూ
ట్రిబుల్ ఐటీ బాసరలో సమస్యలపైన పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్న సమయంలో అప్పటి ప్రభుత్వానికి కూడా అంతుచిక్కని సమస్యగా మారిన సమయంలో ట్రిబుల్ ఐటీ బాసర డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి తనదైన శైలిలో యూనివర్సిటీలో ఉన్న సమస్యలన్నింటిని పూర్తిగా పరిష్కరించి యూనివర్సిటీ వ్యవస్థని, యూనివర్సిటీ విద్యార్థులందరినీ ఒక తాటి పైన నడిపించి తనదైన కషి చేసిన ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్‌ను బుధవారం సత్కారించారు. తన పదవీ బాధ్యతలను విజయవంతంగా నెరవేర్చి తిరిగి డిపార్ట్మెంట్‌కు వచ్చిన సందర్భంగా గురువారం ఘనంగా ఇంజనీరింగ్ కాలేజ్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థిని విద్యార్థులు వారిని సత్కరించి స్వాగతం పలికారు.

నూతన చట్టాలపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-బంజారా హిల్స్
జాతీయస్థాయి నూతన చట్టాల అవగాహన సదస్సుపై చర్చ గోష్టి నిర్వహించడం ఎంతో ఆవశ్యకత అని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఏ నరసింహారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ తాజ్ దక్కన్ హెూటల్లో బుధవారం భారతీయ నూతన చట్టాలపై జరిగిన జాతీయ స్థాయి అవగాహన సదస్సుకు ప్రముఖ హైకోర్టు న్యాయవాది, తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు,లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర సభ్యులు, ఇతర వక్తలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఏ నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ స్టాండింగ్ కౌన్సిల్ ఇన్ సుప్రీంకోర్టు న్యాయవాది రామచంద్ర రావు ,ప్రస్తుత న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవేందర్, మాజీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్,ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కమర్షియల్ బోరు బావులకే అదనపు చార్జీలు..!

నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అమలు చేసేందుకు రక్షణ శాఖ రూపొందించిన బోర్వెల్స్ నియంత్రణ నిర్వహణపై బోర్డు సవరణ చేయనున్నట్టు సమాచారం. ఇండ్లల్లో బోర్లకు మీటర్లు బిగించవద్దని దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత కూడా బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేసిన సంగతి తెలిసిందే. అలాగే బోర్ వెల్స్ నియంత్రణ కోసం విధానాల డ్రాఫ్ట్‌కు సంబంధించి 56 అభ్యంతరాలు కూడా రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన బోర్డు వెరీడ్ సమావేశంలో నామినేటెడ్ సభ్యుడు రామకష్ణ కూడా ప్రస్తావించి కమర్షియల్ బోర్లకు కమర్షియల్ కాంప్లెక్స్‌లకు మాత్రమే మీటర్లు బిగించి అదనపు చార్జీలు వసూలు చేస్తే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. దీంతో కమర్షియల్ బోర్లకే మీటర్లు బిగించి అదనపు చార్జీలు వసూలు చేయాలని తీర్మానించారు.

నేడు సీఎం ఇంటికి గురుకుల అభ్యర్థులు

నవతెలంగాణ-ఓయూ
గురుకుల నియామకాల్లో రీలింక్విష్మెంట్ ఆప్షన్ ఇవ్వాలని కోరుతూ 9210 ఉద్యోగాలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసేందుకు 9210 మంది గురుకుల అభ్యర్థులు గురువారం సీఎం ఇంటికి వెళుతున్నట్టు కంభంపాటి సత్యనారాయణ ప్రజాపతి ఒక ప్రకటన లో చెప్పారు. విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం ఇంటికి తరలి రావలని కోరారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు వసూలు చేయడానికి నిరసనగా ఆల్వాల్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నందికంటి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి.. ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా చేయాలని.. చేసే వరకు వదిలి పెట్టమని.. బీఆర్ఎస్ తరపున పోరాడుతాం అని అన్నారు. కార్పొరేటర్లు, శాంతి శ్రీనివాస్ రెడ్డి,సబిత అనిల్ కిషోర్ మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.
నవతెలంగాణ-అల్వాల్



ప్రొ.అర్జున్ రావుకు సన్మానం

నవతెలంగాణ-ఓయూ
ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవలే నియామకం అయిన హిస్టరీ డిపార్ట్మెంట్ సీనియర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడిని టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుర్గం భాస్కర్, అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చిక్కుడు వెంకట్, అంసా రాష్ట్ర నాయకులు రాహుల్, విద్యార్థి నాయకులు వెంకన్న,రాకేష్, వినోద్,మల్లేష్‌లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓయూలో తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ ఆవిర్భావం



నవతెలంగాణ-ఓయూ
ఓయూ వేదికగా రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా లా మాజీ డీన్ ప్రొ. గాలి వినోద్ కుమార్, తెలంగాణ ఉద్యమకారులు రాజారాం యాదవ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ కార్యక్రమన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో విద్యార్థులు ఎన్నో త్యాగాలు చేసినప్పటికి విద్యార్థులకు తగినంత రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. దళిత,గిరిజన,బలహీన వర్గాల అభ్యున్నతికి సామాజిక తెలంగాణే దెయ్యం గా విద్యార్థి సంఘాలు పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నీళ్ళు,నిధులు,నియామకాల పేరిట తెలంగాణ సమాజానికి ద్రోహం చేసిందని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాలు కొనసాగిస్తే టీఎస్‌పీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందన్నారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా టీఎస్పీ మార్గదర్శకం చేస్తుందన్నారు. భవిష్యత్ కార్యచరణను త్వరలో ప్రకటిస్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు ఓరుగుంటి వెంకటేశ్వర్లు, విద్యార్థి జేఏసీ నాయకులు. నల్లగొండ అంజి, పాల్వాయి నగేష్, ఆజాద్, చిరంజీవి, ఎస్ఎం శ్రీకాంత్, వలిగొండ నరసింహ,పల్లపు చందు,శివ,నక్క పద్మలత, ఏఐఎస్ఎఫ్ ఉదయ్ కుమార్,అంస నామ సైదులు, ఎంఎస్ఎఫ్ శ్రీకాంత్, ఎస్ఎస్‌యూఐ వికాస్, సలీం, టీఎస్‌పీ నాయకులు వడ్డె గణేష్,వెంపటి సురేష్, వడ్డేపల్లి సందీప్,నూకల మధు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ అమలుకు ప్రొఫెసర్ల చలో వీసీ విజయవంతం



నవతెలంగాణ-ఓయూ
నిత్య జీవితంలో యోగా అవశ్యకతపై ఎంఎల్ఆర్ఐటీ కాలేజీలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ్య స్వామి ఆదిత్యదేవ్ పతాంజలి యోగా పీట్ హరిద్వార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యావంతులు కావడంతోపాటు ఆరోగ్యవంతులుగా కావడం అంత కంటే ముఖ్యం అన్నారు. మన జీవితాన్ని రోగ రహితంగా, శక్తివంతంగా చేసుకుంటేనే మన జీవితంలో ఏ పనైనా చేయగలం అన్నారు. ఉదయం 6 గంటలలోపు లేవాలనీ, ఉదయం లేవడం, యోగా చేయడంతో మన దినచర్య మొదలు పెట్టాలన్నారు. ఉన్నతమైన వ్యక్తులందరూ ఉదయం లేవడం యోగా సాధన చేయడంతోనే తమ దిన చర్య మొదలు పెడుతారని చెప్పారు. యోగా వల్ల అత్యధిక లాభాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య వంతులు, శక్తివంతులుగా కావడానికి ఏం చేయాలో ప్రదర్శించి చూపించారు. యోగాసనాలు, దండ, బైట్టక్ లు, సూర్య నమస్కారాలు చేశారు. పతాంజలి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నందనం కపాకర్ మాట్లాడుతూ అన్నీ ఉన్నా ఆరోగ్యం లేకపోతే జీవితం నిండు సున్న అన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే దేన్నైనా సాధించగలం, అనుభవించగలం అనీ, అది యోగా ద్వారానే పొందగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల అధినేత లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ రాధికా దేవి, ఇంటర్నేషనల్ యోగా టీచర్ వీరేందర్‌సింగ్, యువ భారత్ సహ రాజ్య ప్రభారి అశోక్, ఆర్య, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం : స్వామి ఆదిత్య దేవ్

- రవీంద్రభారతిలో సెయింట్ మార్టిన్ కళాశాల ఆధ్వర్యంలో ఆరోగ్యమే మహా భాగ్యం కార్యక్రమం



నవతెలంగాణ-దుండిగల్

ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యాన్ని సాధించుకోవచ్చని యూత్ ఐకాన్ వ్యాకరణాచార్య స్వామి ఆదిత్య దేవ్ తెలిపారు. బుధవారం సెయింట్ మార్టిన్ కళాశాల ఆధ్వర్యంలో ఆరోగ్యం ఈజ్ వెల్త్ అనే పేరుతో రవీంద్ర భారతి ఠాగూర్ ఆడిటోరియంలోలైవ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి ఆదిత్య దేవ్ విచ్చేసి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగా ద్వారా ధ్యానం పెంపొందించుకోవచ్చునని తెలిపారు. తనను తాను ఏకాగ్రతతో ఉంచుకోవచ్చని యోగాసనాల ప్రదర్శన ద్వారా విద్యార్థులతో ఆయన కొన్ని సూచనలు చేశారు. శారీరక వ్యాయామాల ద్వారా ఆరోగ్యకరమైన జీవితాలను కొనసాగించవచ్చని, ప్రతిరోజు యోగా ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రతను, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. ముఖ్యంగా యువత ఉదయాన్నే లేవడం లేసిన వెంటనే వ్యాయామం చేయడం వల్ల ఆ రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యోగాలో పాల్గొన్న విద్యార్థులను యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కొన్నియోగా ఆసనాలను వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జి.చంద్రశేఖర్ యాదవ్ ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్ డా.పి. సంతోష్ కుమార్ విద్యార్థులు తదితరులు విద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పేరుతో ప్రజలను దోచుకోవడమేనా ప్రజా పాలన..?



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఇండ్ల క్రమబద్ధీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ఎండగడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు మాట్లాడుతూ... గతంలో బీఆర్ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తా మన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది. అప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు తెరవడం లేదు అని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు దోపిడీ చేస్తున్నారో చెప్పాలి. అప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన రేవంత్, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం వహించారో ప్రజలకు చెప్పాలి. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మంది పైన కనీసం లక్ష రూపాయల భారం పడనున్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఉచితంగా భూ క్రమబద్ధీకరణ చేయాలని నాడు అరిచి గీపెట్టిన కాంగ్రెస్ నాయకులు, నేడు అధికారంలోకి రాగానే మార్చి 31 తేదీ లోపు రుసుమును చెల్లించి భూ క్రమబద్ధీకరణ చేసుకోవా లని ఫోన్ ద్వారా దరఖాస్తుదారులకు సమాచారం అందించడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. 100 రోజులు పూర్తికావడానికి ఇంకా 7 రోజులు మాత్రమే మిగిలి ఉందని... ఈ వందరోజుల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని, కష్టాలు అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటేనే కష్టాలు అనే విధంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. 100 రోజులు పూర్తయిన తెల్లారి నుంచే ప్రజల పక్షాన పోరాడుతూ ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ సత్తాచాటుతాం మన్నారు. అనంతరం భూ క్రమబద్ధీకరణకు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా చేపట్టాలని కోరుతూ కుత్బుల్లాపూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్లు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మెన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల పాలిట శాపంగా మారుతోంది

బాలానగర్: కూకట్‌పల్లి జోన్ బృందం గత ఎన్నికలలో బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామిలను ఒక్కొక్కటి అమలు పరచకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికాంలోకి వస్తే ఎల్.ఆర్.ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తానని చెప్పి, ప్రజలను మభ్య పెట్టిందని కానీ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే ఆదాయ మార్గాలపై దృష్టిపెట్టి ప్రజల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ క్రమంలోనే అధికారంలోకి రాకముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం నెలరోజుల వ్యవధిలోనే ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించాలంటూ గడువు విధిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించడాన్ని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఎల్ ఆర్ఎస్‌ను ఉచితంగా అమలుచేసి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రభుత్వ తీరును ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులుగా రాబోయే రోజుల్లో ప్రభుత్వ తీరును నిరసిస్తూ మరిన్ని ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సివస్తుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కార్పోరేటర్లు పగుడాల శిరీషాబాబూరావు, సబిహా గౌసుద్దీన్, ఆవుల రవీందర్ రెడ్డి, ముద్దం నరసింహారావు, జూపల్లి సత్యనారాయణ రావు, మందాడి శ్రీనివాసరావు, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పోరేటర్లు తూము శ్రావణ్ కుమార్, కార్యకర్తలు, మహిళ నాయకురాళ్ళు, అనుబంధ సంస్థ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గున్నారు.









రాజకీయ చైతన్యాన్ని నింపేది విద్యనే

కృపస్కయా...
సోవియట్ యూనియన్‌లో విద్యా వ్యాప్తికోసం ఎంతో కృషి చేసింది. కార్మికులకు అక్షరాలు నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. విద్యనే వారిలో రాజకీయ చైతన్యం నింపే ఆయుధం అని విశ్వసించింది. అలాగే మహిళా హక్కుల కోసం అహర్నిశలూ తపించింది. గొప్ప విప్లవకారుడు లెనిన్‌కు భార్యగానే గాక అతని రచనలు ప్రపంచం ముందుకు వచ్చేందుకు నిరంతరం శ్రమించింది. కమ్యూనిస్టు పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించిన ఆ మహిళా నాయకురాలి పరిచయం రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నేటి మానవిలో...

కృపస్కయా సెయింట్ పీటర్స్ బర్గ్‌లో కులీన కుటుంబంలో జన్మించింది. ఆమెలో మొదటి నుండి పేదల జీవితాలను మెరుగుపరచాలనే బలమైన కోరిక ఉండేది. తర్వాత కాలంలో మార్క్సిజంలోకి అడుగుపెట్టింది. 1894లో మార్క్సిస్ట్ చర్చా బృందంలో లెనిన్‌ను కలుసుకుంది. విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తూ 1896లో ఇద్దరూ అరెస్టయ్యారు. లెనిన్ సైబీరియాకు బహిష్కరించబడిన తర్వాత కృపస్కయా 1898లో ఆయన్ని వివాహం చేసుకుంది. 1905 విప్లవంలో పాల్గొనడానికి రష్యాకు తిరిగి వచ్చే ముందు వారిద్దరూ కొంత కాలం మ్యూనిచ్, లండన్‌లో నివసించారు. 1917 విప్లవం తర్వాత కృపస్కయా రాజకీయాలలో కీలకపాత్ర పోషించారు. 1924లో కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1929 నుండి 1939 వరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ కమీషనర్, సోవియట్ అభివృద్ధితో సహా సోవియట్ విద్యా వ్యవస్థపై బలమైన ప్రభావం చూపించారు. 1939లో ఆమె మాస్కోలో మరణించింది.

దుర్భర జీవితాలకు వ్యతిరేకంగా

కృపస్కయా పుట్టింది ఉన్నత కుటుంబంలోనే. కానీ ఆమె పుట్టేనాటికి వారి పరిస్థితి ఆర్థికంగా దిగజారిపోయి ఉంది. ఆమె తండ్రి కాన్‌స్టాంటిన్ ఇగ్నాటీవిచ్ క్రుప్‌స్కీ, రష్యన్ సైనిక అధికారి. మంచి పేరున్న వ్యక్తి. తర్వాత కాలంలో అతనికి విప్లవకారులతో పరిచయాలను ఉన్నాయనే అనుమానంతో ఎక్కడా మని దొరక్కుండా చేశారు. తల్లి యెలిజవేటా వాసిలీవ్నా టిస్ట్రోవా, భూమిలేని రష్యన్ ప్రభువుల కుమార్తె. ఆమె తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుంది. అప్పట్లో ఆమె రష్యాలో మహిళలకు అందుబాటులో ఉన్న అత్యున్నత అధికారిక విద్య బెస్టుజేవ్ కోర్సులలో చేరింది. డిగ్రీని సంపాదించిన తర్వాత వివాహం చేసుకునే వరకు ఉన్నత కుటుంబాలకు గవర్నెస్‌గా పనిచేసింది. బాగా చదువుకున్న, కులీన వంశానికి చెందిన తల్లిదండ్రుల ప్రభావం వల్లనో ఏమో కృపస్కయా అనేక రకాల సైద్ధాంతిక విషయాలపై అవగాహన పెంచుకుంది. చిన్నతనం నుండే తన చుట్టూ ఉన్న దుర్భర జీవితాలకు వ్యతిరేకంగా స్పందిస్తుండేది.

విద్యపై ఆసక్తితో...

తండ్రి మరణంతో కృపస్కాయా తన తల్లితో పాటు కుటుంబ పోషణ కోసం టీచర్‌గా పని చేసింది. చిన్నప్పటి నుండి ఆమెకు విద్యంటే ఆసక్తి. పాఠాలు చెబుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించేది. ఆమె మొదటి నుండి టాల్‌స్టాయ్ రచనలను బాగా అధ్యయనం చేసేది. ఆ ప్రభావం ఆమెపై పడింది. ఆ ప్రభావంతోనే ఆమె ఎప్పుడూ నిరాడంబరంగా ఉండేది. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చేది. అందుకోసం అనేక చర్చల్లో పాల్గొనేది. మొదట ఆమెకు మార్క్స్ సిద్ధాంతం పరిచమయింది. ఇది తన ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు సరైన మార్గంగా గుర్తించింది. అందుకే మార్క్సిస్ట్ తత్వశాస్త్ర లోతైన అధ్యయనాన్ని ప్రారంభించింది. అప్పట్లో ఈ పుస్తకాలను రష్యన్ ప్రభుత్వం నిషేధించడంతో అధ్యయనం చాలా కష్టంగా మారింది. అందుకే సేకరించి భూగర్భ లైబ్రరీలలో ఉంచేవారు. 1890లో ఆమె ఇంజనీర్ రాబర్ట్ క్లాసన్ నిర్వహించిన మార్క్సిస్ట్ సర్కిల్‌లో చేరింది. తర్వాత యువ కార్మికుల కోసం నడిచే సండే స్కూల్లో పని చేసింది.

లెనిన్‌తో వివాహం

కృపస్కయా మొదటిసారిగా లెనిన్‌ను ఫిబ్రవరి 1894లో ఓ చర్చా సమూహంలో కలుసుకుంది. అక్కడ అతని వ్యక్తిత్వం కన్నా ప్రసంగం ఆమెను ఎంతగానో ఆకట్టుకుంది. అక్టోబరు 1896లో లెనిన్ అరెస్టయిన చాలా నెలల తర్వాత ఆమె కూడా అరెస్టయ్యింది. ఆమెను కొంతకాలం పీటర్, పాల్ కోటలో నిర్బంధించారు. అయితే అక్కడ ఓ మహిళ తనను తాను కాల్చుకుని మరణించడంతో కృపస్కయను కూడా విడుదల చేశారు. ఆమె యుఫాలో మూడేండ్లు బహిష్కరణకు గురయ్యింది. బహిష్కరణకు ముందు తన తల్లి ద్వారా ఆమెకు లెనిన్ నుండి ఓ ఉత్తరం అందింది. అతను ఉంటున్న ప్రవాస ప్రదేశానికి ఆమెను అనుమతించే లేఖ అది. ఆమెకు లెనిన్‌తో పాటు వెళ్లేందుకు అనుమతి దొరికింది. అయితే వచ్చిన వెంటనే ఇద్దరూ వివాహం చేసుకోవాలని తల్లి షరతు పెట్టింది. మే 1898లో కృపస్కయా లెనిన్‌న్ని వివాహం చేసుకుంది. అప్పటి నుండి లెనిన్ రచనలను ఆమె అనువాదం చేసేది.

అనారోగ్యం వెంటాడినా...

కృపస్కయా గ్రేవ్స్ వ్యాధి బారిన పడింది. ఇది థైరాయిడ్ గ్రంధిని ప్రభావితం చేస్తుంది. దీని వలన కళ్లు ఉబ్బి, మెడ బిగుసుకుపోతుంది. అంతేకాదు ఋతు చక్రానికి కూడా ఇబ్బందిగా మారింది. ఇలా ఎన్ని అనారోగ్య సమస్యలు వెంటాడినా తన రాజకీయ లక్ష్యాన్ని మాత్రం విడనాడలేదు. విడుదలైన తర్వాత లెనిన్ యూరప్ వెళ్లి మ్యూనిచ్ వెళ్ళాడు. ఆమె కూడా విడుదలై అతని వద్దకు వెళ్ళింది. తర్వాత ఇద్దరూ కలిసి లండన్‌కు వెళ్లారు. కృపస్కయా లెనిన్‌తో తన జీవితపు జ్ఞాపకాలను 1930లో 'మెమోరీస్ ఆఫ్ లెనిన్' అని రాసుకుంది.

రాజకీయ జీవితం

1903 నుండి ఆమె రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన బోల్షివిక్ కార్యకర్తగా ఉండేది. అప్పట్లో లెనిన్ నడిపిస్తున్న ఇస్క్రా వార్తాపత్రిక కోసం ఆమె ఎంతో కృషి చేసింది. 1905లో ఆమె రష్యాకు తిరిగి వచ్చింది. 1905 విప్లవం విఫలమైన తర్వాత మళ్లీ వెళ్లిపోయి ఫ్రాన్స్‌లో కొన్నేండ్లు ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. 1917లో రష్యన్ విప్లవం తర్వాత ఆమె పీపుల్స్ కమీసర్ ఫర్ ఎడ్యుకేషన్ అనాటోలీ లునాచర్స్కీకి డిప్యూటీగా నియమితులయ్యింది. అక్కడ ఆమె వయోజన విద్యా విభాగానికి బాధ్యతలు స్వీకరించారు. 1920లో విద్యా కమిటీకి అధ్యక్షురాలై 1929 నుండి 1939 వరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ కమిషనర్ (ప్రభుత్వ మంత్రి)గా పని చేసింది. సోవియట్ విద్యా వ్యవస్థను స్థాపించడంలో కీలక పాత్ర పోషించింది. సోవియట్ లైబ్రేరియన్‌షిప్ అభివృద్ధిలో కూడా భాగస్వామిగా ఉంది. 1924లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా, 1927లో దాని కంట్రోల్ కమిషన్ సభ్యురాలిగా, 1931లో సుప్రీం సోవియట్ సభ్యురాలిగా ఉంది.

నిబద్ధత కలిగిన మార్క్సిస్ట్

కృపస్కయా నిబద్ధత కలిగిన మార్క్సిస్ట్. ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికి అహర్నిశలూ కృషి చేసింది. అలాగే మహిళా కార్మికులను విద్యా వంతులుగా చేయడంలో, రాజకీయంగా వారిని చైతన్య పరచడంలో ముఖ్య పాత్ర పోషించారు. మహిళా హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. జనవరి 1924లో లెనిన్ మరణానంతరం కూడా ఆమె పార్టీలో కొనసాగుతూ పార్టీలో జరుగుతున్న అంతర్గత పొరపాట్లను ఎప్పటికప్పుడు తిప్పికొడుతుండేది. కృపస్కయా 27 ఫిబ్రవరి 1939న మాస్కోలో మరణించింది. ఆమె డెబ్బైవ పుట్టినరోజు తర్వాత రోజు ఆమెను క్రెమ్లిన్ వాల్ నెక్రోపోలిస్‌లో ఖననం చేశారు.

సోవియట్ యూనియన్‌లో విద్య

విప్లవానికి ముందు ఆమె ఉద్యోగులకు ఐదేండ్ల పాటు సాయంత్రం తరగతులను బోధించింది. చదవడం, రాయడంతో పాటు వారికి లెక్కలు నేర్పించేది. ఈ ప్రాంతంలో దాదాపు 30,000 మంది ఫ్యాక్టరీ కార్మికులు మెరుగైన వేతనాల కోసం సమ్మె చేయడానికి అవసరమైన చైతన్యాన్ని నింపారు. విప్లవం తర్వాత కూడా ఆమె 'యువత సంస్థ – విద్య యొక్క సమస్యలపై' దృష్టి సారించింది. కార్మికులు విద్యా వంతులుగా మారడానికి వారికి పుస్తకాలు అవసరమని ఆమె గుర్తించారు. కార్మికులకు అలాంటి పుస్తకాలు అందుబాటులో ఉండచంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. సోషలిస్ట్ రాజకీయ విలువలు పెంపొందేందుకు విద్య చాలా అవసరమని ఆమె విశ్వసించింది.



ప్రాజెక్టులపై ఆరా..

- ఉత్తమ్‌తో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ భేటి
- మేడిగడ్డ సహా ఆయా అంశాలపై చర్చ
- డాక్యుమెంట్లు, సమాచారం కమిటీకి ఇవ్వాలని ఆదేశం
- నివేదిక ఆధారంగానే చర్యలు : మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన నిమిత్తం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన ఎన్‌డిఎస్‌ఏ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్ నిపుణుల కమిటీ బుధవారం రాష్ట్రానికి చేరుకుంది. నాలుగు రోజుల పాటు బ్యారేజీలను పరిశీలించనుంది. తొలిరోజు హైదరాబాద్‌లోని జలసౌధలో రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు, ప్రస్తుత పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. దాదాపు 19 అంశాలకు సంబంధించి సమాచారం ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్, అక్కడే ఉన్న సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జానుద్దేశించి మాట్లాడుతూ కమిటీ అడిగిన సమాచారం అంతా ఇవ్వాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు జరగరాదన్నారు. దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్ ఇతర అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. నిపుణుల బృందం క్షేత్రస్థాయి పర్యటన అనంతరం ఈనెల తొమ్మిదిన మళ్లీ జలసౌధలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో భేటి కానుంది.

నిపుణులతో కమిటీ అనేక అంశాలపై చర్చించాం: ఉత్తమ్

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు గత ఏడాది అక్టోబర్ 21వ తేదీన కుంగిపోయిన సంగతిని ఎన్‌డీఎస్‌ఏ నియమించిన నిపుణుల కమిటీకి వివరించామని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిపుణుల కమిటీకి కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తాము కోరిన వెంటనే కేంద్ర జలశక్తి శాఖ కమిటీ వేసి పరిశీలనకు పంపినందుకు హర్షం వ్యక్తం చేశారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోయిన నేపథ్యంలో పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని కోరుతున్నామని అన్నారు. కమిటీ సలహాలను పాటించి మేడిగడ్డను తిరిగి ఉపయోగంలోకి తెస్తామని అన్నారు. మూడు రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఫీల్డ్ వర్క్ చేయనుందని చెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ బృందానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. నిపుణుల బృందం గురువారం మేడిగడ్డ, ఆ తర్వాత అన్నారం, రాత్రి రామగుండం, శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని సందర్శిస్తుందన్నారు. ప్రభుత్వం దగ్గర ఉన్న అన్ని డాక్యుమెంట్లను ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి ఇవ్వాలని కోరారు. ఎవరైనా ఆ కమిటీకి సహకరించకపోయినా, డాక్యుమెంట్లు దాచిపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యారేజీ దెబ్బతినడానికి కమిటీ కారణాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. సమస్యకు ప్రధాన కారణం ఎవరనేది కమిటీని అడిగామనీ, వర్షాలు రాకముందే ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని కమిటీని కోరినట్టు వివరించారు.



ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా తప్పులు ఉంటే నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎల్ అండ్ టీ రాష్ట్రంలో అనేక వ్యాపారాలు చేస్తున్నదనీ, తాము చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. న్యాయ విచారణపై త్వరలోనే ముందుడుగు పడుతుందని మంత్రి తెలిపారు.

ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి సహకరిస్తాం : సాగునీటి శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్

ఎన్‌డీఎస్‌ఏ అడిగిన సమాచారం అంతా ఇస్తామని సాగునీటి శాఖ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్ అన్నారు. కమిటీ సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఇప్పటికే ఆ కమిటీ నుంచి లేఖ అందిందనీ, ఆ మేరకు అంతా ఇచ్చినట్టు చెప్పారు. అంశాలవారీగా వారి సందేహాలకు సమాధానాలు చెప్పినట్టు వివరించారు.

మోడీవి విచిత్రమైన విమర్శలు: ఉత్తమ్

కాళేశ్వరం అవినీతిలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన విమర్శలు విచిత్రంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ విచారణ చేయడం కాదనీ, మేడిగడ్డ విషయంలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి నాలుగు నెలల సమయం ఉందని చెప్పారు. వీలైనంత త్వరగా తాత్కాలిక నివేదిక అడుగుతున్నామనీ, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పదేండ్లు బీజేపీ, బీఆర్‌ఎస్ అలయ్ బలయ్ చేసుకున్నాక, కాళేశ్వరం ఏటీఎం అని ఇప్పుడు తెలిసిందా అని ప్రశ్నించారు. భారీస్థాయిలో అవినీతి జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదని వ్యాఖ్యానించారు. కలిసి ప్రయాణం చేశారు, రూ. 80 వేల కోట్ల రూపాయల రుణాలు ఇప్పించారు, ఇందులో మీకు వాటా ఉందా అని అడిగారు. గౌరవనీయ ప్రధాని హోదాలో ఉండి మోడీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వాస్తవం లేని విషయాలు ప్రచారం చేయడం దారుణమని విమర్శించారు. కాళేశ్వరం తొలుత రూ. 80 వేల కోట్ల డీపీఆర్ చేశారనీ, ఇప్పుడా ఖర్చు రూ.94 వేల కోట్లకు చేరిందని గుర్తు చేశారు.

ఇప్పుడు ప్రధాని కాంగ్రెస్‌పై బురదచల్లే పనిచేయడం ఎంతమాత్రం సరికాదని అన్నారు. మోడీ ప్రధాని అయిన వెంటనే తెలంగాణకు అన్యాయం చేశారని వ్యాఖ్యానించారు. సీలేరు ప్రాజెక్టు, ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని విమర్శించారు. పునర్విభజన చట్టంలో ఇచ్చిన ఐటీఐఆర్ ఏమైందని ప్రశ్నించారు. 50 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నా, తెలంగాణ దక్కనీవ్వకుండా బీజేపీ అడ్డుకుందన్నారు. మోడీ ప్రధాని అయ్యాకే ఐటీఐఆర్ రద్దు అయిందన్నారు. చట్టపరంగా వచ్చిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఎందుకు మంజూరు కాలేదన్నారు. దేశ పౌరుల ఖాతాల్లో విదేశీ నల్లధనం ద్వారా వచ్చిన సొమ్మును రూ. 15 లక్షలు వేస్తామన్నారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఎన్నికల కోసం అబద్ధాలు చెప్పడం, చిల్లర విమర్శలు చేయడం మోడీకే చెల్లిందన్నారు. మేడిగడ్డ విషయంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా అధికారులపై చర్యలు తీసుకున్నామనీ, ఎన్‌డిఎస్‌ఏ నివేదిక రాగానే మరింత మందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మీ ఆంక్షలు తగవు..?


(మొదటిపేజి తరువాయి)

కోసం విజ్ఞప్తి చేయాలని సూచించింది. చట్టపరమైన ఆశ్రయం పొందే హక్కు రాష్ట్రానికి ఉందని అంగీకరిస్తూ, ముందస్తు షరతుగా కేరళ దావాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయొద్దని కోర్టు కేంద్రానికి సూచించింది.

రూ.13,608 కోట్ల మేరకు అదనపు రుణాలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, అయితే పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలనే షరతు విధించిందని ధర్మాసనానికి కేరళ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తరపు అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్‌ను ఉద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ అలాంటి షరతును ఎలా విధించగలరని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలనే షరతు మినహా రాజ్యాంగంలోని నిబంధనల పరిధిలోని ఇతర షరతులను కేంద్ర విధించవచ్చని అన్నారు. కేరళ రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రూ. 13,608 కోట్ల మొత్తం రాష్ట్రానికి సంబంధించినదేనని, అది కేంద్రం ఇచ్చే రాయితీ కాదని వాదించారు. రాష్ట్రానికి అదనంగా రూ.50 వేల కోట్ల రుణాలు అవసరమని సిబల్ కోరారు. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి నేడు, రేపు సమావేశం నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. కేసు తదుపరి విచారణను వాయిదా వేసింది. అయితే, చర్చలు విఫలమైతే కేరళ, కేంద్రం విచారణను అభ్యర్థించవచ్చు.అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఉదయనిధి, రాజాలకు ఊరట

- సనాతన ధర్మంపై వ్యాఖ్యల కేసులో వారెంట్ ఇవ్వలేం: తేల్చి చెప్పిన మద్రాసు హైకోర్టు



చెన్నై: సనాతన ధర్మంపై వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో తమిళనాడు క్రీడా మంత్రి, డీఎంకే నాయకులు ఉదయనిధి స్టాలిన్, మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులకు కో -వారెంటు జారీ చేయాలన్న అభ్యర్థనను మద్రాస్ హైకోర్టు బుధవారం తోసిపుచ్చింది. ఉదయనిధితో పాటు ధర్మాదాయ శాఖ మంత్రి పికె శేఖర్‌బాబు, నీలగిరి పార్లమెంట్ సభ్యులు ఎ. రాజాలను చట్టసభ సభ్యులుగా కొనసాగడానికి అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. వీరిపై ఎలాంటి నేరారోపణలు లేనందున కో-వారెంట్ జారీ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని జస్టిస్ అనితా సుమంత పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. "సనాతన ధర్మం హెచ్‌ఐవి లాంటిది. దీనిని నిర్మూలించాలి" అని వ్యాఖ్యానించారు.

'లహరి'లో 10 శాతం రాయితీ

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీకి చెందిన లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో దూర ప్రాంత ప్రయాణీకులకు టిక్కెట్లలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు ఆ సంస్థ యాజమాన్యం నిర్ణయించింది. ఈ బస్సులు తిరిగే అన్ని రూట్లలోనూ ఈ రాయితీ వర్తిస్తుందని టీఎస్‌ఆర్టీసీ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 30 వరకు ఈ డిస్కౌంట్ అమల్లో ఉంటుందని వివరించారు. లహరి ఏసీ స్లీపర్ బస్సులు హైదరాబాద్ నుంచి చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, బెంగళూరు రూట్లలో నడుస్తున్నాయి. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ సర్వీసులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌కూ, గోదావరిఖని–బెంగళూరు, కరీంనగర్–బెంగళూరు, నిజామాబాద్ –తిరుపతి, నిజామాబాద్ –బెంగళూరు, వరంగల్–బెంగళూరు రూట్లలో తిరుగుతున్నాయి. వీటన్నింటిలో ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

గ్రూప్స్ రాతపరీక్షల తేదీలు ఖరారు

ఆగస్టు 7, 8న గ్రూప్–2

- అక్టోబర్ 21న గ్రూప్–1 మెయిన్స్
- నవంబర్ 17,18న గ్రూప్–3 : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్, గ్రూప్–2, గ్రూప్–3 రాతపరీక్షల తేదీలు ఖరారయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు ఏడు, ఎనిమిది తేదీల్లో గ్రూప్–2, అక్టోబర్ 21న గ్రూప్–1 మెయిన్స్, నవంబర్ 17,18 తేదీల్లో గ్రూప్–3 రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. 563 గ్రూప్–1 పోస్టుల భర్తీకి గతనెల 19న గ్రూప్–1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. 503 గ్రూప్–1 పోస్టుల భర్తీకి 2022, ఏప్రిల్ 26న ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఈనెల 14వ తేదీ వరకు తుది గడువున్నది. పాత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిందేననీ, అయితే ఫీజు మాత్రం మినహాయింపునిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. గ్రూప్–1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించనుంది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్–2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గ్రూప్–2 రాతపరీక్షలు పలుమార్లు వాయిదా పడ్డాయి. 1,388 గ్రూప్–3 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 30న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

కోవలెంట్ పరిశ్రమలో ఘోర ప్రమాదం

- రియాక్టర్ వద్ద మంటలు అంటుకొని కార్మికుని మృతి
- పరిశ్రమ సేఫ్టీ ప్రికాషన్స్ పాటించకపోవడం వల్లే ప్రమాదం
- పరిశ్రమపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలంటూ.. మృతుని కుటుంబ సభ్యుల ధర్నా, రాస్తారోకో



నవ తెలంగాణ–హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచనూర్ గ్రామ శివారులోని కోవలేంట్ పరిశ్రమలో రియాక్టర్ వద్ద మంటలు చెలరేగి ఒక కార్మికుడు మృతి చెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోవలెంట్ పరిశ్రమలోని టీబీ బ్లాక్–4లో హత్నూరకు చెందిన వినోద్ కుమార్(30) కెమిస్ట్‌గా, జార్ఖండ్‌కు చెందిన ఫాదర్ మారండి, లాల్ బాబ్ తూరి, స్వధీన్ రాజు కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కెమికల్ పౌడర్ అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో రియాక్టర్ వద్ద ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో అక్కడే పని చేస్తున్న వారిని మంటలు చుట్టుముట్టాయి. సేఫ్టీ లేకపోవడంతో మంటలు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఎగసిపడిన మంటలకు భయపడి కార్మికులు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కానీ రియాక్టర్ వద్ద పనిచేస్తున్న నలుగురు కార్మికులు కెమిస్ట్‌తో కలిసి మంటల్లో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వినోద్‌కుమార్ మృతి చెందాడు. కాగా మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగితే.. ఎవరికీ చెప్పకుండా.. రాత్రి సమయంలో మృతుడు వినోద్ కుమార్ కుటుంబీకులకు యాజమాన్యం చెప్పింది. దాంతో ఆగ్రహించిన వారు బుధవారం ఉదయం కోలెంట్ పరిశ్రమ గేటు ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించకపోవడంతో సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై పరిశ్రమ ఎదుట బైటాయించి.. ప్రమాదానికి కారకులైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రెండోరౌండ్‌కు లక్ష్యసేన్

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో లక్ష్యసేన్ 15-21, 21-15, 21-3 తేడాతో జపాన్ ఆటగాడు కాంత సునేయమను చిత్తు చేశాడు. అయితే, ఈ మ్యాచ్‌లో లక్ష్యసేన్‌కు తొలి గేమ్‌లో ప్రత్యర్ధి షాకిచ్చాడు. 8-5తో ఆధిక్యంలోకి కొనసాగిన లక్ష్యసేన్ ఆ తర్వాత పట్టు కోల్పోయి గేమ్‌ను చేజార్చుకున్నాడు. తొలి గేమ్ తర్వాత లక్ష్యసేన్ అద్భుతంగా పుంజుకున్నాడు. వరుసగా రెండు గేమ్‌లను ఏకపక్షంగా గెలుచుకున్నాడు. లక్ష్యసేన్ జోరు ముందు ప్రత్యర్ధి నిలువలేకపోయాడు. మరోవైపు, యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. టాప్ సీడ్, డెన్మార్క్ స్టార్ విక్టర్ అక్సెల్సెన్ చేతిలో 21-8, 21-15 తేడాతో పరాజయం పాలయ్యాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, మహిళల డబుల్స్‌లో ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ జంట రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే.

అదే జోరు చివరి టెస్ట్‌లోనూ..

- ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్ నేటినుంచే..
- ఉదయం 9.30గం॥ల నుంచి

ధర్మశాల: ఇంగ్లండ్‌తో ఆఖరి, ఐదో టెస్ట్‌కు టీమిండియా సిద్ధమైంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియాకు ఇది నామమాత్రపు మ్యాచ్ కాగా.. ఇందులోనూ విజయం సాధించి ఆధిపత్యాన్ని కొనసాగించాలని రోహిత్ సేన భావిస్తోంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలంటే ప్రతి మ్యాచ్ భారత్‌కు కీలకమే. నాలుగో టెస్టుకు విశ్రాంతి తీసుకున్న స్టార్ పేసర్ బుమ్రా.. ధర్మశాలలో జరిగే చివరి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా మూడు టెస్టుల్లో 17 వికెట్లు తీసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. బుమ్రా రాకతో మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్‌లో ఒకరిపై వేటు పడే ఛాన్స్ ఉంది. ఇక బ్యాటింగ్‌లో అదరగొడుతున్న జైస్వాల్-రోహిత్ ఓపెనింగ్ చేయనున్నారు. నాలుగో టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వికెట్ కీపర్ ధృవ్ జురెల్ తుది జట్టులో ఉండటం ఖాయమే. గాయపడ్డ కేఎల్ రాహుల్, ఫామ్ లేమితో బాధపడుతున్న రజత్ పటీదార్‌లకు చోటు దక్కడం కష్టమే. మూడోటెస్ట్‌లో రాణించి సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు దేవదత్ పడిక్కల్ టెస్టులో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అలాగే కెరీర్‌లో వందో టెస్టు ఆడుతున్న సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తుది జట్టులో ఉంటాడు. అతడితో కలిసి ఆల్‌రౌండర్ కోటాలో రవీంద్ర జడేజాతోపాటు టీమ్ మేనేజ్‌మెంట్ స్పిన్నర్ వైపు మొగ్గు చూపితే కుల్దీప్ యాదవ్ జట్టులో చోటు ఖాయం.



చల్లటి వాతావరణంలో...

నాల్గోటెస్ట్ జరిగే హిమాచల్ క్రికెట్ అసోసియేషన్ చల్లటి వాతావరణంతో కూడి ఉంటుంది. ధర్మశాల పిచ్ తొలుత సీమర్లకు అనుకూలంగా, ఆ తర్వాత స్పిన్నర్ల ప్రభావం కనిపిస్తుంది. ఈ వేదికపై 2017లో జరిగిన ఏకైక టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. ఈ పిచ్ వన్ సైడెడ్‌గా ఉండదని.. రెండు జట్లకు అనుకూలిస్తుందని ఇంగ్లండ్ బ్యాటర్, వందో టెస్టు ఆడుతున్న జానీ బెయిర్‌స్టో తెలిపాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో న్యూజిలాండ్ ఘోర ఓటమితో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న టీమిండియా తొలి స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం టీమిండియా 64.58 విజయాల శాతంతో అగ్రస్థానంలో నిలవగా.. న్యూజిలాండ్ 60 శాతం, ఆస్ట్రేలియా 59.09 శాతంతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

జట్లు(అంచనా)..

ఇండియా : రోహిత్ శర్మ(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, పడిక్కల్/పటీదార్, సర్ఫరాజ్, ధృవ్ జురెల్(వికెట్ కీపర్), జడేజా, అశ్విన్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ఆకాశ్ దీప్.

ఇంగ్లండ్: బెన్ స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్(వికెట్ కీపర్), హార్ట్ లీ, మార్క్ వుడ్, బషీర్, ఆండర్సన్, రాబిన్సన్.

అశ్విన్ @ 100వ టెస్ట్

ధర్మశాల టెస్టు మ్యాచ్ ఆడటంతో రవిచంద్రన్ అశ్విన్ భారత్ తరఫున 100 టెస్టు మ్యాచ్‌లు ఆడిన 14వ టీమిండియా ప్లేయర్‌గా ఘనత సాధించనున్నాడు. అంతర్జాతీయంగా టెస్ట్ క్రికెట్‌లో మొత్తం 79మంది క్రికెటర్లు 100 టెస్టులు ఆడారు. అలాగే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనతను అందుకోనున్నాడు. ఈ మ్యాచ్ ఆడటంతో అశ్విన్ టెస్టు క్రికెట్‌లో భారత జాతీయ జట్టు తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన 14వ ప్లేయర్, ఐదో బౌలర్‌గా రికార్డు సృష్టించనున్నాడు. అంతకుముందు, కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్, ఇషాంత్ శర్మలు భారత్ తరఫున 100 టెస్టు మ్యాచ్‌లను ఆడారు. అలాగే మూడో స్పిన్నర్‌గా అశ్విన్ నిలుస్తాడు. దీంతో పాటు దిగ్గజ బౌలర్ల రికార్డులను కూడా అశ్విన్ బ్రేక్ చేయనున్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటికే అనిల్ కుంబ్లే తర్వాత 500 టెస్టు వికెట్లు తీసిన రెండో భారతీయుడిగా అశ్విన్ చరిత్ర సష్టించాడు. టెస్టుల్లో కుంబ్లే భారత్ తరఫున అత్యధిక వికెట్లు (619 వికెట్లు) తీసిన బౌలర్ కాగా, అశ్విన్ కేవలం 98 మ్యాచ్‌ల్లోనే 500 వికెట్ల మైలురాయిని అత్యంత వేగంగా అందుకున్నాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో రెండో క్రికెటర్‌గా రికార్డు..

99 టెస్టులు ఆడి 584 వికెట్లు తీసిన ముత్తయ్య మురళీధరన్ తర్వాత 100వ టెస్టు ఆడే ముందు 500 వికెట్లు తీసిన తర్వాత ఈ మైలురాయిని పూర్తి చేసిన రెండో క్రికెటర్‌గా అశ్విన్ చరిత్రలో నిలిచాడు. 100 టెస్టు మ్యాచ్‌లకు ముందు 500 వికెట్లు తీసిన ఇద్దరిలో అశ్విన్ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. 2011లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అశ్విన్ భారత్ తరఫున తన అరంగేట్రం చేసాడు. అప్పటి నుంచి టీమిండియా టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు.

99టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు..

మురళీధరన్(శ్రీలంక)	: 584
అశ్విన్(ఇండియా)	: 507
అనిల్ కుంబ్లే(ఇండియా)	: 478
మెక్‌గ్రాత్(ఆస్ట్రేలియా)	: 446
షేన్ వార్న్(ఆస్ట్రేలియా)	: 436

సామాజిక భద్రత లేదు

డొమెస్టిక్ వర్కర్స్ హక్కుల రక్షణకు చట్టం కావాలి

వెల్లడిస్తున్న ఉపాధి డేటా గణాంకాలు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఇండ్లల్లో పని చేసే కార్మికులు వారి హక్కులకు నోచుకోలేకపోతున్నారు. క్రమబద్ధీకరించబడని, తక్కువ సామాజిక భద్రతను కలిగిన ఇంటి పని(డొమెస్టిక్ వర్క్), అనధికారిక శ్రామికశక్తిలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి రంగంగా ఉద్భవించింది. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా కేంద్రం సేకరించిన అధికారిక డేటా దీనిని సూచిస్తుంది. అయినప్పటికీ.. ఇతర కార్మికులతో పోలిస్తే.. వారు నిర్లక్ష్యానికి గురవుతున్నట్టు స్పష్టమవుతున్నది.

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఈ-శ్రమ్ పోర్టల్‌లోని డేటా ప్రకారం.. 29.43 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ పోర్టల్‌లో ఇప్పటివరకు నమోదు చేసుకున్నారు. వారిలో 15.39 కోట్ల మంది కార్మికులు వ్యవసాయంలో ఉన్నారు. తర్వాత స్థానంలో డొమెస్టిక్ వర్కర్స్ (2.84 కోట్ల మంది), నిర్మాణ (2.65 కోట్ల మంది) ఉన్నారు.

అసంఘటిత రంగ కార్మికులలో అధిక వాటాగా ఇంటిపని (డొమెస్టిక్ వర్క్) ఎదుగుతున్న దృగ్విషయం వారి హక్కులను పరిరక్షించటానికి చట్టం ఆవశ్యకతను నొక్కిచెప్పిందని కార్మిక ఆర్థికవేత్తలు అంటున్నారు. ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులను 2021, ఆగస్టులో నమోదు చేయటం ప్రారంభించింది. వారు ఏ వృత్తిలో నిమగ్నమై ఉన్నారు? వారి నెలవారీ ఆదాయం ఎంత? వంటి పలు వివరాలను ఇవ్వాలని ప్రభుత్వ పోర్టల్ కార్మికులను కోరింది. ఇంటి పని అంటే ఊడ్చటం, పాత్రలు శుభ్రం చేయటం, బట్టలు ఉతకటం, వంట చేయటం, పిల్లలను చూసుకోవటం వంటివి. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) నివేదిక ప్రకారం.. 2004-05లో భారత్‌లో 47.5 లక్షల మంది గృహ కార్మికులు ఉన్నారు.

కనీస వేతనం లేదు.. ఎక్కువ గంటల పని : ఐఎల్ఓ



ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) వెబ్‌సైట్ ప్రకారం.. ఈ కార్మికులలో చాలా మందికి కనీస వేతనం కూడా లభించదు. చాలా ఎక్కువ గంటలు పని చేస్తున్నారు. తరచుగా ఒక రోజు విశ్రాంతి కూడా తీసుకోరు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు కార్మికులను రప్పించే ప్లేస్‌మెంట్ ఏజెన్సీల చేతుల్లో వారు తరచూ దోపిడీకి గురవుతున్నారు. భారత్‌లో ఈ మహిళా గృహ కార్మికులు గణనీయమైన సంఖ్యలో జార్ఖండ్, బీహార్, బెంగాల్,ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి వలస వస్తున్నారు. ఇటీవలి కాలంలో పట్టణీకరణ, ప్రపంచీకరణ కారణంగా గృహ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని నిపుణులు అంటున్నారు. "తల్లిదండ్రులిద్దరూ కొన్ని ఉద్యోగాల్లో నిమగ్నమై ఉండటంతో చిన్న కుటుంబాలు ట్రెండ్‌గా మారాయి. గృహ కార్మికులు ఈ కుటుంబాల ఇంటి పనులను నిర్వహిస్తారు. అయితే, వీరి ఉద్యోగ రక్షణ, కార్మిక ప్రమాణాలు, కనీస వేతనాలు వర్తింపజేసేందుకు చట్టం తేవాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు చట్టాన్ని ఆమోదించాల్సిన అవసరం ఉన్నది. గృహ కార్మికుల దోపిడీని అరికట్టడానికి ఒక చట్టం కనీస అవసరం"అని కార్మిక సంఘాల నాయకులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

'నిరాశతో పనిలో చేరుతున్న మహిళలు'

సీఐటీయూ కార్యదర్శి ఎ.ఆర్.సింధు మాట్లాడుతూ.. ఎక్కువ మంది ఇంటి పనిలో చేరటమంటే లేబర్ మార్కెట్‌లో ఒత్తిడిగా అభివర్ణించారు. "వేతనంతో కూడిన ఉద్యోగం అందుబాటులో లేనప్పుడు, ప్రజలు ఇంటి పనిని ఎంచుకుంటారు. ముఖ్యంగా, మహిళా కార్మికులు నిరాశతో ఇంటి పనిలో చేరుతున్నారు " అని ఆమె అన్నారు.

కేరళ బడిలో తొలి రోబో టీచర్!

మూడు భాషల్లో ముచ్చటించే ఉపాధ్యాయురాలు

త్రివేంద్రం : తొలి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపాధ్యాయురాలు ఐరిస్ త్రివేంద్రంలోని కేటీసీటీ హయ్యర్ సెకండరీ పాఠశాలలో విద్యా బోధన ప్రారంభించింది. ఈ రోబోను మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్ ప్రయివేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. దేశంలో ఏఐ పరిజ్ఞానానికి ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో కేరళలోని ఈ పాఠశాల దాని ప్రయోజనాలను అందిపుచ్చుకొని చరిత్ర సృష్టించింది. ఏఐ టీచర్ ఐరిస్ విద్యార్థులతో కనీసం మూడు భాషల్లో ముచ్చటించగలదు. క్లిష్టతరమైన ప్రశ్నలకు సమాధానం చెప్పగలదు. గాత్ర సహకారం అందించగలదు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యను అభ్యసించడంలో విద్యార్థులను భాగస్వాములను చేయగలదు. తోటి వారి సాయం అవసరం లేకుండానే విద్యార్థులు నైపుణ్యాన్ని సంపాదించేలా వారి సామర్థ్యాన్ని పెంచగలదు.



వారు స్వేచ్ఛగా, సులభంగా విద్యను అభ్యసించేలా చేయగలదు. ఐరిస్ టీచర్ వీడియోను మేకర్‌ల్యాబ్స్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హాండిల్‌లో షేర్ చేసింది. ఆ వీడియో ఇప్పటికే నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. 'ప్రతి విద్యార్థి అవసరాలు, ప్రాధాన్యతలను ఐరిస్ గుర్తిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సమర్థవంతంగా పాఠాలు బోధించేలా విద్యావంతులను తీర్చిదిద్దుతుంది' అని మేకర్‌ల్యాబ్స్ ఆ పోస్ట్‌లో తెలిపింది.

గొడ్డు మాంసం ఎగుమతుల్లో భారత్‌ది రెండో స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా గొడ్డు మాంసం ఎగుమతి చేసే దేశాల జాబితాలో భారత్ రెండో స్థానంలో ఉంది. 2022లో నాలుగో స్థానంలో ఉన్న భారత్ గతేడాది రెండో స్థానానికి చేరింది. మాంసం విక్రయాల పేరుతో దేశంలో సంఘ్ పరివార్ మూకలు సామూహిక హత్యలకు పాల్పడుతున్న వేళ నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో గొడ్డు మాంస ఎగుమతులు పెరిగిపోయాయన్న వార్త ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా వ్యవసాయ శాఖ రిపోర్టు ప్రకారం, 2023వ సంవత్సరంలో గొడ్డు మాంసం ఎగుమతుల్లో అమెరికా మొదటి స్థానంలో ఉంటుంది. అమెరికా మూడవ స్థానంలోను, ఆస్ట్రేలియా నాల్గవ స్థానంలో నిలిచాయి.



హర్ష

పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్

హీరో గోపీచంద్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ఈనెల 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు హర్ష మీడియాతో మాట్లాడుతూ, 'నేను బెంగళూరులో పుట్టి, పెరిగాను. ఇప్పటివరకూ అన్నీ కన్నడ సినిమాలే చేశాను. రాధామోహన్ నిర్మాణంలో వచ్చిన 'బెంగాల్ టైగర్' సినిమాలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఇప్పుడు వారి బ్యానర్‌లోనే ఈ సినిమాతో తెలుగులో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు ఎప్పుడూ చాలా పరిణితితో ఉంటారు. వారిని కథలో యంగేజింగ్‌గా ఉంచడం కోసం కొత్త తరహా స్క్రీన్ ప్లేని అనుసరించాలి. భీమా స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ఎంటర్‌టైన్, ఎలివేషన్, ఎమోషన్‌తో ఇది మంచి కమర్షియల్ సినిమాగా అలరిస్తుంది. సోషల్ మెసేజ్ కూడా ఉంది. ముఖ్యంగా భీమా క్యారెక్టర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపిస్తూ, అందరూ ఇష్టపడేలా ఉంటుంది. అలాగే ఈ కథలో సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. కమర్షియల్ టచ్‌లో ఫాంటసీ ఎలిమెంట్ బ్లెండ్ చేయడం చాలా కొత్తగా వచ్చింది. ఆడియన్స్‌కు ఇది సరికొత్త అనుభూతిని ఇస్తుంది. అయితే ట్రైలర్ చూశాక అందరూ 'అఖండ'తో పోలిక తెచ్చారు. కానీ దానికి దీనికి సంబంధం లేదు. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. దీన్ని మంచి క్వాలిటీతో నిర్మించారు.



అరుదైన అవార్డులు

ఎంతో మంది గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శక నిర్మాతలు తెలుగు సినిమా ఘనతను ప్రపంచానికి చాటారు. అలాంటి వారిని గౌరవించుకునే ప్రయత్నం చేస్తోంది ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ కార్యక్రమం. తెలుగు ఫిల్మ్ అండ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరమ్ నుంచి నాగబాల సురేష్ ఆధ్వర్యంలో ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ అవార్డ్స్ కార్యక్రమానికి విజన్ వివికె హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత విజయ్ కుమార్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. జ్యూరీ ఛైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెల 16వ తేదీన ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ అవార్డ్స్ కార్యక్రమం జరుగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఫిలిం ఛాంబర్‌లో ఈ అవార్డ్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దర్శకులు రేలంగి నరసింహారావు, నిర్మాత ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ వివికె హౌసింగ్ సంస్థ అధినేత విజయ్ కుమార్ మాట్లాడుతూ, 'ఆ కార్యక్రమ స్పాన్సర్ షిప్ మాకు దక్కడం సంతోషంగా ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వారికి ఈ అవార్డ్స్ అందజేస్తాం' అని అన్నారు. 'తెలుగు చిత్ర పరిశ్రమ ప్రయాణం ప్రారంభమై 92 ఏళ్లు అవుతోంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో 24 విభాగాల నుంచి వేలాది మంది లెజెండ్స్ ఈ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. అలాంటి గొప్పవారిని గుర్తుంచుకుని, గౌరవించుకునేందుకే ఈ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం' అని నాగబాల సురేష్ చెప్పారు.

నవచిత్రం

రామ్‌చరణ్ సరసన..



జాన్వీ కపూర్

రామ్ చరణ్ తన నెక్స్ట్ పాన్ ఇండియా చిత్రం కోసం 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానతో చేతులు కలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై హై బడ్జెట్‌తో భారీ ఎత్తున నిర్మిస్తున్న ఈ సినిమాతో గ్రాండ్‌గా చిత్ర నిర్మాణంలోకి అడుగు పెడుతున్నారు. ఈ చిత్రం కోసం బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్‌ను ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్వాగతం పలికారు. ఈ జోడి తెరపై అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులని మంత్రముగ్దులను చేయబోతోంది.

ఈ మెగా వెంచర్‌కి ఆస్కార్- విన్నింగ్ కంపోజర్ ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

దర్శకుడు బుచ్చిబాబు యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే తెలియజేస్తారు.


రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఏఆర్ రెహమాన్.

ఇటలీలో కల్కి పాట



ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యూచరిస్ట్ సైన్స్ ఫిక్షన్ గ్లోబల్ ఫిల్మ్ 'కల్కి 2898 ఎడి'. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం అద్భుతమైన సినిమా అనుభవాన్ని అందించబోతుంది. తాజాగా చిత్ర యూనిట్ సాంగ్ షూటింగ్ కోసం ఇటలీ వెళ్ళింది. ప్రభాస్, నాగ్ అశ్విన్, దిశా పటానీతో పాటు యూనిట్ అంతా కలిసి దిగిన ఫోటోని ఈ సందర్భంగా మేకర్స్ షేర్ చేశారు. ఇటలీలోని అద్భుతమైన లోకేషన్స్‌లో ఈ పాటని చాలా గ్రాండియర్ చిత్రీకరించనున్నారు.

ఈ సినిమా గత సంవత్సరం శాన్ డియాగో కామిక్-కాన్‌లో సంచలనం సృష్టించింది. టీజర్ గ్లింప్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను పొందింది. వైజయంతీ మూవీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైథాలజీ ఇన్స్పైర్డ్ ఫ్యూచరిస్ట్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ప్రేక్షకులకు దృశ్యకావ్యాన్ని అందించబోతుంది. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా విడుదల కానుంది.



శర్వానంద్

ఏకంగా మూడు సర్‌ప్రైజ్‌లు

తన పుట్టినరోజు సందర్భంగా హీరో శర్వానంద్ తన సినిమాల అప్‌డేట్స్ ఇచ్చి అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన నటిస్తున్న 35వ చిత్రం 'మనమే' విడుదలకు సిద్ధమైంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత కాగా, కృతి ప్రసాద్, ఫణి వర్మ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. శర్వా బర్త్‌డే కానుకగా టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు.

దీని తర్వాత తన 36వ సినిమాని సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'లూజర్' ఫేమ్ దర్శకుడు అభిలాష్ కంకరతో చేయబోతున్నారు. విక్రమ్ సమర్పణలో వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్ర పోస్టర్ సూచించినట్లుగా, ఇది స్పోర్ట్స్ బేస్డ్ మూవీగా ఉండబోతోంది, ఇందులో హీరో బైక్ రైడర్‌గా కనిపిస్తారు. ఇది మూడు తరాల కుటుంబానికి సంబంధించిన అద్భుతమైన కథ. 90, 20వ దశకం ప్రారంభంలో మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో పాటు లవ్, డ్రీమ్స్ ప్రధానాంశాలుగా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

తన గత సినిమా 'సామజవరగమన'తో సెన్సేషనల్ హిట్ అందించిన డైరెక్టర్ రామ్ అబ్బరాజు శర్వానంద్ 37వ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రకారం ఇది జాయ్ ఫుల్ హిలేరియస్ రైడ్‌గా ఉండబోతుంది.

ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో విశాలాక్షి

కేతిక హన్మయశ్రీ సమర్పణలో యు.కె. ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ శంకర్, మహేష్ యడ్లపల్లి, ఆయూషి పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో పవన్ శంకర్ దర్శకత్వంలో పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'విశాలాక్షి'.

బుధవారం ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఈ చిత్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించగా, నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం ఈ చిత్ర కాన్సెప్ట్ పోస్టర్‌ను వీరశంకర్, రాజ్‌కందుకూరి, ప్రతాని రామకృష్ణగౌడ్‌లు సంయుక్తంగా లాంచ్ చేశారు.

దర్శకుడు పవన్ శంకర్ మాట్లాడుతూ,'ఇది ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ ఎంటర్‌టైనర్. అలాగే మంచి సస్పెన్స్‌తో నడుస్తుంది. ఇందులో 5 పాటలు, 5 ఫైట్‌లు ఉంటాయి. మొత్తం 4 షెడ్యూల్స్‌లో సినిమాని కంప్లీట్ చేస్తాం. టాకీ మొత్తం రాయలసీమ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటుంది. పాటలను ఊటీ, అరకుల్లో చిత్రీకరించటానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'ఈ కథ ఇన్వెస్టిగేషన్, స్టింగ్ ఆపరేషన్, ఎమోషనల్ వంటి అన్ని అంశాలతో కూడుకున్నది. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని కథను మలిచాం' అని నిర్మాత పల్లపు ఉదయ్ కుమార్ చెప్పారు.



బుల్లెట్ రిలీజ్‌కి రెడీ

శ్రీ బండి సదానంద్ అండ్ మెమరీ మేకర్స్ సోమిసెట్టి హరికృష్ణ సమర్పించు, తుమ్మూరు కోట ఫిలిం సర్క్యూట్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరో రవి వర్మ సంజనా సింగ్, ఆలోక్ జైన్ ,మనీషా దేవ్, జీవ, విజయ రంగరాజు, సంధ్య శ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు ప్రధాన పాత్రలు పోషించారు. ఈనెల 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొడ్యూసర్ ఏ.ఎం రత్నం, దర్శకులు వి సముద్ర ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

హీరో రవి వర్మ మాట్లాడుతూ, "హీరోగా నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ప్రతి ఒక్కరూ థియేటర్లో ఈ చిత్రాన్ని చూడాలని కోరుకుంటున్నా. ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుంది' అని చెప్పారు.

'ఇదొక యాక్షన్ మూవీ. కర్నూల్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ చిత్రాన్ని చిత్రీకరించాం. టెక్నీషియన్స్ అందరూ బెస్ట్ అవుట్ పుట్ ఇచ్చారు. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉంటుంది. హీరో రవి వర్మ కొత్తవాడైనా చాలా బాగా చేశాడు' అని దర్శకుడు చౌడప్ప అన్నారు.

బండి సదానంద్ మాట్లాడుతూ, 'టీం వర్క్‌తో చేసిన చిత్రమిది. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి. కచ్చితంగా అందర్నీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాం' అని అన్నారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఒక్క రోజులో గాజాలో 86మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : గాజాలో గత ఐదు మాసాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంలో మంగళవారం ఒక్క రోజు వ్యవధిలో 86మంది పాలస్తీనియన్లు మరణించారు. సెంట్రల్, దక్షిణ గాజాల్లో ఇజ్రాయిల్ బలగాలు బాంబులు, శతఘ్ని దాడులతో విరుచుకుపడ్డాయి. రఫా, ఖాన్ యూనిస్ నగరాల్లోని లక్ష్యాలపై కూడా సైన్యం దాడులకు పాల్పడింది. ఖాన్ యూనిస్‌లోని అల్ ఖరారా ప్రాంతంలో బాంబు దాడుల్లో ఇద్దరు మృతి చెందగా, అనేకమంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో మొత్తంగా జనాలు లేకుండా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ భావిస్తోందని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. దాడులను ఉధృతం చేయడం, కరువు కాటకాలు పెచ్చరిల్లేలా చేయడం వల్ల ఉత్తర గాజా నుండి ప్రజలు తరలివెళ్లిపోవాలని చూస్తున్నారని పాలస్తీనా విదేశాంగ శాఖ పేర్కొంది. ఇప్పటికి 152 రోజుల నుండి గాజాపై ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడుతోందని తెలిపింది. ఉత్తర గాజాలో ఐదు లక్షలమందికి పైగా ప్రజలు అత్యంత భయంకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొంది. అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న బాంబు దాడులు, ముంచుకొస్తున్న దుర్భిక్షంతో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది.

2021లో 45మంది యూదు యాత్రికులు చనిపోవడానికి దారి తీసిన ఘటనకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యక్తిగత బాధ్యతను వహించాలని ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన కమిటీ తేల్చి చెప్పింది. దీంతో నెతన్యాహుపై ఒత్తిడి పెరుగుతోంది. యాత్రా స్థలంలో కల్లోల పరిస్థితులు నెలకొంటాయని నెతన్యాహు కార్యాలయాన్ని ముందుగానే హెచ్చరించారని, కానీ వాటిని పరిష్కరించడానికి సరైన చర్యలు తీసుకోలేదని దర్యాప్తు కమిటీ భావించింది. లెబనాన్ సరిహద్దుల్లో మౌంట్ మిరాన్ వద్ద రబ్బి సమాధికి 2021 ఏప్రిల్‌లో జరిగిన యాత్రా ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ యాత్రలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఇప్పటికే గాజాలో యుద్ధాన్ని ఆపాలంటూ పశ్చిమ మిత్ర దేశాల నుండి ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న నెతన్యాహుకు ఇది మరో ఎదురు దెబ్బ.

పాక్ మాజీ ప్రధాని జుల్ఫీకర్ భుట్టోకు న్యాయం జరగలేదు

- 44ఏండ్ల నాటి ఉరిశిక్ష కేసులో పాకిస్తాన్ సుప్రీం రూలింగ్

ఇస్లామాబాద్ : 44ఏండ్ల నాటి హత్య కేసులో ఉరిశిక్ష పడిన పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫీకర్ అలీ భుట్టోకు న్యాయం జరగలేదని పాకిస్తాన్ సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. 12ఏండ్ల క్రితం దేశాధ్యక్షుడు జర్దారీ చేసిన ప్రస్తావనపై విచారణ ముగించిన అనంతరం ప్రధాన న్యాయమూర్తి క్వాజి ఫాయిజ్ ఇసా మాట్లాడుతూ, ఆనాటి కేసు విచారణ సందర్భంగా ఆయనపై సక్రమంగా, పారదర్శకంగా విచారణ జరిగిందని, అనుసరించాల్సిన పద్ధతులన్నీ అనుసరించారని తాము భావించడం లేదని చెప్పారు.

1979 ఏప్రిల్ 4న రావల్పిండిలోని ఒక జైల్లో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) వ్యవస్థాపకుడైన భుట్టోను ఉరి తీశారు. రాజకీయ ప్రత్యర్థి హత్యలో ప్రధాన పాత్ర పోషించారంటూ సుప్రీం కోర్టు ఆయన్ని దోషిగా పేర్కొంది. ఆ తర్వాత రెండు మాసాలకు ఉరిశిక్ష అమలైంది. జుల్ఫీకర్ భుట్టోను సైనిక నియంత జనరల్ మహ్మద్ జియా ఉల్ హక్ అధికారం నుంచి తొలగించిన రెండేండ్ల తర్వాత ఆయనకు ఉరిశిక్ష పడింది.

భుట్టోపై నమోదైన హత్య కేసు విచారణ సక్రమంగా జరిగిందో లేదో చెప్పాలంటూ సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని జుల్ఫీకర్ భుట్టో అల్లుడు అసిఫ్ అలీ జర్దారీ 2011లో దేశాధ్యక్షుడిగా వున్న సమయంలో కోరారు. దానిపై ఏళ్ళ తరబడి సాగిన విచారణను ముగిస్తూ బుధవారం సుప్రీం ఏకగ్రీవంగా పై రూలింగ్ ఇచ్చింది. జుల్ఫీకర్ ఉరితీతను ఆనాడు దేశంలోని పలువురు న్యాయ నిపుణులు తీవ్రంగా ఖండించారు. సైనిక పాలన ఆధ్వర్యంలో ఇది జ్యుడీషియల్ హత్య అని విమర్శించారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరి నుంచి నిక్కీ హేలీ అవుట్ !

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీల అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ప్రైమరీ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓటమి పాలవడంతో నిక్కీ హేలీ ఎన్నికల బరి నుండి వైదొలగనున్నారని ఆమెకు సన్నిహితంగా వున్న వర్గాలు వెల్లడించాయి. దీంతో 2024 రిపబ్లికన్ నామినేషన్ కోసం మిగిలివున్న చివరి అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కానున్నారు. ఈ మేరకు దీనిపై ప్రకటన వెలువడే అవకాశం వుంది. అయితే ట్రంప్ అభ్యర్థిత్వాన్ని ఆమె ధృవీకరించాలనుకోవడం లేదని ఆ వర్గాలు తెలిపాయి. అందుకు బదులుగా తనకు మద్దతునందించిన మోడరేట్ రిపబ్లికన్లు, ఇండిపెండెంట్ ఓటర్ల తోడ్పాటును సంపాదించాల్సిందిగా ట్రంప్‌కు సూచిస్తారని భావిస్తున్నారు. దక్షిణ కరొలినా మాజీ గవర్నర్, ఐక్యరాజ్య సమితిలో మాజీ రాయబారి అయిన నిక్కీ హేలీ గతేడాది ఫిబ్రవరిలో ట్రంప్‌కు ప్రత్యర్థిగా బరిలోకి దిగారు. ఆమె పోటీ నుండి వైదొలగుతున్న నేపథ్యంలో మళ్ళీ బైడెన్‌తో ట్రంప్ పోటీ అవకాశాలు వున్నాయి. ఈ నెలాఖరులో ప్రకటించినున్న రిపబ్లికన్ నామినేషన్‌ను సంపాదించుకోవాలంటే దాదాపు 1215 మంది ప్రతినిధులు అవసరం. ట్రంప్ ఆ దిశగానే పయనిస్తున్నారు. అమెరికాలో రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్ మధ్య పోరు దాదాపు ఖాయమైనట్లు కనిపిస్తోంది. తాజాగా జరిగిన ఆయా పార్టీల ప్రైమరీల్లో ఇరువురు భారీ గెలుపును నమోదు చేశారు. 'సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల' పేరిట మంగళవారం 15 రాష్ట్రాలు, ఒక టెరిటరీలో ప్రైమరీ లేదా కాకస్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరుపున డొనాల్డ్ ట్రంప్ ఒక్క వెర్మాంట్ మినహా అన్ని రాష్ట్రాల్లో గెలుపొందారు. వెర్మాంట్‌లో ఆయన ప్రత్యర్థి నిక్కీ హేలీ విజయం సాధించారు. మరోవైపు డెమోక్రాటిక్ పార్టీలో అధ్యక్షుడు జో బైడెన్ మంగళవారం జరిగిన దాదాపు అన్ని ప్రైమరీల్లో గెలుపొందినట్లు సీఎన్ఎన్ వెల్లడించింది. ఒక్క సమోవా టెరిటరీలో మాత్రం జేసన్ పామర్ చేతిలో ఆయన ఓడిపోయారు. అయితే, లాంఛనంగా పార్టీ తరఫున నామినేషన్ పొందడానికి ట్రంప్ ఈ నెల 12 వరకు, బైడెన్ 19 వరకు నిరీక్షించాల్సి ఉంది.

ఎట్టకేలకు సీబీఐకి షాజహాన్ అప్పగింత

కోల్‌కతా : సందేశ్‌ఖలి దురాగతాల కేసులో నిందితుడు, టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఎట్టకేలకు బుధవారం సాయంత్రం సీబీఐ అధికారులకు అప్పగించారు. బుధవారం సాయంత్రం 4.15గంటల కల్లా ఎట్టి పరిస్థితుల్లో షాజహాన్‌ను, కేసు వివరాలను కల్‌కత్తా హైకోర్టు డెడ్‌లైన్ విధించిన నేపథ్యంలో పోలీసులు అప్పగించకతప్పలేదు. దీంతో రెండు రోజులుగా బెంగాల్ ప్రభుత్వం, సీబీఐ మధ్య కొనసాగిన హైడ్రామాకు తెరపడినట్లయింది. వాస్తవానికి ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను కలకత్తా హైకోర్టు మంగళవారమే సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే షాజహాన్‌ను మంగళవారం సాయంతం 4:30 గంటల్లోగా సీబీఐ కస్టడీకి అప్పగించాలని కూడా పశ్చిమ బెంగాల్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. దీనికి నిరాకరించిన మమతా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తాము తక్షణమే దీనిపై విచారణ జరపలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. దీంతో షాజహాన్‌ను అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారులు కోల్‌కతాలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా షాజహాన్‌ను అప్పగించేందుకు బెంగాల్ పోలీసులు నిరాకరించారు. దీంతో బుధవారం మరోసారి సీబీఐ హైకోర్టును ఆశ్రయించింది. పోలీసుల తీరును వివరించడంతో పాటు సీఐడీపై కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని కోరింది. సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి స్టే విధించకపోవడంతో బెంగాల్ పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు.. బుధవారం సాయంత్రం 4.15 గంటల కల్లా నిందితుడిని సీబీఐకి అప్పగించాల్సిందేనని ఆదేశించింది. దీంతో బుధవారం సాయంత్రం షాజహాన్‌తో పాటు కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ బెంగాల్ పోలీసులు సీబీఐకి అప్పగించారు.

చంద్రునిపై అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చైనా, రష్యా సన్నాహాలు

మాస్కో : చంద్రునిపై అణు విద్యుత్ ప్లాంట్‌ను 2033-2035 మధ్య కాలంలో ఏర్పాటు చేసే ప్రణాళికపై రష్యా, చైనాలు చర్చలు జరిపినట్లు రష్యా రోదసీ సంస్థ రాస్‌కాస్మోస్ అధినేత యూరి బొరిసొవ్ మంగళవారం ప్రకటించారు. మాస్కోలో ప్రపంచ యువజన ఉత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటోమేటికల్‌గా, రోబో సాధనాలను ఉపయోగించి ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు తెలిపారు. చంద్రునిపై పరిశోధనలకు గానూ అంతర్జాతీయ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు చైనా, రష్యాల మధ్య అవగాహనా ఒప్పందంపై 2021 మార్చిలో సంతకాలు జరిగాయి.

హాస్టల్ కాదు.. జైలే

ఆంక్షలు, నిర్బంధాల నడుమ దుర్భర జీవనం

కానరాని పారిశుధ్యం... వేధిస్తున్న అనారోగ్యం

- మహిళా కార్మికులను కట్టు బానిసలుగా చూస్తున్న 'ఫాక్స్‌కాన్'



న్యూఢిల్లీ : 2020 జనవరిలో తమిళనాడులోని ఓ చిన్న గ్రామం నుండి ఏడుగురు మహిళలు ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం చెన్నయ్ బయలు దేరారు. వారిలో 21 సంవత్సరాల రాధ కూడా ఉంది. ఆమె 12వ తరగతి వరకూ చదువుకుంది. మొబైల్ ఫోన్ల తయారీ యూనిట్‌లో పని చేసేందుకు ఒక కంపెనీ ఉద్యోగులను తీసుకుంటోందని, జీతం బాగా ఇస్తారని స్నేహితురాలు ఆమెకు చెప్పింది. అంతేకాదు ... ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని కూడా తెలిపింది. చివరికి చెన్నయ్ శివారులో ఉన్న శ్రీపెరంబదూర్‌లో రాధకు ఉద్యోగం దొరికింది.

అదో ఫ్యాక్టరీ. అందులో వందలాది మంది పని చేస్తుంటారు. వారిలో రాధ వంటి మహిళలే ఎక్కువగా ఉన్నారు. వారంతా టేబుల్స్ ముందు కూర్చొని ఐఫోన్లను అసెంబ్లింగ్ చేస్తారు. ప్రపంచంలోనే రెండో సంపన్న టెక్ కంపెనీ అయిన యాపిల్ అత్యంత ఖరీదైన ఐఫోన్లను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. వాటినే వీరంతా అసెంబ్లింగ్ చేస్తుంటారు. ఈ ఫ్యాక్టరీని తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ కంపెనీ నడుపుతోంది. ఇది ప్రపంచంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తున్న అతి పెద్ద కంపెనీ. శ్రీ పెరంబదూర్‌లో ఇదొక్కటే కాదు. ఎలక్ట్రానిక్స్, ఆటో విడి భాగాలు, రసాయనాలు తయారు చేసే 500కుపైగా కంపెనీలు ఉన్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో ఆదో పెద్ద పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందింది.

అడుగడుగునా ఆంక్షలే

ఫాక్స్‌కాన్‌లో రాధ చేరేటప్పటికి అక్కడ పదిహేను వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ప్లాంటులో పనిచేసే వారిలో 80% మంది మహిళలే. ప్రారంభం లో రాధ తన పనిని ఇంతో ఇష్టంగా చేసింది. సంపాదించిన డబ్బుతో సోదరుడి కాలేజీ ఫీజులు కట్టింది. రాధకు కంపెనీ హాస్టల్ లో వసతి కల్పించారు. అక్కడే సమస్యలు మొదలయ్యాయి. ఓ గదిలో ఐదుగురితో కలిసి రాధ ఉండేది. ఆ హాస్టల్ ఫ్యాక్టరీకి చాలా దూరం. అక్కడి భోజనం ఆమెకు రుచించేది కాదు. సౌకర్యాలు కూడా ఘోరంగా ఉండేవి.

ఫ్యాక్టరీలో సమయపాలన తప్పనిసరి. హాస్టల్‌లో ఉంటున్న వారిని సోమవారం నుండి శనివారం వరకూ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు తప్ప బయటికి అనుమతించే వారు కాదు. ఆదివారం మాత్రం ఉదయం ఏడు గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకూ తిరగవచ్చు. మిగిలిన రోజుల్లో బయటికి వెళ్లాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే.

కార్మికులపై ప్రేమతో కంపెనీ వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తోందని అనుకుంటే పొరబాటే. హాస్టల్‌లో ఉంచితే వారంతా కంపెనీ నియంత్రణలోనే ఉంటారన్న దూరాలోచనతోనే కంపెనీ ఈ వసతులు కల్పిస్తోంది. ఇది ఓ రకంగా జైలు వంటిదేనని తమిళనాడు సీఐటీయూ డిప్యూటీ సెక్రటరీ ఎస్. కన్నన్ వ్యాఖ్యానించారు. కార్మికులు ఉండే హాస్టల్‌లో ఇతరులు ప్రవేశించడం దాదాపు అసంభవం. పెద్ద ఎత్తున సిబ్బంది కాపలా కాస్తుంటారు. హక్కుల కార్యకర్తలు వెళ్లాలన్నా కష్టమే. మీడియాతో మాట్లాడవద్దని కార్మికులపై ఆంక్షలు విధిస్తారు.

నిబంధనలు బేఖాతరు

కేవలం అసెంబ్లింగ్‌కే కార్మికులు పరిమితం కావడంతో ఇతర రకాల నైపుణ్యాలు లభించడం లేదు. పదోన్నతులు తక్కువగా ఉంటాయి.కంపెనీలో పని చేసినంత కాలం తమకు భవిష్యత్తు ఉండదని పలువురు కార్మికులు పెదవి విరిచారు. అప్పులు తీర్చడానికో,పెళ్లి ఖర్చులకో విధిలేక అనేక మంది పనులకుహాజరవుతున్నారు. ఇళ్లకు వెళ్లేందుకు కూడా కార్మికులను అనుమతించరు. అత్యవసర పరిస్థితుల్లో సైతం రెండు రోజులకు మించి సెలవు ఇవ్వరు. కార్మికుల ప్రయోజనాల కోసం తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న నియమ నిబంధనలను ఫాక్స్‌కాన్ ఖాతరు చేయడం లేదు. పర్మినెంట్ ఉద్యోగం అనే మాటే అక్కడ వినపడదు. ఉద్యోగులతో 11 నెలలు పని చేయించుకొని, ఒక నెల విరామం ఇచ్చి, మళ్లీ పనిలోకి తీసుకుంటారు. దీంతో వారు అనేక ప్రయోజనాలు కోల్పోతున్నారు.

పని ఒత్తిడి..అనారోగ్యం

ఫ్యాక్టరీలో ఎనిమిదిగంటలు పని చేయాల్సి ఉండగా అధికారులు తరచూ షిఫ్టులు మారు స్తారు. దీనివల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడు తున్నారు. అసెంబ్లీ లైన్ ముందు గంటల తరబడి కూర్చొని ఫోన్లలో నట్లు బిగించాల్సి ఉంటుంది. వేర్వేరు విడిభాగాలను అసెంబ్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో ఉద్యోగి రోజుకు ఐదు వందల ఫోన్లపై పని చేయాలి. దీంతో నిరంతరం పని ఒత్తిడి తప్పడం లేదు. గంటల తరబడి ఒంగి పని చేయాల్సి రావడంతో వెన్ను నెప్పి, మెడ నొప్పి సర్వసాధారణమై పోయాయి. జుట్టు ఊడిపోతోంది. పని మధ్యలో 45 నిమిషాల విరామం లభిస్తుంది. భోజనం చేయాలన్నా ,రెస్ట్‌రూముకు వెళ్లాల న్నా అప్పుడే. ఒకవేళ మధ్యలో పని వదిలేసి వెళితే ఆ తర్వాత ఒత్తిడి అధికమవుతుంది. పని మధ్యలో టాయిలెట్‌కు వెళితే సూపర్ వైజర్లనుంచి ఛీత్కారాలు ఎదురవుతాయి.

సోనీతో ప్రారంభించి...

ఫాక్స్‌కాన్ కంపెనీ 2015లో మన దేశంలో ప్రవేశించింది. తొలుత సోనీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని పనిచేసింది. ఆ తర్వాత ఇతర కంపెనీలతో సంబంధాలు కొనసాగించింది. అదానీ గ్రూప్, జియోనీ కంపెనీ ఉత్పత్తులను మన దేశంలో తయారు చేసింది. ఆ తర్వాత యాపిల్ కోసం ఐఫోన్ల తయారీని ప్రారంభించింది. ఈ కంపెనీలో పనిచేసే వారిలో చాలా మంది శ్రీపెరంబదూర్‌కు చెందిన వారు కాదు. ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వారే. ఎనిమిది వేల మంది పనిచేస్తున్న నోకియా కంపెనీ కానీ, 10,000-12,000 మంది పనిచేస్తున్న ఇతర కంపెనీలు కానీ హాస్టళ్లను ప్రారంభించలేదు. ఒక్క ఫాక్స్‌కాన్ మాత్రమే ఆ పని చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఫాక్స్‌కాన్ ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టింది. 18-23 సంవత్సరాల మధ్య వయసున్న యువతులను ఎలక్ట్రానిక్స్ పనివారిగా చేర్చుకొని వారితో వెట్టి చాకిరీ చేయిస్తోంది. తక్కువ వేతనాలు ఇచ్చినా వారు నోరు మెదపరు. పైగా మహిళలైతే ఇలాంటి పనులను శ్రద్ధతో చేస్తారు.

శ్రీపెరంబదూర్‌లో కార్మికుల కోసం కాంట్రాక్ట్ సంస్థలు, ఫాక్స్‌కాన్ కంపెనీ డార్మెటరీ ఏర్పాట్లు చేశాయి. హాస్టల్‌ను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. హాస్టల్‌లో ఉంటున్న మహిళలు గతంలో ఎన్నడూ కుటుంబాన్ని వదిలి ఉండలేదు. జీవనోపాధి కోసం వారంతా బయటికి రావాల్సి వస్తోంది.

పరిస్థితులు అధ్వానం

శ్రీపెరంబదూర్‌లో గతంలో ఇంజినీరింగ్ కళాశాలలు ఉండేవి. కానీ అవి గత కొన్ని సంవత్సరాల్లో మూత పడ్డాయి. ఇప్పుడు వాటినే డార్మెటరీలుగా ఉపయోగిస్తు న్నారు. ఇవి ఫ్యాక్టరీకి చాలా దూరంలో ఉంటాయి. అక్కడికి వెళ్లాలంటే గంటకు పైగా సమయం పడుతుంది. హాస్టల్ లో ఉండే వారి పరిస్థితి నరకాన్ని తలపిస్తోంది. ఫ్యాక్టరీలో పనిగంటలు ముగిసిన తర్వాత వారు హాస్టల్‌కే పరిమితం కావాల్సి వస్తోంది. స్థానికులతో కానీ, పురుష కార్మికులతో కానీ మాట్లాడకూడదు. హాస్టల్‌లో పెట్టే ఆహారం దారుణంగా ఉంటుందని రాధ చెప్పింది. ఉడికీఉడకని భోజనం ఏ మాత్రం రుచిగా ఉండదని వాపోయింది. వారానికి ఒక రోజు మాత్రం మాంసాహారం పెడతారు. గుడ్లు కూడా ఇవ్వరు. ఇక మరుగుదొడ్ల సంగతి చెప్పనక్కరలేదు. అవి అపరిశుభ్రతకు నిలయంగా ఉంటాయి. హాస్టల్‌లో నివసించే వారంతా తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే ఉప యోగించుకోవాల్సి వస్తోంది. డార్మెటరీలలో నీటి సౌకర్యం కూడా సరిగా ఉండదు. నీటిని వదిలే వరకూ కార్మికులు ఎదురు చూడాల్సిందే. అది కూడా అందరికీ సరిపోదు. స్నానప గదులు, మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి అవసరమైన నీరు కూడా దొరకదు. కొందరు మహిళా కార్మి కులు ఫ్యాక్టరీకి వెళ్లిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకుంటా రు. అపరిశుభ్ర వాతావరణం, పారిశుధ్య లోపం కారణంగా మహిళా కార్మికులు తరచుగా అనారోగ్యానికి గురవుతు న్నారు. 2021లో ఫుడ్ పాయిజ నింగ్ కారణంగా 250 మందికి పైగా కార్మికులు ఆస్పత్రి పాలయ్యారు. దీనిపై ఆగ్రహించిన ఫ్యాక్టరీ కార్మికులు చెన్నయ్-బెంగళూరు రహదారిపై బైఠాయించి, ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని వారంతా ఫిర్యాదు చేశారు. కార్మికుల నిరసన తర్వాత కొద్ది రోజులు ఫ్యాక్టరీని మూసేశారు. పరిస్థితిని చక్కదిద్దుతామని అధికారులు హామీ ఇవ్వడంతో తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాలేదని కొందరు మహిళా కార్మికులు తెలిపారు. హాస్టల్ జీవితంతో విసిగి వేసారిపోయిన కొందరు మహిళా కార్మికులు వేరేగా ఇళ్లను అద్దెకు తీసుకొని ఉంటున్నారు.

పాలేరు పాతకాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలి

- ఒక్క తడికి నీళ్లిచ్చినా వేల ఎకరాల వరి పంట చేతికి అందుతుంది
- ఎండిన పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం అందించాలి
- జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా.. నీరు రావడం లేదు : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు



నవతెలంగాణ -కూసుమంచి

పాలేరు రిజర్వాయర్ పాత కాలువ పరిధిలో నీళ్ల లేక వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే పాత కాలువకు నీటిని విడుదల చేసి, పొట్ట దశలో ఉన్న పంటలను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే నీళ్ళు లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మల్లేపల్లి, జక్కేపల్లి, పెరిక సింగారం గ్రామాల్లో పాత కాలువ ద్వారా నీళ్ల అందక ఎండిన పొలాలను, ఎండిన కాలువ, వాగులను రైతు సంఘం నాయకులు, ఆయకట్టు రైతులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెరిక సింగారం గ్రామంలోని ఎండిన పొలాల దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు పాత కాలువకు నీళ్లు వస్తాయన్న ఆశతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు పదివేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని, ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయన్నారు. ఆయకట్టు పరిధిలో రైతులు ఒక్కొక్క ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టినా నీరు అందక ఇప్పటికే కొన్ని వేల ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండుతున్న పంటల్లో పశువులను మేపుతున్నారని వాపోయారు. ప్రస్తుతం పాలేరు జలాశయం నీటిమట్టం 11 అడుగులుగా ఉందని, గతంలో 9 అడుగులు నీళ్ళున్నా పాత కాలువకు నీరు అందించి రైతన్నలను ఆదుకున్నారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా నీళ్ల విడుదల చేయకుండా పంటలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు స్పందించి పాత కాలువ పరిధిలోని పంటలకు నీటిని విడుదల చేసి రక్షించాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయకట్టు రైతులు కలిసినప్పుడు తేదీల వారిగా చెప్పండి, నీళ్ల పంటలకు అందిస్తానని హామీ ఇచ్చారని, నేడు నీళ్ల లేవంటూ రైతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

ఇప్పటికే నీళ్ల లేక ఎండిపోయిన వరి పొలాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు యడవల్లి రమణారెడ్డి, శీలం గురుమూర్తి, మల్లెల సన్మతరావు, ముకుంద రెడ్డి, మండల నాయకులు మూడు గన్యా నాయక్, కర్ణ బాబు, పందిరి వీరారెడ్డి, మల్లేపల్లి సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి చీలంచర్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

దేవాలయాలకు నిధులు విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల నిర్వహణకు "స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఫర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్" పథకం కింద ప్రభుత్వం దేవాలయాలకు నిధులను విడుదల చేసింది. మెదక్ జిల్లా నాగసాని పల్లి ఏడుపాయల వన దుర్గామాత దేవాలయానికి రూ. 2 కోట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయానికి రూ. ఒక కోటిని ప్రభుత్వం విడుదల చేసింది.

11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం

- ఈ ఏడాది 4.50 లక్షల గృహాల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం : మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇండ్లు లేని పేదవారి కోసం రాష్ట్రంలో ఈ ఏడాది 4.50 లక్షల ఇండ్లను నిర్మించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు వెల్లడించారు. బుధవారంహైదరాబాద్‌లోని సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి చర్చించారు. హామీలు ఇవ్వడమే కాదు ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో అమలు చేయడమే ఇందిరమ్మ రాజ్యమన్నారు. 'పేదవారికి సొంత ఇల్లు ఒక కల... అది నెరవేరితే పేదవాడి ఇంట పండుగే' అని అన్నారు. నిరుపేదలకు నిలువ నీడను కల్పించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని వ్యాఖ్యానించారు. తొమ్మిదిన్నరేండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన గత పాలకులు ఆ కర్తవ్యాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను, ఆశలను గత ప్రభుత్వం వారి రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సహాయం అందించేందుకు అవసరమైన కార్యచరణను ప్రారంభించిందని తెలిపారు. తొలి విడతగా ఈ సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు. తొలి విడతలో సొంత స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నామని తెలిపారు. 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా ఇండ్లను నిర్మించాలనీ, హాలు, బెడ్ రూమ్‌తోపాటు వంటగది, బాత్‌రూమ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళల పేరుపై ఇండ్లను మంజూరు చేస్తామనీ, ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్దిదారులను ఎంపి చేస్తామని వివరించారు. ఇందుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. పేదవారి సొంతింటి కల సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు సాకారం కాబోతున్నదని సంతోషం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌పై సమగ్ర విచారణ జరపాలి

- బండి సుధాకర్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కేసీఆర్‌పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీనియర్ నేత తుమ్మేటి సమ్మిరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారన్న సంగతి తెలుసుకుని వారు పార్టీ నుంచి వెళ్లిపోతారనే భయంతోనే, నిస్సహాయ పరిస్థితుల్లోనే కేసీఆర్ పైపైకి బీరాలు పలుకుతున్నాడని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని మాజీ సీఎం కేసీఆర్ మరిచిపోతే ఎలా? అని ఆయన ప్రశ్నించారు.ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి మెజార్టీతో ఏర్పాటై, ప్రజారంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని గుర్తు చేశారు. అయితే, కేసీఆర్ ఇంకా తానే సీఎం అనే భ్రమల్లో ఉన్నారని, తమ కుటుంబం అక్రమంగా సంపాదించిన డబ్బుతో కేసీఆర్ ఓ సినిమా తీసి, అందులోనైతే తానే సీఎం పాత్రలో నటించవచ్చు కదా? అని ఎద్దేవా చేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- హస్తం గూటికి కోనప్ప..!
- సీఎం రేవంత్‌తో భేటీ.. త్వరలో చేరిక
- అదే బాటలో ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిణామాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇన్నాండ్లు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న నాయకులు తాజాగా పార్టీని వీడేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశ మవుతోంది. సిర్పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలోనే హస్తం కండువా కప్పుకొంటారని, ఇందుకు తేదీ ఖరారు చేస్తారని తెలిసింది.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలవడం.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయాలని ఒక నిర్ణయానికి వచ్చిన విషయం తెలిసిందే. సిర్పూర్‌లో తన ఓటమికి కారణమైన ఆర్ఎస్పీతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భేటీ కావడం, పొత్తు పెట్టుకుంటామని చెప్పడం నచ్చకనే కోనప్ప పార్టీని వీడాలని నిర్ణయిం చుకున్నట్టు తెలిసింది. ఆయనతో పాటు పలువురు కీలక నాయకులు సైతం గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరే తేదీని ఖరారు చేస్తారని తెలిసింది. మరోపక్క అదే బాటలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ కండువా కప్పు కునేందుకు సిద్ధమైనట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిపోగా.. ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్‌కు చెందిన మరికొందరు కీలక నాయకులు సైతం హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏమి నిర్ణయం తీసుకుంటారనేది ఆ పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది.

మా దీక్షకు అనుమతివ్వండి

- డీజీపీకి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో నెంబర్ 3కు సంబంధించి భారత జాగృతి ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించ తలపెట్టిన దీక్షకు అనుమతివ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనతో ఫోన్‌లో మాట్లాడిన కవిత జీవో 3 వల్ల మహిళలకు తీవ్ర అన్యాయం జరగనుందని తెలిపారు.

బిజినెస్

74వేల మార్క్‌కు సెన్సెక్స్

- నూతన గరిష్టాలకు సూచీలు
- బ్యాంకింగ్ షేర్ల మద్దతు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన రికార్డ్‌లను చేరాయి. కొనుగోళ్ల మద్దతుతో తొలిసారి సెన్సెక్స్ 74వేల పాయింట్ల మార్క్‌ను దాటగా.. నిఫ్టీ 22,400 దాటేసింది. క్రితం సెషన్‌తో పోలిస్తే బుధవారం ఉదయం స్టాక్ మార్కెట్లు నష్టాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత కొద్ది సేపటికి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్, విత్త షేర్లు పరుగులు పెట్టాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 409 పాయింట్లు లేదా 0.55 శాతం పెరిగి 74,086 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 118 పాయింట్లు లేదా 0.53 శాతం లాభపడి 22,474కు చేరింది. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలతో ఉదయం 73,587.70 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 73,321 కనిష్టానికి చేరింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 74,151, నిఫ్టీ 22,497 గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యాయి.

కొటాక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండుస్ఇండ్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, టైటన్, టిసిఎస్ తదితర స్టాక్స్ 2.45 శాతం మేర పెరిగి మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.65 శాతం, 1.9 శాతం నష్టాలను చవి చూశాయి. నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 0.8 శాతం, ఫైనాన్సియల్ సూచీ 0.6 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు లోహ సూచీ 2.5 శాతం, రియాల్టీ 1.3 శాతం చొప్పున నష్టపోయాయి.

భెల్‌కు ఎన్‌టిపిసి భారీ ఆర్డర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టిపిసి నుంచి భారీ ఆర్డర్ దక్కింది. ఉత్తర ప్రదేశ్‌లోని సింగ్రోలి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (స్టేజ్-2) 1,600 మెగావాట్ యూనిట్‌ను నెలకొల్పాల్సి ఉంటుందని రెగ్యులేటరీ సంస్థలకు భెల్ తెలిపింది. ఈ కాంట్రాక్ట్ విలువకు జిఎస్‌టి అదనమని పేర్కొంది. స్టేజ్-3లోనూ రెండు 800 మెగావాట్ కలిగిన రెండు యూనిట్ల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. 54 నెలల్లో వీటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

త్వరలో బజాజ్ నుంచి సిఎన్‌జి బైక్

న్యూఢిల్లీ : ప్రముఖ వాహనాల తయారీ సంస్థ బజాజ్ ఆటో వచ్చే త్రైమాసికం ముగింపు నాటికి సిఎన్‌జి బైక్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ప్రపంచంలోనే తొలిసారిగా సిఎన్‌జితో నడిచే ద్విచక్ర వాహనాన్ని తీసుకురానున్నామని బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ వెల్లడించారు. 2025 నాటికి దీన్ని తీసుకొస్తారని తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. ముందుగానే తీసుకురావడం విశేషం. పెట్రోల్ బైక్‌తో పోలిస్తే కాస్త ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

భారత్ నుంచి స్విస్‌కు ఆరు లక్షల పర్యాటకులు




హైదరాబాద్ : గతేడాది భారత్ నుంచి స్విట్జర్లాండ్‌కు ఆరు లక్షల మంది పర్యాటకులు వచ్చారని స్విట్జర్లాండ్ టూరిజం ఈస్ట్ మార్కెట్స్ చీఫ్ మార్కెట్ ఆఫీసర్ సిమోన్ బాషాట్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఇండియా హెడ్ రితూ శర్మతో కలిసి సిమోన్ విలేకరులతో మాట్లాడుతూ.. భారతీయ పర్యాటకులకు ఏడాది పొడవునా పర్యాటక గమ్యస్థానంగా ఉందన్నారు. కరోనాకు ముందు 8 లక్షల మంది పర్యాటకులు వచ్చే వారని తెలిపారు. ఈ ఏడాది ఆ స్థాయికి చేరుకోగలమని సిమోన్ విశ్వాసం వ్యక్తం చేశారు. చలికాలంలో ఎక్కువ మంది తమ దేశానికి వస్తారని తెలిపారు. భారత్ నుంచి వచ్చే పర్యాటకుల్లో తెలుగు రాష్ట్రాల వారి వాటా 4.8 శాతంగా ఉందన్నారు. మహారాష్ట్ర, గోవా నుంచి అత్యధికంగా 29.4 శాతం మంది స్విస్‌కు వస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉందన్నారు. రోజుకు సగటున రూ.30వేలు (310 సిహెచ్‌ఎఫ్) వ్యయం అవుతుందన్నారు. కరోనా తర్వాత భారత్ నుండి ఎక్కువ మంది వినూత్న అనుభవాలను కోరుకుంటున్న ప్రయాణికులను తాము చూస్తున్నామన్నారు. స్విస్‌లో ఒక ప్రయాణ పాస్‌తో 90కి పైగా నగరాలు, పట్టణాల్లో తిరగవచ్చున్నారు. స్విట్జర్లాండ్ టూరిజం తన ప్రచార రాయబారిగా నీరజ్ చోప్రాతో ఒప్పందం కుదుర్చుకుందని రితూ శర్మ తెలిపారు.

రోష్ నుంచి వాబైస్మో ఇంజెక్షన్

- కంటి వ్యాధుల చికిత్స కోసం..

హైదరాబాద్ : రోష్ ఫార్మా ఇండియా కొన్ని రకాల కంటి వ్యాధుల చికిత్స కోసం వాబైస్మో (పారిసిమాబ్)ను ఆవిష్కరించింది. దీన్ని భారత్‌లోనూ అందుబాటులోకి తెచ్చామని రోష్ ఫార్మా ఇండియా సిఇఒ, ఎండి వి సింప్సన్ ఎమ్మాన్యూల్ తెలిపారు. 2022 జనవరిలోనే వాబైస్మోకు యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటి వరకు 20 లక్షల డోసులను సరఫరా చేశామన్నారు. నియోవాస్కులర్ లేదా వెట్ ఏజ్-రిలేటెడ్ మాక్యులర్ డిజెనరేషన్ (ఎన్ఎఎండి) డయాబెటిక్ మాక్యులర్ ఎడెమా (డిఎంఇ) అనే కంటి వ్యాధుల చికిత్స కోసం ఈ ఇంజెక్షన్‌ను వాడుతారని తెలిపారు. దీనిని భారత్‌లోనే ఉత్పత్తి చేస్తున్నామన్నారు. కాగా దీని ధరను వెల్లడించడానికి ఆయన ఆసక్తి చూపలేదు.

హిల్టన్ మెటల్‌కు రూ.42 కోట్ల ఆదాయం



ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 44 శాతం వృద్ధితో రూ.42 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసినట్లు హిల్టన్ మెటల్ ఫోర్జింగ్ తెలిపింది. సంస్థ నికర లాభాలు 68 శాతం పెరిగి రూ.2.1 కోట్లుగా చోటు చేసుకున్నట్లు పేర్కొంది. 2023-24 తొలి తొమ్మిది మాసాల్లో సంస్థ నికర లాభాలు 82 శాతం పెరిగి రూ.6.14 కోట్లుగా, ఆదాయం 41 శాతం వృద్ధితో రూ.105 కోట్లుగా నమోదయ్యిందని తెలిపింది.

స్టార్ హెల్త్ కోటి క్లయిమ్‌ల పరిష్కారం

న్యూఢిల్లీ : ప్రముఖ రిటైల్ బీమా కంపెనీ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ 2006లో నుంచి ఇప్పటి వరకు ఒక్క కోటి పైగా క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా నగదు రహిత, రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను కవర్ చేస్తూ రూ.44,000 పైగా కోట్లకు క్లెయిమ్ చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ఇది వినియోగదారులకు కంపెనీ ఇస్తున్న ప్రాధాన్యతకు, కంపెనీపై ఉంచిన నమ్మకాన్ని ఈ మైలురాయి ప్రతిబింబిస్తుందని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండి, సిఇఒ ఆనంద్ రాయ్ పేర్కొన్నారు.

11న సామ్‌సంగ్ గెలాక్సీ ఎ సిరీస్ విడుదల

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తన స్మార్ట్‌ఫోన్ విభాగం పోర్టుపోలియోను పెంచుతోంది. మార్చి 11న తన గెలాక్సీ కొత్త ఎ సిరీస్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. తాము ప్రవేశపెట్టనున్న ఈ కొత్త ఉత్పత్తులు వినియోగదారుల అనుభవాన్ని మరింత గొప్పగా మార్చనున్నాయని సామ్‌సంగ్ తెలిపింది.

షెడ్యూలుకు ముందే...

జమిలి ఎన్నికలపై ఈ వారంలోనే లా కమిషన్ నివేదిక ?



- ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాలి
- రాజ్యాంగంలో నూతన ఛాప్టర్‌ను రూపొందించాలి

న్యూఢిల్లీ : దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. వాటి కోసం రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలు పెట్టాయి. ప్రచార పర్వం కూడా ప్రారంభమైంది. వివిధ పార్టీలు అభ్యర్థుల జాబితాలను ప్రకటించడంలో తలమునకలై పోయాయి. మ్యానిఫెస్టోలు, అజెండాలు కూడా సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ముందే జమిలి ఎన్నికలపై 22వ లా కమిషన్ తన తుది నివేదికను ఈ వారంలోనే న్యాయ శాఖకు సమర్పించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఫలితంగా దీనిపై దేశంలో చర్చోపచర్చలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంలో సాధ్యాసాధ్యాలపై లా కమిషన్ తన నివేదికను సమర్పించాల్సి ఉంది. ఈ నెల మూడో వారంలో ఎన్నికల కమిషన్ షెడ్యూలును ప్రకటించవచ్చు. ఈ నేపథ్యంలో దానికి ముందే...ఈ వారంలోనే లా కమిషన్ నివేదికను సమర్పిస్తుందని కేంద్ర న్యాయ శాఖ వర్గాలు తెలిపాయి.

2029లో దేశంలో పూర్తి స్థాయిలో జమిలి ఎన్నికల నిర్వహణ కోసం జస్టిస్ రితురాజ్ అవస్థి నేతృత్వంలోని లా కమిషన్ పలు రాజ్యాంగ సవరణలు సూచించింది. 1951వ సంవత్సరం నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు జమిలి ఎన్నికల నిర్వహణ, ఉమ్మడి ఓటర్ల జాబితా తయారీ కోసం రాజ్యాంగంలో నూతన ఛాప్టర్‌ను రూపొందించాలని సిఫార్సు చేసింది. లా కమిషన్ చేసిన పలు సిఫార్సులను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించినట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల నిర్వహణకు కూడా సుముఖత వ్యక్తం చేసిందని సమాచారం.

రాజ్యాంగ సవరణ ద్వారా పార్ట్15-ఏ పేరిట కొత్త ఛాప్టర్‌ను ప్రవేశపెట్టాలని లా కమిషన్ సూచించింది. ప్రస్తుతం రాజ్యాంగంలోని పార్ట్ 15లో ఎన్నికల నిర్వహణ గురించి వివరించారు. నూతన ఛాప్టర్‌లో మూడంచెల జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు ఉంటాయి. 'సమకాలీకరించిన ఎన్నికలు', 'జమిలి ఎన్నికల స్థిరత్వం', 'ఉమ్మడి ఓటర్ల జాబితా' అనే అంశాలకు సంబంధించిన వివరాలను ఈ ఛాప్టర్‌లో పొందుపరుస్తారు.

లా కమిషన్ ఏం చెప్పిందంటే...

ఒకవేళ అవిశ్వాస తీర్మానం కారణంగా ప్రభుత్వం పతనమైనా లేక సభలో హంగ్ ఏర్పడినా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో 'యూనిటీ ప్రభుత్వా'న్ని ఏర్పాటు చేయాలని లా కమిషన్ సూచించింది. ఒకవేళ యూనిటీ ప్రభుత్వ ఫార్ములా విఫలమైతే సభలో మిగిలిన కాలానికి తాజాగా ఎన్నికలు జరపాలని అభిప్రాయపడింది. ఉమ్మడి ఓటర్ల జాబితా కోసం రాజ్యాంగాన్ని సవరించాలని కూడా ప్రతిపాదించింది.

21వ లా కమిషన్ నివేదికలో ఏముంది?

21వ లా కమిషన్ నివేదికకు అనుగుణంగానే ఈ సిఫార్సులు ఉన్నాయి. జమిలి ఎన్నికలు జరిపితే ప్రజా ధనం ఆదా అవుతుందని, అయితే ప్రస్తుతం అమలులో ఉన్న రాజ్యాంగ నిబంధనలకు లోబడి జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని 21వ లా కమిషన్ అభిప్రాయపడింది. 'హంగ్ పార్లమెంట్ లేదా హంగ్ అసెంబ్లీ ఏర్పడితే రాష్ట్రపతి కానీ లేదా గవర్నర్ కానీ అతి పెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించవచ్చు. ఎన్నికలకు ముందు లేదా తర్వాత పొత్తులు పెట్టుకునే కూటములనూ ఆహ్వానించవచ్చు. అప్పటికి కూడా ప్రభుత్వం ఏర్పడకపోతే రాష్ట్రపతి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. అన్ని ప్రయత్నాలు విఫలమైతే మధ్యంతర ఎన్నికలు జరపాల్సి ఉంటుంది' అని తెలిపింది.

ఆన్‌లైన్‌లోనే హెచ్‌టి లైన్లు, సర్వీసులు

- విద్యుత్ వినియోగదారులకు పారదర్శకంగా సేవలు
- పోర్టల్ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ వినియోగదారులకు వేగవంతమైన పారదర్శక సేవల్ని అందించేందుకు సాధ్యమైనన్ని సేవల్ని ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హెచ్‌టీ లైన్ల తరలింపు, విద్యుత్ పంపిణి సంస్థలు, ట్రాన్స్‌కోల మధ్య కార్యకలపాలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వస్తాయని వివరించారు. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను బుదవారం హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ పోర్టల్ ద్వారా వినియోగదారులు ఇంటి నుంచే విద్యుత్ సేవలు పొందవచ్చని తెలిపారు. ఈహెచ్‌టి (132, 220, 400 కేవీ కొత్త సర్వీసులు, 11 కేవీ / 33 కేవీ కొత్త సర్వీసులు, ఈహెచ్‌టి/ హెచ్‌టి సర్వీసుల దారి మళ్లింపుల కోసం గతంలో మాదిరి కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, నిర్దిత సమయంలోగా విద్యుత్ అధికారులు సేవలు అందించేలా సాఫ్ట్‌వేర్ రూపకల్పన జరిగిందన్నారు. ఈ సేవల కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వినియోగదారుడు తన పనికి సంబంధించిన ట్రాక్‌ను కచ్చితత్వంతో పొందే వీలుందని తెలిపారు. www.tstransco.in, www.tssouthernpower.com, www.tsnpdcl.in ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా ఈ సేవలు పొందవచ్చని వివరించారు.

ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన టీఎస్ఎస్పీడీసీఎల్ ఐటీ విభాగం అధికారులు వట్టికొండ శివాజీ (సీజీఎం), బండారి మురళీకృష్ణ, పీఏ జ్యోతిర్మయి, సీహెచ్ రమశ్రీ, పీ ఆశోక్, డీ రాధిక, కే రఘు కిరణ్, ఈ. లక్ష్మీనారాయణ, సాయికిరణ్, ట్రాన్స్‌కో ఎస్.ఈ రాజ్యలక్ష్మి తదితరుల్ని ఉప ముఖ్యమంత్రి అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీ, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ తదితరులు పాల్గొన్నారు.

'సంపూర్ణ సుకన్య సమృద్ధి గ్రామం' గా చీర్యాల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కీసర మండలంలోని చీర్యాల గ్రామానికి అరుదైన గుర్తింపు లభించింది. 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సుకన్య సమృద్ధి పోస్టల్ ఖాతాల్లో ఈ గ్రామం వందశాతం పురోగతిని సాధించింది. 15 ఏండ్లలోపు బాలికల పేరుపై 15 సంవత్సరాల వరకు నెలకు రూ.250 చొప్పున పోస్టాఫీసు ఖాతాలో జమచేస్తే, మెచ్యూరిటీ సమయానికి పెద్దమొత్తంలో వారికి నగదును అందిస్తారు. వివాహం, ఉన్నత చదువుల సమయానికి ఈ సొమ్ము వారికి అందుతుంది. బాలికా సంవృద్ధికి ఉపయోగపడే ఈ స్కీంను చీర్యాల గ్రామంలో ప్రముఖ న్యాయవాదులు సీవీఎల్ నర్సింహారావు, సీవీ అనూరాధ ప్రచారం చేశారు. గ్రామం మొత్తంలో అర్హులైన 256 మంది బాలికలతో వారు ఖాతాలు తెరిపించారు. దానిలో వంద మంది బాలికల తరఫున వారే డబ్బులు చెల్లించారు. ఈ సందర్భంగా బుధవారం చీర్యాలలో పోస్టల్‌శాఖ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. న్యాయవాదుల్ని పోస్టల్ అధికారులు అభినందించారు. గ్రామస్తుల చొరవను ప్రసంసించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఏ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భూక్యా వెంకన్న, శ్రీమతి కే విష్ణు జ్యోతి, కీసర సబ్‌పోస్ట్‌మాస్టర్ బీ హేమంత్‌కుమార్, చీర్యాల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ శ్రీమతి నితిషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా బాలికలకు పాస్ పుస్తకాలు అందచేశారు.

ప్రణీత్ ఫోన్ ట్యాపింగ్ ఉదంతంపై లోతుగా దర్యాప్తు

- దీనిపై ఎస్ఐబీ ఐజీతో డీజీపీ సమీక్ష
- వెనకున్న హస్తాలపై ఆరా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో తాజాగా వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీనియర్ పోలీసు అధికారులు లోతుగా దర్యాప్తును సాగిస్తున్నారు. ఈ ఉదంతంపై ఇప్పటికే యాంటీ నక్సలైట్ విభాగం ఎస్ఐబీలో గతంలో పని చేసిన డీఎస్పీ ప్రణీత్‌రావును ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీలో ఉంటూ ప్రణీత్‌రావు.. అప్పటి ప్రతిపక్ష నాయకులతో పాటు కొందరు ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రణీత్‌రావు ఎస్ఐబీలోని తన కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను, హార్డ్ డిస్క్‌లను, కమ్యూనికేషన్ పరికరాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్టు ఇప్పటికే సీనియర్ పోలీసు అధికారులు గుర్తించారు. అయితే, ప్రణీత్‌రావుకు ఈ విధంగా ఫోన్ ట్యాపింగ్ అసైన్‌మెంట్‌ను ఇచ్చిందెవరు? అనే అంశం మొదలుకొని.. చివరకు కార్యాలయంలో ఉన్న రికార్డులను, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయటం వరకు ఎవరి ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు వ్యవహరించారనే వరకు నిజాలను వెలికి తీయటానికి అధికారులు సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా, ఈ అంతర్గత విచారణ చివరకు అప్పటి ఎస్ఐబీ ఉన్నతాధికారుల్లో ఎవరి తలకు చుట్టుకుంటుందోననే ఉత్కంఠ ఇటు పోలీసు, అటు రాజకీయ వర్గాల్లో చోటు చేసుకున్నది. కేవలం పోలీసు ఉన్నతాధికారుల వరకే ఇది పరిమితమవుతుందా? లేక అప్పటి పొలిటికల్ బాస్‌లలో ఎవరిని చుట్టుకుంటుందోననే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతిలు బుధవారం సమావేశమై ఈ అంశంపై సమీక్ష జరిపినట్టు తెలుస్తున్నది. మొత్తమ్మీద, ప్రణీత్‌రావును విచారించి ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో అతనికి సహకరించిన అదృశ్య హస్తాలు ఏమిటనేది తేల్చటానికి అధికారులు నడుం బిగించినట్టు సమాచారం. ముఖ్యంగా, ఎస్ఐబీకి చెందిన అప్పటి కొందరు సీనియర్ అధికారుల పాత్ర పైనా ఆరా నిశితంగా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా డీజీపీ రవి గుప్తా.. 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ.. ఎస్ఐబీలో చోటు చేసుకున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు సాగుతున్నదనీ, విచారణ క్రమంలో తేలే నిజాలను బట్టి.. సంబంధితులపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద విమర్శించారు. ఇందుకు సంబంధించి బుధవారం తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలు విజయవంతమయ్యాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివేకానంద మాట్లాడుతూ ఎల్ ఆర్ఎస్ కు ఫీజులు వసూలు చేయకుండా ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ను తీసుకొస్తున్న ప్రభుత్వం మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీంను కూడా తీసుకొస్తుందా అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ తన పదవిని కాపాడుకునేందుకు ప్రధాని మోడీని పొగుడుతున్నారంటూ విమర్శించారు.

మేడారం జాతర ఆదాయం రూ.13 కోట్లు

నవతెలంగాణ- హన్మకొండ



తెలంగాణ గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ హుండీ ఆదాయం రూ.13 కోట్లకు పైగా చేరింది.

హన్మకొండ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కళ్యాణ మండపంలో జరుగుతున్న జాతర హుండీల ఆదాయం బుధవారం ముగిసింది. ఈ లెక్కింపులో రూ.12,84,94,482 కరెన్సీ రాగా రూ.40,28,029 నగదు వచ్చాయి.

అలాగే బంగారం 779 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు, వెండి 55 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకు వచ్చాయి. విదేశీ 308 డాలర్లు (ఆరు దేశాల నుంచి) నగదు వచ్చినట్టు ఈవో రాజేందర్ తెలిపారు.

ఏసీబీ ప్రతిష్టను పెంచుదాం

- అధికారులకు డీజీ ఆనంద్ పిలుపు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతిష్టను మరింతగా పెంచేలా చిత్తశుద్ధితో కృషి సాగించాలని ఆ విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ) సి.వి ఆనంద్ తమ అధికారులకు పిలుపునిచ్చారు. ఏసీబీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ అధికారులకు ప్రకటించిన వివిధ సేవా పతకాలను ఆయన ప్రదానం చేశారు. అలాగే, ఏసీబీలో పని చేస్తూ పదవీ విరమణ చేసిన కొందరు అధికారులు, సిబ్బందికి ఆయన సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడే అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా ఏసీబీ చర్యలుండాలని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వాధికారులు నీతి, నిజాయితీతో పని చేసి ప్రజలకు సేవ చేస్తారనే ఆకాంక్షతో ప్రజలుంటారనీ, వారి ఆశలను వమ్ము చేసే అవినీతి అధికారులకు చెక్ పెట్టే విధంగా ఏసీబీ అధికారులు వ్యవహరించాలని ఆయన తెలిపారు. అలాగే, విధి నిర్వహణలో క్రమశిక్షణగా వ్యవహరిస్తూ గోప్యతను పాటించాలని సూచించారు. పట్టుబడ్డ అవినీతి అధికారులకు కోర్టులలో శిక్షలు తప్పనిసరిగా పడేలా ఆధారాలను సేకరించటంలోనూ ఏసీబీ అధికారులు ఏమాత్రమూ నిర్లక్ష్యం వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

సాయిబాబాకు బీజేపీ క్షమాపణ చెప్పాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అక్రమకేసుల నుంచి నిర్దోషిగా బయటపడ్డ ప్రొఫెసర్ సాయిబాబాకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరును ఆయన బుధవారం ఒక ప్రకటనలో తప్పుపట్టారు. భీమా కోరేగావ్, దేశద్రోహం కేసులతో అనేక మందిని ఇప్పటికే జైళ్లలో నిర్బంధించిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. తెలంగాణలో రెండు రోజులు పర్యటించిన ప్రధాని మోడీ రాష్ట్రానికి ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సహాయం, గిరిజన విశ్వవిద్యాలయం, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించని మోడీ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి ఓట్లు అడగడానికే పర్యటించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పరాభావం తప్పదని హెచ్చరించారు.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించండి

- గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి హస్త కళా ప్రదర్శనను ప్రతి ఒక్కరూ తిలకించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. బుధవారం ఆమె రాష్ట్రపతి నిలయంలో హస్తకళల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరిని భారతీయ చరిత్ర, సంస్కృతి, కళాత్మక సౌందర్యంలో మునిగిపోయే అవకాశం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పీఎం ఫసల్ బీమా ప్రీమియాన్ని రాష్ట్రం భరించడం చారిత్రాత్మకం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పీఎం ఫసల్ బీమా పథకం కింద రాష్ట్ర రైతుల ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుండటం చారిత్రాత్మకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటల నష్టం జరిగిన సందర్భంలో పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా రాష్ట్ర రైతులకు పంట నష్ట పరిహారం అందుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి పీఎం ఫసల్ బీమా యోజనను అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా రాష్ట్ర రైతులకు అండగా నిలిచారని ఆయన కొనియాడారు.

పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి చేయాలి

- మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి చేయాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఎవరికి పిలుపునిచ్చారు. మహిళలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతారావు అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. గ్యాస్ సిలిండర్ రూ. 500లకే ఇస్తుందన్నారు. సునీతారావు మాట్లాడుతూ మహిళ అబల కాదు సబల అన్నారు. అన్ని రంగాల్లో ఒక లెజెండ్‌లా దూసుకుపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నీలిమ, నాయకులు భవానిరెడ్డి, నీలం పద్మ, సదాలక్ష్మి దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వమే జీవోలు ఇచ్చింది

- కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎల్ఆర్ఎస్‌పై గత బీఆర్ఎస్ ప్రభుత్వమే జీవోలు ఇచ్చిందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి చెప్పారు. అప్పుడు మంత్రిగా కేటీఆరే ఉన్నారని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అనధికార లే అవుట్లు, చెరువులు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు అక్రమించి చేసినవేనన్నారు. అక్రమ లేఅవుట్లు జరుగుతుంటే నిద్ర పోయారా? లేకుంటే, బీఆర్ఎస్ నేతలకు దోచుకోవడానికి అనుమతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. భూ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపడుతుందని తెలిపారు.

రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్లను పారదర్శకంగా అమలు చేయాలని తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2024 గిరిజన డైరీని ప్రజాభవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్యే సీతారాం నాయక్, అసోసియేషన్ ప్రతినిధులు పీ నారాయణ నాయక్, ఎమ్ రాంజీ, బీ సురేష్ తదితరులు ఉద్యోగుల సమస్యల్ని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల డైరెక్టర్ల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీల రేషియో ప్రకారం అవకాశం కల్పించాలని కోరారు. విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనలో భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

శివరాత్రికి పోస్టల్ సేవలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాశివరాత్రి సందర్భంగా పోస్టల్ శాఖ వివిధ సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ రంగారావు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పోస్టల్ సర్కిల్ కార్యాలయం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖతో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 8వ తేదీ వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానం, కీసరలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక అభిషేకాలను పోస్టాఫీసుల ద్వారా బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 6 నుంచి 7వ తేదీ వరకు బుకింగ్ సౌకర్యం రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల్లో లభిస్తుందని తెలిపారు. స్పెషల్ అభిషేకం కోసం పోస్టల్ చార్జీలతో కలిపి భక్తులు రూ.255 చెల్లించాల్సి ఉంటుందనీ, ఈ సేవల కోసం స్థానిక పోస్ట్‌మ్యాన్‌ను కూడా సంప్రదించవచ్చని చెప్పారు. ఆయా క్షేత్రాలకు నేరుగా వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాలమూరు శాసనమండలి బరిలో బీఆర్ఎస్

- మాజీ మంత్రి సింగిరెడ్డి వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తామన్నారు. ఈ ఎన్నికలో ఖచ్చితంగా బీఆర్ఎస్ గెలుస్తుందని ఆయన ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం నాయకులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.